thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 51 | కరీంనగర్ శుక్రవారం, 2 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## తెలుగు రాష్ట్రాల మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లు..

చెన్నై: ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబత్తూర్-ధన్‌బాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.06063 కోయంబత్తూర్-ధన్‌బాద్ ప్రత్యేక రైలు ఈ నెల 2,9,16,23 తేదీల్లో కోవైలో ఉదయం 11.50 గంటలకు బయల్దేరి మూడవరోజు ఉదయం 8.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06064 ధన్‌బాద్-కోయంబత్తూర్ ప్రత్యేక రైలు ఈ నెల 5,12,19,26 తేదీల్లో ధన్‌బాద్‌లో ఉదయం 6 గంటలకు బయల్దేరి మూడో రోజు వేకువజామున 3.45 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు సేలం, జోలార్‌పేట, కాట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ మీదుగా వెళ్లనున్నాయి.




# పైలెట్ ప్రాజెక్ట్ సూపర్ సక్సెస్!

## విస్తృత స్థాయిలో ప్రజల్లోకి భూభారతి - మంత్రి పొంగులేటి

### ఈ నెల 5వ తేది నుంచి జిల్లాకు ఒక మండలం చొప్పున 28 మండలాలలో భూ భారతి

### 20 జిల్లాల్లో 45 సదస్సుల్లో స్వయంగా పాల్గొన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ :- తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యలు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా గత నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఏమాత్రం ఆటంకం కలగకుండా ఉండేలా పైలట్‌గా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, నారాయణ్‌పేట్ జిల్లా మద్దూర్, ములుగు జిల్లా వెంకటాపూర్ నాలుగు మండలాల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఇదే సమయంలో ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతిరోజు ఒక మండలంలో రెండు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఈ రెండు సదస్సుల్లో కలెక్టర్లు స్వయంగా పాల్గొనాలని ఆదేశించింది. ఇందుకోసం మండల స్థాయిలో తహశీల్దార్ డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో రెండు బృందాలను ఏర్పాటు చేసింది. ఈ భూభారతి చట్టం రైతులకు అర్థమయ్యే విధంగా చట్టాన్ని అమలు చేసే అధికారులకు ప్రత్యేకంగా శిక్షణా తరగతులు నిర్వహించింది. భూభారతి చట్టంలో కీలక పాత్ర వహించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక సవాల్‌గా తీసుకొని విస్తృత స్థాయిలో జిల్లాల్లో పర్యటించి రోజుకు రెండు, మూడు అవగాహనా సదస్సులలో స్వయంగా పాల్గొన్నారు. ఏప్రిల్ 17వ తేదీనుంచి 30వ తేదీవరకు దాదాపు 20 జిల్లాల్లో సుమారు 45 సదస్సులలో పాల్గొన్నారు. నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో ఏప్రిల్ 17 వ తేదీ నుంచి 30వ తేదీవరకు రెవెన్యూ సదస్సులను పూర్తిచేశారు. ఈ సదస్సుల్లో చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే మరోవైపు ఆయా మండలాల్లో భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రశీదు అందజేశారు. ఒక ప్రత్యేక ఫార్మాట్ లో తయారు చేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సుకు ముందు రోజే ప్రజలకు అందించారు. లింగంపేటలో 3,702, వెంకటాపూర్‌లో 3,969, మద్దూర్‌లో 1,341, నేలకొండపల్లిలో 2,618 మొత్తం 11, 630 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా పీపీబీకి సంబంధించి 3,446, సాదాబైనామాలపై 2,796 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులన్నింటిని ఏరోజుకు ఆరోజు కంప్యూటర్ లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఈ సదస్సుల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ మినహా 605 మండలాలకు గాను 555 మండలాలలో సదస్సులు పూర్తి అయ్యాయి. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూన్ 2వ తేదీ నాటికి ఆ నాలుగు మండలాల్లో భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మరోవైపు హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలాన్నిపైలట్ గా తీసుకొని 28 మండలాల్లో పూర్తిస్థాయిలో భూభారతి చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

**మార్పుకు నాంది : మంత్రి పొంగులేటి...** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం విప్లవాత్మక మార్పుకు నాంది పలకబోతోంది. నూటికి నూరు శాతం ప్రజలే కేంద్ర బిందువుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా ఈ చట్టం ఉంది. ఈచట్టానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో తమ భూ సమస్యలు ఈ భూభారతి చట్టంతో పరిష్కారమవుతాయనే నమ్మకం, విశ్వాసాన్ని రైతులు వ్యక్తం చేశారు. ధరణితో వారు అనుభవించిన కష్టాలను, బాధలను వ్యక్తం చేశారు. ధరణి తో వారు ఎదుర్కొన్న సమస్యలను చెప్తుంటే వారు పడ్డ కష్టం కళ్ళముందే కనిపించింది. రైతుల భూ సమస్యలను వీలైనంత త్వరితగతిన పరిష్కరించడానికి అధికార యంత్రాంగాన్ని సంసిద్ధం చేశాం. ఇకనుండి రైతులు ఏ కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ కార్యాలయంలోనే వాళ్ళ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రజల వద్దకే అధికారులు వచ్చి పైసా ఖర్చు పరిష్కరించే విధానం నిరంతరం కొనసాగుతుంది.

ఈ పైలట్ నాలుగు మండలాలలో కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యలు మినహా అన్ని సమస్యలను జూన్ 2వ తేదీ నాటికి పరిష్కరిస్తాం. ఆ నాలుగు పైలట్ మండలాల మాదిరిగానే ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలంలో పూర్తి స్థాయిలో భూ భారతిని అమలు చేస్తున్నాం. చట్టం తీసుకువస్తే సరిపోదు, ఆ చట్టం పూర్తి స్థాయిలో అమలు జరిగినప్పుడే రైతులకు నిజమైన న్యాయం లభిస్తుంది. ఆ దిశగా మా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.




## నేడు ఢిల్లీ పర్యటనకు సీఎం రేవంత్..

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు (శుక్రవారం) ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రేపు సాయంత్రం ఢిల్లీలో జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ వెళ్తున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ ముఖ్య నాయకులతో పాటు అన్ని రాష్ట్రాల ముఖ్య కాంగ్రెస్ నేతలు హాజరుకానున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కుల గణన అంశంపై ఈ సమావేశంలో ప్రధాన చర్చ జరుగుతుందని సమాచారం. కుల గణనపై కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, విధానాలను ఈ సమావేశంలో చర్చించనున్నారు.





## నేడు తెలంగాణ గవర్నర్‌ను కలవనున్న కాంగ్రెస్ బీసీ నేతలు..

రేపు ఉదయం 10:30 గంటలకు రాజ్ భవన్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు కలవనున్నారు. ఏప్రిల్ 8వ తేదీన బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ శాసన సభలో చేసిన బిల్లుకు ఆమోదం తెలపడంతో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి కాంగ్రెస్ బీసీ నేతలు ధన్యవాదాలు తెలపనున్నారు. అయితే, రేపు (మే 2న) ఉదయం రాజ్ భవన్ తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, కేశవరావు ,మధుయాష్కి గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, దండే విఠల్, విజయశాంతి, నారాయణ, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వాకటి శ్రీహరి, మక్కన సింగ్ రాజ్ ఠాకూర్, ఈర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఇతర ముఖ్య నేతలు ఉన్నారు.



## మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశానికి హాజరుకానున్న కేటీఆర్

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ ఏడాది జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ముఖ్యవక్తగా పిలుస్తూ ఆ సంస్థ ప్రత్యేకంగా కేటీఆర్ ను ఆహ్వానించింది. "భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు" అనే థీమ్ తో ఈ సంవత్సరం ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ సేఠ్ తెలిపారు. కేటీఆర్ తన అనుభవాలను, ఆలోచనలను అంతర్జాతీయ విద్యార్థులు, వివిధ దేశాల నిపుణులతో పంచుకుంటే చర్చలు మరింత ఆసక్తికరంగా ఉంటడంతో పాటు భారత అభివృద్ధి ప్రస్థానం లో భాగం అవ్వడానికి వారందరికీ స్ఫూర్తిగా ఉంటుందని సిద్ధార్థ్ సేఠ్ ప్రస్తావించారు.

# సమ్మె ఆలోచన వద్దు...

## ఆర్టీసీ కార్మికులకు సీఎం విజ్ఞప్తి




హైదరాబాద్ : మే 7 నుంచి తెలంగాణ ఆర్టీసీ కార్మికులు అంతా సమ్మె ప్రారంభించనున్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. కాగా ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతుందని, ఇలాంటి సమయంలో సమ్మె చేయొద్దని ఇప్పటికే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. కాగా తాజాగా సీఎం రేవంత్ రెడ్డి కూడా ఆర్టీసీ కార్మికుల సమ్మెపై స్పందించారు. సమ్మె ఆలోచనను వీడాలని వారిని కోరారు. రవీంద్ర భారతి ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆర్టీసీ సమ్మెపై రేవంత్ స్పందించారు. "కార్మికుల చెమట చుక్కలే ప్రపంచ అభివృద్ధికి బాటలు వేస్తున్నాయి. ప్రపంచంలో ఎన్ని విప్లవాలు వచ్చినా కార్మికుల ఉద్యమం ప్రత్యేకం. తెలంగాణ సాధనలో సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ కార్మికులు, అసంఘటిత కార్మికుల పాత్ర మరువలేనిది" అని వ్యాఖ్యానించారు. "తెలంగాణలో కార్మికులను ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ ముందుకువెళుతున్నాం. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందంటే మీ సహకారం ఎంతో ఉంది. సింగరేణి లాభాలలోకార్మికులకు వాటా ఇచ్చి బోనస్ ఇచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానిది. గత పదేళ్ల నిర్లక్ష్యంతో విద్యుత్ వ్యవస్థ కుప్ప కూలే పరిస్థితి వచ్చింది. ఒక పద్ధతి ప్రకారం నష్టాలను నివారిస్తూ ముందుకు వెళుతున్నాం. ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టాం. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. కార్మికులకు మేలు చేయడమే మా ప్రభుత్వ విధానం" అని తెలిపారు. "అసంఘటిత కార్మికుల కోసం గిగ్ వర్కర్స్ పాలసీని త్వరలో తీసుకురాబోతున్నాం. గత ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్ష చూపింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెను అణచివేసి 50 మంది కార్మికులను పొట్టన పెట్టుకున్నారు. ఆర్టీసీలో సమ్మెపై చర్చలు జరుగుతున్నాయంటున్నారు. ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నా.. సమ్మె ఆలోచన వీడండి. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోంది. ఇది మీ సంస్థ.... దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మికులపైనే ఉంది. గత పదేళ్లలో విధ్వంసం జరిగింది. గత పాలకులు 50 వేల కోట్లు కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ పెట్టారు" అని చెప్పారు. "1 లక్షా 20 వేల కోట్లు ఇతర విభాగాల్లో పెండింగ్ పెట్టి వెళ్లారు. సర్పంచులకు బకాయిలు గత ప్రభుత్వం ఘనకార్యమే కదా. మేం అధికారం చేపట్టే నాటికి ప్రతీ సంస్థలో 8 లక్షల 29 వేల కోట్లు మా చేతికి అప్పు పెట్టి వెళ్లారు. రూ.లక్ష కోట్లు పెట్టి ఆయన కట్టిన కాళేశ్వరం మూడేళ్ళకే కూలింది. రాష్ట్రంలో గత పదేళ్లు ఆర్థిక దోపిడీ జరిగింది. ఈ 15 నెలలు నేను, నా సహచర మంత్రులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకండి. ఏదైనా సమస్య ఉంటే మంత్రిగారితో చర్చించండి. వచ్చే ఆదాయమంతా మీ చేతిలో పెడతాం.. ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచన చేయండి. అణా పైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లేది లేదు.. మీ కోసమే ఖర్చు చేస్తాం" అని హామీ ఇచ్చారు. "రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు.... అందుకే ఒకసారి ఆలోచించండి. కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది. సమ్మె పోటు రాష్ట్రానికి నష్టం చేస్తుంది... ఆర్టీసీ కార్మికులు మా కుటుంబ సభ్యులు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోంది.. మరో ఏడాదిలో కొంత కుదురుకుంటుంది. పదేళ్లు ఏం చేయని వాళు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దు... వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దు. కెసిఆర్ చేసిన గాయాన్ని ప్రజలు ఇంకా మరిచిపోలేదు" అని వ్యాఖ్యానించారు. "అసెంబ్లీకి మీరు పంపిన పిల్లలు ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేయలేదు.. కనీసం ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా అవకాశం ఇవ్వండి.

కపటనాటక సూత్రధారి మళ్లీ బయలుదేరిండు... ప్రజలు అప్రమత్తంగా ఉండండి. ఆర్టీసీ కార్మికులు నన్ను నమ్మండి.. నమ్ముకున్న మీకు అండగా ఉంటా.. త్వరలో రాష్ట్రంలో గిగ్ వర్కర్స్ పాలసీ తీసుకురాబోతున్నాం. ఇది దేశానికి రోల్ మోడల్ గా నిలవబోతోంది. తెలంగాణ రైజింగ్ ను ఎవరూ ఆపలేరు" అని అన్నారు.



# కులగణన.. తెలంగాణ మోడల్ తీసుకోండి

హైదరాబాద్: జన గణనలో కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కులగణన కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. ఈ విషయంలో మొదటిగా ఆయనకు అభినందనలు చెప్పాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "కులగణనపై నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఈ విషయంలో దేశానికి మార్గదర్శకంగా నిలిచాం. దేశంలో అనేక పార్టీలు కులగణన కోరుతున్నాయి. దీనిపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టాం. కులగణన విషయంలో కేంద్రమంత్రుల కమిటీ ఏర్పాటు చేయాలి. అందులో కేంద్రమంత్రులు, సీనియర్ అధికారులను నియమించాలి. తెలంగాణలో బీసీలుగా ఉన్న బోయలు.. కర్ణాటకలో మరో వర్గంలో ఉన్నారు. రాష్ట్రంలో 8వేల పేజీల్లో 57 ప్రశ్నల ద్వారా మేం వివరాలు సేకరించాం. కులగణన విషయంలో తెలంగాణ అనుభవం కేంద్రానికి ఉపయోగపడుతుంది. ఎన్యుమరేటర్ నుంచి సీఎస్ వరకు పలుమార్లు సమీక్ష నిర్వహించాం. అనేక సలహాలు, సూచనలు వచ్చాయి. టోల్‌ఫ్రీ నంబర్ ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పించాం. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా కులగణన చేపట్టాం. తెలంగాణ మోడల్ తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం. అన్ని రాష్ట్రాలకు నిపుణుల కమిటీని పంపాలి. ప్రతి రాష్ట్రంతో మాట్లాడి ఆయా ప్రభుత్వాల సూచనలు తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలి. స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. కులగణన పూర్తయ్యాక ఏం చేస్తారో స్పష్టంగా చెప్పాలి" అని కేంద్ర ప్రభుత్వానికి రేవంత్ సూచించారు.



# పహల్గాం దాడితో.. ఉగ్ర గురువుకు నాలుగింతల భద్రత

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి వెనక లష్కరే తోయిబా కుట్ర ఉందనే అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఈ దాడి తర్వాత నుంచి లష్కరే చీఫ్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హఫీజ్ సయీద్‌కు పాక్ ప్రభుత్వం అమాంతం భద్రత పెంచడమే ఇందుక్కారణం..! గతంతో పోలిస్తే అతడి భద్రతను నాలుగింతలు పెంచినట్లు తెలుస్తోంది.

ఈమేరకు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లాహోర్‌లోని అత్యంత రద్దీగా ఉండే నివాస సముదాయాల నడుమ హఫీజ్ సయీద్ నివసిస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. అతడి ఇంటి చుట్టూ పాక్ ఆర్మీ, ఐఎస్ఐ, లష్కరే ముఠా నిరంతరం పహారా కాస్తున్నట్లు తాజా సమాచారం. దీంతోపాటు కాంపౌండ్ చుట్టూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా డ్రోన్లతో నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.

ఇక, హఫీజ్ ఇంటికి నలువైపులా 4 కిలోమీటర్ల పరిధిలో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను అమర్చారట..! లష్కరే చీఫ్ ఇంటి సమీపంలోకి సామాన్య పౌరులెవరినీ అనుమతించడం లేదని సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రాంతంలో ఆర్మీకి చెందినవి కాకుండా.. ఇతర డ్రోన్లపై నిషేధం విధించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడింది 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ముష్కరులే అయినా.. దీనికి కర్త, కర్మ, క్రియ మాత్రం హఫీజ్ సయీదేనని భారత నిఘా వర్గాలు ఇప్పటికే అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అతడిని లక్ష్యంగా చేసుకొని దాడులు జరగొచ్చన్న అంచనాలతో లష్కరే చీఫ్‌కు పాక్ భద్రత పెంచడం గమనార్హం.

**గతానికి భిన్నంగా.. జనావాసాల్లోనే...** గతంలో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ పాక్‌లో అబోట్టాబాద్‌లోని ఓ రహస్య ప్రాంతంలో తలదాచుకున్నాడు. అది జనావాసాలకు దూరంగా ఉండటంతో అమెరికా దాడులు చేసేందుకు సులువైంది. ఇక మసూద్ అజార్ వంటి ఉగ్రనేతలు కూడా బవహల్‌పూర్ పర్వతాల్లో దాక్కొని అక్కడినుంచే కార్యకలాపాలను సాగిస్తున్నారు. కానీ, వారికి భిన్నంగా హఫీజ్ సయీద్ జనావాసాల మధ్య ఉంటున్నాడు. దీంతో సామాన్య పౌరులకు నష్టం వాటిల్లుతుందనే ఉద్దేశంతో దాడులకు వెనకడుగు వేయొచ్చనేది పాక్ కుటిల యోచనగా తెలుస్తోంది.



# కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దు

హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ రూ.8.15 లక్షల కోట్ల అప్పు చేసి పదవి దిగి వెళ్లిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆ డబ్బులన్నీ ఎక్కడికి పోయాయో ఆనవాళ్లు తెలియడం లేదన్నారు. కేసీఆర్ చేసిన అప్పుల వడ్డీలు చెల్లించేందుకే రూ.1.58 లక్షల కోట్లు అప్పు చేయాల్సి వచ్చిందన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన మే డే వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. " కేసీఆర్ రూ. లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మిస్తే.. అది మూడేళ్లకే కూలిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1000 గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తున్నాం. తొలి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. నూతన రాష్ట్రంగా ఏర్పాటైన నాటికి మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రూ.8.15 లక్షల కోట్ల అప్పుల్లోకి ఎందుకు పోయింది? రాష్ట్రం అప్పులపాలయితే.. కేసీఆర్ కుటుంబానికి పత్రికలు, ఛానెళ్లు, ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి?కనీసం ధర్నా చౌక్‌లో నిరసన తెలిపే హక్కు లేకుండా దాన్ని మూసివేశారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా మన కోర్సులు లేవు. వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలని నిర్ణయించాం. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ప్రభుత్వానికి ప్రతినెలా రూ.18 వేల కోట్ల ఆదాయం వస్తోంది. గత ప్రభుత్వం చేసిన అప్పులపై కిస్తీలకు రూ.6 వేల కోట్లు పోతోంది. ప్రతి నెలా ఉద్యోగుల జీతభత్యాలకే రూ.6 వేల కోట్లు పోతోంది. ప్రతి నెలా రూ.22 కోట్లు వేల కోట్లు వస్తే తప్ప.. ప్రభుత్వ కనీస అవసరాలు తీరవు. సర్పంచ్‌లకు బకాయిలు గత ప్రభుత్వం పెట్టి పోయిందే. ఎక్కడ దొరికితే అక్కడ అడ్డగోలుగా అప్పులు తెచ్చారు. ఆర్థికంగా ఇంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంటే.. కొత్త డిమాండ్లు చేస్తే ఎలా? ఏమైనా సమస్యలుంటే కూర్చొని పరిష్కరించుకుందాం. ఉట్టి తెగిపడాలని మాజీ సీఎం రోజూ శాపనార్థాలు పెడుతున్నారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదని మాజీ సీఎం గుర్తుంచుకోవాలి. కపట నాటక సూత్రధారి మళ్లీ బయటకు వచ్చాడు.. నమ్మి మోసపోవద్దు" అని సీఎం చెప్పారు.



# పాక్ నిఘా నేత్రాలకు భారత్ గంతలు..!

## ఎలక్ట్రానిక్ వార్ఫేర్ వ్యవస్థలను మోహరించిన భారత్: పాక్ విమానాల నేవిగేషన్ జామ్

భారత సైన్యం పాక్ మిలిటరీ విమానాలు లక్ష్యాలను గుర్తించేందుకు వీలులేకుండా ఎలక్ట్రానిక్ వార్ఫేర్(ఈడబ్ల్యూ) వ్యవస్థలను పశ్చిమ సరిహద్దుల్లో మోహరించింది. ఇవి పాక్ సైన్యం వినియోగించే గ్లోబల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్ సంకేతాలను బలంగా అడ్డుకొంటాయి. దీంతో ఆ దేశ సైనిక, పౌర రవాణా విమానాలు వినియోగించే జీపీఎస్ (అమెరికా), గ్లోనాస్ (రష్యా) బైడూస్ (చైనా) నేవిగేషన్ వ్యవస్థలను సమర్థంగా అడ్డుకొంటుంది. దీంతో పాక్ సైనిక విమానాలు, డ్రోన్లు, గైడెడ్ మిసైల్స్ భారత్‌లో లక్ష్యాలను గుర్తించడంలో తీవ్ర గందరగోళానికి గురవుతాయి. ఫలితంగా యుద్ధ రంగంలో ఏం జరుగుతోందో అర్థం చేసుకోలేని స్థితికి పాక్ సైన్యం వెళుతుంది. 2024 సెంటర్ ఫర్ ల్యాండ్ వార్ఫేర్ స్టడీస్ లెక్కల ప్రకారం భారత్ వద్ద ఇలాంటి వ్యవస్థలు దాదాపు 50 వరకు ఉన్నాయి. ఇక వాయుసేన రఫేల్ యుద్ధ విమానాల్లోని స్పెక్ట్రా సూట్స్, నేవీ వినియోగించే శక్తి సిస్టమ్స్ కూడా నేవిగేషన్ సిగ్నల్స్‌ను జామ్ చేయగలవు. ఇక పాకిస్థాన్ విషయానికి వస్తే.. దానివద్ద సొంతంగా తయారుచేసుకొన్న ఎలక్ట్రానిక్ వార్ఫేర్ వ్యవస్థలు లేవు. కానీ, చైనా నుంచి దిగుమతి చేసుకొన్న డీడబ్ల్యూఎల్-002, జర్బా కోస్టల్ ఈడబ్ల్యూ సిస్టమ్ వంటివి ఉన్నాయి. వీటితోపాటు కమర్షియల్ జామర్లను అది వాడుతోంది.

ఇక భారత్ చర్యలతో ఈ ప్రాంతంలో నేవిగేషన్‌తో రోజువారీ చేసే పనుల్లో తీవ్ర అంతరాయం ఏర్పడనుంది. ఏప్రిల్ 22న పహల్గాంలో సందర్శకులపై ఉగ్రదాడి జరిగిన తర్వాత భారత్ తీవ్రస్థాయిలో స్పందించింది. పాక్ తన గగనతలాన్ని మూసివేసింది. మరోవైపు న్యూఢిల్లీ ప్రతిస్పందన ఎలా ఉంటుందో అంచనా వేయలేని పాక్.. తన విమానాలు భారత్‌పై నుంచి కాకుండా వేరే మార్గాలకు మళ్లించింది. ఈనేపథ్యంలో భారత్ ఏప్రిల్ 30 నుంచి మే 23 వరకు పాక్ రవాణా, సైనిక, పౌర విమానాలకు నోటీస్ ఎయిర్‌మన్ (నోటమ్)జారీ చేసింది. దీంతో పాక్ విమానాలు చైనా, శ్రీలంక గగనతలాల మీదుగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

# తెలంగాణలో కులగణన తూతూమంత్రమే: కిషన్‌రెడ్డి




ఢిల్లీ: బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల్ కమిషన్ నివేదికను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. హస్తం పార్టీ బీసీలను పక్కకుపెట్టి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. "2011 జనగణనలో కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాశారు. దేశంలో కులగణన జరిగితే బీసీలకు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. ఏ సామాజిక వర్గం వెనకబడి ఉందో గుర్తించవచ్చు. వెనకబడిన వర్గాల వారికి ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు ఉపయోగపడుతుంది. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకొంటోంది. అలాంటప్పుడు కాంగ్రెస్ గత 60 ఏళ్లలో ఎందుకు చేయలేదు. ఇది రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి భయపడి తీసుకున్న నిర్ణయం కాదు. సామాజిక న్యాయానికి భాజపా కట్టుబడి ఉన్నందున కులగణన నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్‌లా.. ముస్లింలను బీసీల జనాభాలో చేర్చి మోసం చేయం. తెలంగాణ, కర్ణాటకలో కులగణనను కాంగ్రెస్ తూతూమంత్రంగా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది నిజమైన కులగణన కాదు" అని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

# మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీస్తారా?: పహల్గాం ఘటనపై విచారణకు సుప్రీం తిరస్కరణ




ఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ముష్కరులు జరిపిన పాశవిక దాడితో యావత్ దేశం ఉలిక్కిపడింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని దేశమంతా ఒక్కటైంది. ఈ నేపథ్యంలో పహల్గాం దాడిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యాజ్యాలతో మన భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా అని కోర్టు పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. "ఇది చాలా క్లిష్ట సమయం. ఉగ్రవాదంపై పోరులో ప్రతి పౌరుడు చేతులు కలపాలి. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కాస్త బాధ్యతతో వ్యవహరించండి. అందులో సున్నితత్వాన్ని అర్థం చేసుకోండి. ఇలాంటి చర్యలతో మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? మీక్కూడా దేశంపై బాధ్యత ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు" అని ధర్మాసనం సూచించింది. "ఇలాంటి అంశాలను న్యాయ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించొద్దు. ఉగ్రవాద ఘటనల విచారణకు జడ్జీలు నిపుణులు కారు" అని ధర్మాసనం వెల్లడించింది. అయితే, ఇతర రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థుల భద్రత కోసమే తాను ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. విద్యార్థుల కోసమే అయితే హైకోర్టులకు వెళ్లొచ్చని తెలిపింది. కోర్టు సూచనలతో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో ఓ కశ్మీరీ సహా 26 మంది ప్రాణలు కోల్పోయారు. ఈ దాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి గట్టిగా బదులిస్తామని భారత్ స్పష్టంగా చెప్పింది.

# తెలుగులో జవాబులు.. మార్కుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వండి: హైకోర్టు



హైదరాబాద్: టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ పలువురు అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్లపై గురువారం హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. పరీక్షా కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోసారి మూల్యాంకనం చేసేలా టీజీపీఎస్సీని ఆదేశించాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. కొంతమంది అభ్యర్థులు మెయిన్స్ ఫలితాలపై అపోహపడుతున్నారని కోర్టుకు తెలిపారు. నిపుణుల పర్యవేక్షణలోనే మూల్యాంకనం జరిగిందని వివరించారు. తెలుగులో జవాబులు రాసిన వాళ్లకు మార్కులు ఏవిధంగా కేటాయించారని టీజీపీఎస్సీని న్యాయస్థానం ప్రశ్నించగా... ఆయా సబ్జెక్టుల నిపుణులు మూల్యాంకనం చేసి మార్కులు కేటాయించారని తెలిపారు. ఇదే కేసులో బుధవారం కూడా విచారణ జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నామవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తమిళనాడులో ప్రజలకు ఎన్ని భాషలు వచ్చినా తమిళంలోనే మాట్లాడతారని, ఇక్కడమాత్రం ఆంగ్లంలో మాట్లాడిన వారికే ఎక్కువ మర్యాద ఇస్తారని అన్నారు. "ఇది నా స్వీయ అనుభవం కూడా. తెలుగులో గ్రూప్-1 పరీక్ష రాసిన వారికి తక్కువ మార్కులు వచ్చాయన్నది ప్రధాన ఆరోపణ. దీనికి కారణమేమిటో స్పష్టత ఇవ్వాలి. మెయిన్స్ మూల్యాంకనంలో అనుసరించే ప్రాతిపదిక, మార్కుల కేటాయింపు విధానంపై వివరణ ఇవ్వాలి" అని టీజీపీఎస్సీని ఆదేశించారు.

# కమర్షియల్ సిలిండర్ ధర తగ్గింపు.. ఏటీఎఫ్‌లోనూ కోత



హోటళ్లు, రెస్టరంట్లలో వినియోగించే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర తగ్గింది. ఒక్కో సిలిండర్‌పై రూ.14.50 తగ్గిస్తున్నట్లు ప్రభుత్వరంగ చమురు కంపెనీలు ప్రకటించాయి. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ఈ సవరణ చేపట్టాయి. ఇంట్లో వినియోగించే సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. మరోవైపు విమాన ఇంధన ధరలనూ చమరు కంపెనీలు తగ్గించాయి. దేశ రాజధాని దిల్లీలో కిలో లీటరుకు 4.4 శాతం మేర తగ్గించాయి. అంటే రూ.3,954 మేర తగ్గింది. దీంతో కిలోలీటర్ 85,486.80కు దిగొచ్చింది. ఏప్రిల్ 1న కూడా ఏటీఎఫ్ ధరల్ని 6.15 శాతం (రూ.5,870) మేర చమురు కంపెనీలు తగ్గించాయి. ఏటీఎఫ్ ధరలు తగ్గడం వరుసగా ఇది రెండోసారి. తగ్గిన ధరలతో ఆ మేర విమానయాన సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది.

# ఓరయ్యో.. స్మగ్లింగ్ ఇలా కూడా చేస్తారా..

హైదరాబాద్, మే 1: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా పట్టుబడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఎయిర్‌పోర్టులో దాదాపు 3.5కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు సీజ్ చేశారు. ఈ బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద నుంచి 3.5 కిలోల బంగారం డీఆర్ఐ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు 30 బంగారం బిస్కెట్‌లను మూడు జేబుల్లో అమర్చుకొని వస్తుండగా అధికారులు గుర్తించారు. బంగారం అక్రమ రవణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మస్కట్ నుంచి వచ్చిన విమానంలో అనుమానస్పదంగా ఉన్న వ్యక్తిని డీఆర్ఐ అధికారులు గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా.. దాదాపు మూడు కిలలోకు పైగా బంగారం లభించింది. అలాగే ఈ బంగారానికి ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేవని గుర్తించారు. దుబాయ్‌లో బంగారం ధర తక్కువగా ఉండటంతో అక్కడి నుంచి ఇక్కడకు స్మగ్లింగ్ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. కాగా.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తరచూ బంగారం పట్టుబడటం చూస్తుంటాం. కొందరు వ్యక్తులు వివిధ రూపాల్లో బంగారాన్ని తరలించేందుకు యత్నిస్తుంటారు. ముఖ్యంగా దుబాయ్ నుంచి బంగారాన్ని ఇక్కడకు అక్రమంగా తీసుకువచ్చి క్యాష్ చేసుకోవాలని భావిస్తుంటారు. ఇందులో కొత్త కొత్త రీతుల్లో బంగారాన్ని తరలించేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తుంటారు. అయితే ఇలాంటి వాళ్ల ఆటకట్టిస్తుంది డీఆర్ఐ. విదేశాల నుంచి వచ్చే వారిలో అనుమానాస్పదంగా ఉన్న వారిని గుర్తించి వారి తనిఖీ చేసి మరీ వారి వద్ద ఉన్న బంగారాన్ని సీజ్ చేస్తుంటారు. ముఖ్యంగా దుబాయ్ నుంచి వచ్చే వారిని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తుంటారు. కొన్ని సార్లు బంగారం అక్రమ రవాణా గురించి ముందస్తుగా సమాచారం అందుకుని మరీ వారిని అడ్డుకుంటారు అధికారులు. ఈ మధ్య కాలంలో శంషాబాద్ విమానశ్రయంలో బంగారం స్మగ్లింగ్ కాస్త తగ్గిందనే చెప్పుకోవాలి.

# మేడే స్ఫూర్తితో తెలంగాణలో అసమానతలు తొలగిపోయేలా కృషి చేయాలి



హైదరాబాద్: భౌగోళిక తెలంగాణ తెచ్చుకున్నప్పటికీ.. సామాజిక తెలంగాణ సాధించలేకపోయామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మేడే సందర్భంగా కార్మికులకు కవిత శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ(గురువారం) తెలంగాణ భవన్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. సామాజిక తెలంగాణ దిశగా భవిష్యత్తు అడుగులుండాలని చెప్పారు. మేడే స్ఫూర్తితో తెలంగాణలో అసమానతలు తొలగిపోవటానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ. 8లక్షలు ఉంటే.. వికారాబాద్‌లో లక్ష 58వేలు మాత్రమేనని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. పది కిలోమీటర్లు దూరంలోనే ఇంత వ్యత్యాసం ఉండటం ప్రమాదకరమని అన్నారు. అసమానతలు తొలగిపోవడానికి మేడే స్ఫూర్తి కావాలని చెప్పారు. రైతుబంధు కింద ఎకరం ఉంటే రూ.10 వేలు.. పది ఎకరాలుంటే లక్ష రూపాయలు ఇచ్చామని.. కానీ భూమి లేని కార్మికులకు ఏమీ చేయలేకపోయామని తెలిపారు. భవిష్యత్తులో భూమి ఉన్నా.. లేకున్నా ఎలా ఆదుకోవాలనే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని సూచించారు. మే 20వ తేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మికుల సమ్మెకు జాగృతి మద్దతు ఇస్తోందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

# సినిమాల్లో సఫలం.... వైవాహిక జీవితంలో విఫలం

## సావిత్రి లాగే దేవిక జీవితం దుఖాంతం - మే 2...అలనాటి అందాల నటి దేవిక జయంతి



సినిమా పరిశ్రమలో చాలామంది కథానాయికలు తమ అందచందాలతో, గ్లామర్ తో, హావ భావాలతో, శారీరిక సౌష్టవంతో నటనతో రాణించి, ప్రేక్షకుల హృదయాలను దోచి, చిత్రాలను బాక్సాఫీస్ రికార్డులపరం చేసి, నిర్మాతలకు ఊహించని డబ్బులు సంపాదించి పెట్టారు. అయితే కొందరు అదే సమయాలలో, కారణాలు ఏవైనా, మహానటి సావిత్రి లాగా తమ వైవాహిక జీవితంలో చేసిన తప్పుల కారణంగా భారీగా మూల్యం చెల్లించుకున్న ఘటనలను కూడా ఇప్పటివరకు లేక పోలేదు. అలాంటి కొద్దిమంది అభాగినులలో అలనాటి మేటి నటి దేవిక ఒకరు. దేవిక (1943 – మే 2, 2002) ఒకనాటి తెలుగు సినిమా బిజీ నటి. 1960, 70 దశకాలలో అందాల తారగా తెలుగు, తమిళ సినీరంగాలలో వెలుగొందింది. తెలుగు, తమిళ, మలయాళంలలో 150కి పైగా సినిమాలలో నటించింది. చిత్తూరు జిల్లా చంద్రగిరి ప్రాంతానికి చెందిన దేవిక అసలు పేరు ప్రమీలాదేవి. ఎన్టీస్ రామారావుతో కథానాయిక గా రేచుక్క అనే సినిమాలో తొలిసారి నటించింది. అత్తా ఒకింటి కోడలే, కంచుకోట, ఆడ బ్రతుకు సినిమాలు ఆమెకు ఎంతో గుర్తింపు తెచ్చి పెట్టాయి. ఎన్.టి.రామారావు నిర్మించిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర సినిమాలో చివరి సారిగా నటించారు. ఆమె తెలుగు సినిమాకు ఆద్యునిగా భావించే రఘుపతి వెంకయ్య బంధువు. మొదట రంగస్థల నటిగా జీవితాన్ని ప్రారంభించిన దేవిక ఎస్.వి.సహస్రనామం బృందం ప్రదర్శించిన అనేక నాటకాలలో వివిధ పాత్రలు పోషించింది. ముక్తా శ్రీనివాసన్ దర్శకత్వం వహించిన ముదలలిలో నటించిన తర్వాత దేవిక సినీరంగంలో ప్రాచుర్యం పొందింది. ఆ సమయంలోనే ఈమె అందానికి, నటనకు ముగ్ధులైన సినీరంగానికి చెందిన కొందరు దేవికకు పిలిచి సినీ అవకాశాలు ఇచ్చారు. ఈమె ఎన్టీ రామారావుతో హీరోయిన్‌గా 'రేచుక్క' అనే సినిమాలో తొలిసారి నటించింది. ఆ తర్వాత తెలుగు, తమిళ, మలయాళంలలో 150కి పైగా సినిమాలలో నటించింది. 1960, 70 దశకాలలో అందాల తారగా తెలుగు, తమిళ సినీరంగాలలో వెలుగొందింది. అయితే అప్పట్లో నటి దేవిక తెలుగు, తమిళ భాషలలోని స్టార్ హీరోలతో వరుస చిత్రాలతో నటిస్తూ బాగానే రాణించింది. దీంతో తెలుగు, తమిళంలో బాగా పేరొందిన ఓ స్టార్ హీరోయిన్ దేవిక కు సినిమా అవకాశాల విషయంలో అడ్డు పడుతున్నారని అప్పట్లో టాక్ వినిపించింది. అయితే ఎందరికో సినీ పరిశ్రమలో చేయూ తను అందించిన నందమూరి తారక రామా రావు... మాత్రం దేవికకు దాదాపుగా తెలుగులో 20 కి పైగా చిత్రాలలో నటించే అవకాశాలను ఇప్పించారు. అంతగా వీరిద్దరి మధ్య చాలా సాన్నిహిత్యం ఉండేదని అప్పట్లో అంటుండేవారు. అయితే వరుస సినిమా అవకాశాలతో దూసుకుపోతున్న సమయంలో దేవిక సినిమా పరిశ్రమలో పలు చిత్రాలకు అసిస్టెంట్ దర్శకుడిగా పని చేసిన "దేవదాసు" అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. తర్వాత తన భర్తని దర్శకుడిగా సినిమా పరిశ్రమకు పరిచయం చేసేందుకుగాను తాను కష్టపడి కూడబెట్టుకున్న ఆస్తులను అమ్మేసింది. అయినప్పటికీ తన భర్త మాత్రం ప్రేక్షకులను ఊహించిన విధంగా రాణించలేక పోయాడు. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్ధలు, విభేదాలు వచ్చాయి. తర్వాత తమిళ సినిమాల్లో నటించిన తన కూతురు కనక తో కలిసి కడు బాధా కరమైన శేష జీవితం గడిపింది. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర (1984), ఆడవాళ్ళు అలిగితే (1983), నయా దిన్ నయీ రాత్ (1974) (హిందీ), పాపం పసివాడు (1972), చిన్ననాటి స్నేహితులు (1971), ఇజ్జత్ (1968) (హిందీ), నిలువు దోపిడి (1968), భామా విజయం (1967), శ్రీకృష్ణా వతారం (1967) – రుక్మిణీ, తిరువిల యాడల్ (1965) (తమిళం) – శెంబగ పాండ్యన్ భార్య, పెంపుడు కూతురు (1963), కర్ణ (1963) – శుభాంగి ,రక్త సంబంధం (1962), మహామంత్రి తిమ్మరుసు (1962) – అన్నపూర్ణ, దక్షయజ్ఞం (1962) – సతీదేవి, గాలిమేడలు (1962), బలే పాండియ (1962), బంధ పాశమ్ (1962) (తమిళం), మన్ మౌజీ (1962) (హిందీ), నెంజిల్ ఒరే ఆలయమ్ (1962) (తమిళం) – సీత, టాక్సీ రాముడు (1961), పెండ్లి పిలుపు (1961), ఘరానా (1961) (హిందీ), పాప పరిహారం (1961), పావమణిప్పు (1961) (తమిళం) – క్రైస్తవ సహాయకురాలు, శభాష్ రాజా (1961), మాంగల్యం (1960), సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి (1960), శాంతి నివాసం (1960), శభాష్ రాముడు (1959), ఘర్ సన్సార్ (1958) (హిందీ) – భారతి, వరుడు కావాలి (1957), రేచుక్క (1954) – లలితాదేవి తదితర చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయింది. ఎన్.టి.రామారావు నిర్మించిన 'శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర' సినిమాలో చివరి సారిగా నటించింది. ఆ తర్వాత సినీ పరిశ్రమకు దూరమైంది. 2002 మే 2వ తేదీ తెల్లవారు జామున మద్రాసులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అస్వస్థతతో మరణించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# యుద్ధ భయం.. బంకర్లలో తలదాచుకుంటున్న పాక్ ప్రజలు!



పహల్గాం దారుణ ఉగ్రదాడి తర్వాత భారతదేశం పొరుగు దేశం పాక్ మీద తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఈ దాడిలో అమాయకులైన 28మంది టూరిస్టులను ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. ఆ తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత దిగజార్చాయి.

ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోననే భయంతో సరిహద్దుల్లోని పాకిస్తాన్ ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. తమ ప్రాణాలను కాపాడుకునేందుకు వారు బంకర్లలో తలదాచుకుంటున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ బంకర్లలో ఆశ్రయం పొందుతున్నారు. ఇరు దేశాల మధ్య ఘర్షణలు జరిగితే తమకు ప్రాణ నష్టం వాటిల్లుతుందనే భయంతోనే వారు ఇలా చేస్తున్నామని చెబుతున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. భయం గుప్పిట్లో సరిహద్దు గ్రామాలు భారత్, పాకిస్తాన్ సరిహద్దుల్లోని గ్రామాలు నిత్యం భయం గుప్పిట్లో జీవిస్తున్నాయి. గతంలో జరిగిన ఘర్షణల అనుభవాల దృష్ట్యా, ప్రజలు తమ భద్రత కోసం సొంతంగా బంకర్లను నిర్మించుకున్నారు. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ బంకర్లు వారికి ఆశ్రయం కల్పిస్తున్నాయి. చాలా మంది ప్రజలు తమ నిత్యావసర వస్తువులతో సహా బంకర్లలోనే ఉంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో భయం మరింత ఎక్కువగా ఉండటంతో చాలా కుటుంబాలు బంకర్లలోనే నిద్రిస్తున్నాయి. %యాశ్రీంశీ =ఝుం% – ధర్మాన దారెటు?.. రాజకీయ సన్యాసమేనా..! ప్రభుత్వాల చర్యలు భారత ప్రభుత్వం ఇప్పటికే త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని వార్తలు వస్తున్నాయి. అయితే పాకిస్తాన్ ప్రభుత్వం మాత్రం తమ ప్రజలకు భరోసా కల్పించే ప్రయత్నం చేస్తోంది.

పరిస్థితిని అదుపులో ఉంచడానికి దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కానీ సరిహద్దుల్లోని ప్రజల్లో మాత్రం భయం వీడటం లేదు. అంతర్జాతీయ సమాజం ఆందోళన భారత్, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై అంతర్జాతీయ సమాజం కూడా ఆందోళన వ్యక్తం చేస్తోంది. రెండు దేశాలు సంయమనం పాటించాలని, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని పలు దేశాలు సూచిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి కూడా ఈ విషయంపై దృష్టి సారించింది.

# 'అన్నల' సామ్రాజ్యంలో కేంద్రం పాగా!

అడవిలో అన్నలకు శతృదుర్భేధ్యమైన అనేక ప్రాంతాల్లో కేంద్రం పాగా వేస్తోంది. ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని మావోయిస్టులకు కంచుకోటల వంటి.. వాటిని స్వాధీనం చేసుకుని.. జాతీయ పతాకాన్నిరెపరెపలాడిస్తోంది. ఇప్పటికే కీలకమైన హిడ్మా సామ్రాజ్యం (ఛత్తీస్‌గఢ్)లో కేంద్రం పాగా వేసింది. అక్కడ జాతీయ జెండా కూడా నాటింది. ఒకప్పుడు హిడ్మా సామ్రాజ్యం అంటే.. అందరూ అధిరిపోయేవారు. అలాంటి హిడ్మా సామ్రాజ్యంలోనే కేంద్రం రెండు మాసాల కిందట చొచ్చుకుపోయి.. మావోయిస్టులను ఏరే సింది. ఆపరేషన్ కగార్ పేరుతో చేపట్టిన యాక్షన్‌ను బలంగా నిర్వహిస్తోంది. %యాశ్రీంశీ =ఝుం% – వైసీపీలో 'రెడ్లు' కూడా.. ఇంతేనా ..! ఈ క్రమంలోనే తాజాగా.. మరో మావోయిస్టు సామ్రాజ్యంగా పేరున్న తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య ఉన్న ములుగు జిల్లా లోని మావోయిస్టు దుర్భేధ్య అటవీ ప్రాంతం కర్రెగుట్టలపై కేంద్ర బలగాలు జాతీయ జెండాను రెపరెపలాడించాయి. ఇదేమీ చిన్న విషయం కాదు.. మైదాన ప్రాంతానికి ఏకంగా 5–7 వేల అడుగుల ఎత్తున ఉన్న కొండలపై విస్తారమైన అటవీ ప్రాంతంలో మావో యిస్టులు తమ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కీలక సమావేశాలు సహా..



యువ మావోయిస్టులకు శిక్షణ కూడా ఇక్కడే ఇస్తారు. పైగా.. వారు చేపట్టే గెరిల్లా ఆపరేషన్ల.. తంత్రాలన్నీ ఇక్కడ నుంచే జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టులకు అత్యంత అనుకూల ప్రాంతంగా దాదాపు 7 దశాబ్దాలకుపైగానే..కర్రెగుట్టల ప్రాంతం గుర్తింపు పొందింది. చిట్టడవిని తలపించే వన్య ప్రాంతంలో కనీసం ఎదురుగా ఉన్న మనిషిని కూడా గుర్తించలేనంత గుబురుగా చెట్లు ఉంటా యి. అలాంటి ప్రాంతంలో గత 10 రోజులుగా కేంద్ర భద్రతా బలగాలు.. ఆపరేషన్ కగార్‌ను నిర్వహిస్తున్నాయి. 1200 మంది దళాలు.. ఇక్కడ నిరంతరం మావోయిస్టుల కోసం గాలిస్తున్నా.. కర్రెగుట్టల్లోని సగం ప్రాంతానికి మాత్రమే చేరుకోగలిగాయంటే.. ఎంత దుర్భేధ్య ప్రాంతమో అర్థమవుతుంది. కాగా.. తాజాగా ఈ ప్రాంతంలోని సగ భాగం తమ వశం చేసుకున్న కేంద్ర భద్రతా బలగాలు.. జాతీయ పతాకాన్ని ఆవిష్క రించాయి. తెలంగాణ సరిహద్దులోని కొత్తపల్లి నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని పూజారికాంకేరు, నంబి, గల్‌గం, నడిపల్లి వరకు మావోయిస్టుల ప్రాంతం ఉంది. ఇక్కడ దాదాపు అందరూ అన్నలకు సాయం చేస్తారన్న పేరుంది. దీంతో కూంబింగ్ నిర్వహిస్తున్న ప్రాంతంలో ప్రజలను భద్రతాధికారులు ఇప్పటికి రెండు నుంచి మూడు సార్లు ప్రశ్నించాయి. ఏదేమైనా.. అన్నల సామ్రాజ్యంలో కేంద్రం మరో జెండా పాతడం ప్రభుత్వ పరంగా విజయమేనని అంటున్నారు మేధావులు.

# తల్లిదండ్రులకు భారం కాలేం..

# డెలివరీ బాయ్స్‌గా బీటెక్ పట్టభద్రులు

హైదరాబాద్‌లో విస్మయానికి గురిచేసే దృశ్యం కనిపిస్తోంది. ఉద్యోగం కోసం నగరానికి వచ్చిన యువకులు ఫుడ్ డెలివరీ, రైడ్ పూలింగ్ సర్వీసుల్లో పనిచేస్తూ కనిపిస్తున్నారు. వారిని ఎవరిని కదిలించినా తాము బీటెక్, ఎంబీఏ, డిగ్రీలు పూర్తి చేశామంటూ చెబుతున్నారు. కాలేజీల్లో సరైన నైపుణ్య శిక్షణ లేకపోవడంతో ఉద్యోగాలు రావడం లేదని, కాలేజీలు ప్లేస్‌మెంట్స్ కూడా ఏర్పాటు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులకు భారం కాకుడన్న ఉద్దేశంతోనే ఇలాంటి పనులు చేస్తున్నట్లు వారు చెబుతుంటే విన్నవాళ్ల గుండెలు తరుక్కుపోతున్నాయి. హైదరాబాద్ వీధుల్లో తిరుగుతుంటే ఇలాంటి వారిని చాలా మంది గమనించే ఉంటారు. చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్క ఎంతో మంది ఉన్నత విద్యావంతులు ఫుడ్ డెలివరీ





బాయ్స్‌గా, క్యాబ్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వారి మాటల్లో నిరాశ, ఆవేదన స్పష్టంగా కనిపిస్తోంది. లక్షలకు లక్షలు పోసి చదివినా తమకు అందుకు తగ్గ సరైన గుర్తింపు, ఉద్యోగం లభించడం లేదని వారు వాపోతున్నారు. కాలేజీల్లో కేవలం సిలబస్‌ను పూర్తి చేయడం మీదనే దృష్టి పెడుతున్నారని, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్లేస్‌మెంట్స్ విషయంలో కూడా కాలేజీలు సరైన శ్రద్ధ చూపడం లేదని చెబుతున్నారు. దీంతో చదువు పూర్తి చేసిన తర్వాత కూడా ఉద్యోగం కోసం వీధుల్లో తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు బరువైన గుండెలతో చెబుతున్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమను చదివిస్తే.. వారికి భారం కాకూడదనే ఉద్దేశంతోనే ఇలాంటి పనులు చేస్తున్నామని ఆ యువకులు చెబుతున్నారు. తమకు మంచి ఉద్యోగం వస్తే ఈ కష్టాలన్నీ తీరిపోతాయని ఆశిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఈ నిరుద్యోగ సమస్య ప్రభుత్వాలు, విద్యాసంస్థలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# విశిష్టాద్వైత మతోద్ధారకుడు రామానుజుడు

## – రామాను జాచార్యుల జయంతి సందర్భంగా

రాజాదరణ పొంది ప్రాబల్యాన్ని సంతరించుకున్న జైన, బౌద్ధ, శైవ మతాలు స్థానిక ఆచార వ్యవహారాలలో కలసి, అనేకానేక శాఖలుగా విభజితాలై, వేర్వేరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ తమ శాఖలు గొప్పవని నొక్కి చెబుతూ, మూల ఉపనిషత్తుల సారాన్ని ప్రజలకు చేరువ చేయజాలని సమయాన, విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించి ఉద్ధరించారు శ్రీ రామానుజాచార్యులు. త్రిమతాచార్యులలో, ద్వితీయులైనా, కర్తవ్య నిర్వహణలో అద్వితీయులు. అసమాన ధైర్యాన్ని ప్రదర్శించి, సాటిలేని భక్తి తత్పరు నిగా తత్వవేత్తగా, ఆస్తిక హేతువాదిగా, పరమ యోగిగా, శంకర భగవత్పాదుల అద్వైత సిద్ధాంతం లోని దోషాలను సరిదిద్ది, నాటికి ప్రబల ప్రచారంలో ఉన్న సంప్రదాయాలన్నీ, దేవుడిని కొలవడానికి భిన్న మార్గాలే కాని, వైదిక మతానికి బదులుగా పాటించాల్సినవి కానే కాదని నొక్కి చెప్పిన ధీశాలి ఆయన. రామానుజులు జన్మించేనాటికి చోళులు, శైవ మతానుయాయులు అయినప్పటికీ, వైదిక మతాలను వ్యతిరేకించ లేదు. చాళుక్యులు శైవ మతస్తులు అయి ఉండి, తర్వాత జైన మతాన్ని ఆలపించారు. హొయసల రాజులు, జైన, వీరశైవ మతాలను ఆదరించారు. మౌర్యుల కాలానికి బౌద్ధం క్షీణ దశకు చేరుకుంది. మద్రాసుకు 30 మైళ్ళ దూరాన గల, శ్రీపెరుంబుదూరులో, హరిత గోత్రోద్భవులు, ఆపస్తంభ సూత్ర, యజుర్వేద శాఖాధ్యాయులు, శ్రీమాన్ అసూరి సర్వ క్రతు కేశవ సోమయాజి దీక్షితార్ మరియు కాంతిమతి దంపతులకు కలియుగ సంవత్సరం 4118 క్రీస్తు శకం1017 వైశాఖ శుక్ల పక్ష షష్టి గురువారం జనన మొందారు. కేశవ తన కుమారునికి, ప్రాథమిక విద్య స్వయంగా నేర్పగా, అనంతరం కాంచీపురానికి వెళ్లి యాదవ ప్రకాశుల వద్ద వేదాంతం అభ్యసించి, మూలానికి వ్యాఖ్యానం చేయడంలో గురు – శిష్యులకు భేదాభిప్రాయాలు కలువగా తమ విశిష్టాద్వైతాన్ని నెగ్గించుకున్నారు రామానుజులు. దీనితో గురువు కాశీకి కలసి తమతో పయనమైన, శిష్యుడిని చంపించే కుట్ర చేయగా, అది తెలుసుకుని, తప్పించుకొని కంచికి చేరారు. శ్రీరంగంలోని వైష్ణవ గురువైన అలవందారు, రామానుజుని ప్రతిభ గురించి విని శిష్యుడైన, పెరియ నంబిని పంపగా, వెనువెంటనే ఆయన పయనమయ్యారు. రామానుజుడు, శ్రీరంగం చేరే సమయానికి, ఆలవందారు తుది శ్వాస వదిలారు. భౌతిక దేహ వేళ్లలో, 3 విచిత్రంగా ముడుచుకొని ఉండడాన్ని గమనించారు. ఆయన మూడు కోరికలు తీరకుండా ఉండిపోయారని, అలవండారు శిష్యుల ద్వారా విని, మూడు కోరికలు అయిన, బ్రహ్మసూత్రాలకు, సహస్ర నామాలకు, తరువాయి మొళికి వ్యాఖ్యానాలు రాస్తామని, వాగ్దానం చేయడంతో మూడు వేళ్ళు తెరుచుకున్నాయని చెబుతారు. తర్వాత మధురాంతకంలో పెరియ నంబికి శిష్యులుగా మారారు. విద్యాభ్యాస సమయాన, తన భార్య గయ్యాలి తనం కారణంగా, గురువు శ్రీరంగం వెళ్లనందుకు నొచ్చుకున్న రామానుజులు, సంసార బంధం వీడి, సన్యాసాశ్రమం స్వీకరించారు. తిరు కోటి యార్ నంబి ప్రఖ్యాతి విని, తనను శిష్యునిగా స్వీకరించమని, ఆరు మార్లు ప్రాధేయ పడినా, ఫలితం లేక పోగా, ఏడవ సారి చేర బిలిచి, మంత్ర రహస్యం ఎవరికీ చెప్ప కూడదని వాగ్దానాన్ని పొంది, ఉపదేశం చేశారు. మోక్ష సంపాదనకు ఆ మంత్ర శక్తి సాధనం లేదని భావించి, ఒక వైష్ణవాలయం గోపురం ఎక్కి, గురువుకు చేసిన ప్రమాణాన్ని పక్కన పెట్టి, ఉపదే దేశిత మంత్రాన్ని, బహిరంగంగా ఎలుగెత్తి ప్రకటించారు. గురువు కోపంతో నరకానికి వెళతావు అని అన్నప్పుడు, జన




సమూహానికి మోక్షం లభిస్తే, తాను ఒక్కడు నరకానికి వెళ్ళడానికి సిద్ధమని బదులు ఇచ్చారాయన. శిష్యుని ఉన్నత ఆదర్శానికీ, సంతోషించి, గురువు ఆశీర్వదించారు. అద్వైత వేదాంతి యగు, యజ్ఞమూర్తితో, శ్రీరంగంలో 16 రోజులు వాదించి, ఓడించగా, ఆయన శైవం పుచ్చుకున్నారు. బ్రహ్మసూత్రాలకు భాష్యం, వేదాంత సారం, వేదాంత దీపం, వేదాంత దీపిక, వేదార్థ సంగ్రహం శ్రీరంగ గద్యం, వైకుంఠ గద్యం, మొదలైన రచనలు చేశారు. తిరుపతి దేవస్థానంలో పూజాదికాలపై, తగాదా రాగా రామానుజులు మధ్యవర్తిగా ఉండి, వైష్ణవ ప్రాబల్యానికి కట్టుదిట్టం చేశారు. చేసిన వాగ్దానం ప్రకారం బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానాలు రాయగా, పరాశర బట్టు చేత సహస్ర నామాలకు, తమ చుట్టమైన తిరుక్కురైప్పిరన్ చేత తిరువాయి మొలి మీద వ్యాఖ్యానాలు రాయించారు. కావేరీ తీర సాలిగ్రామం అనే చోట 12ఏళ్లు నివసించి, జైనులను ఓడించి, బిత్తి దేవుని వైష్ణవునిగా మార్చారు. చాత్తాద శ్రీవైష్ణవులు అమ్మంగార్ల కైంకర్యం చేసే సంప్రదాయాలను ఏర్పరిచారు. మేల్కోటలో, రామ ప్రియ అనే విగ్రహాన్ని తెప్పించి, ప్రతిష్ఠింపజేసి, రథోత్సవం నాడు ఆలయంలో పంచములకు ప్రవేశం కల్పించారు. శ్రీరంగంలో మత ప్రచారానికి 74 మంది శిష్యులను నియమించారు. వ్యాస సూత్ర భాష్యం గీతా భాష్యం, తర్క భాష్యం తదితరాలు రాయడం చేత "భాష్యకారుడు" అని త్రిదండి కావడం వల్ల "యతి రాజు" అని, "ఎంబరు మానారు" అని, లబ్ద ప్రతిష్టులు అయినారు. రామానుజులు ఆనాటి ఆచార వ్యవహారాలు, చాందసంగా మారి, సామాజిక ప్రగతికి అడ్డు రాకముందే, గుర్తించి వాటిని, మానడమో, మార్చడమో చేయాలని కర్తవ్య నిర్దేశం చేశారు. గురువు చెప్పేదంతా గుడ్డిగా నమ్మక తర్కానికి గురిచేసి, తప్పో, ఒప్పో నిర్ణయించు కోవడం పాపం కాదని, హితవు పలికారు. సమాజ శ్రేయస్సు కన్నా, వ్యక్తిగత శ్రేయస్సు ముఖ్యం కాదని రామానుజులు నొక్కి చెప్పారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు

## సంపాదకీయం

# పాక్ పక్కలో బల్లెంతో భారత్ కరచాలనం!

పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్ ను గట్టిగా కొట్టే ప్రయత్నాల్లో నిమగ్నమై ఉన్నట్లు కనిపిస్తున్న భారత్.. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదాన్ని వ్యతిరేకించే పలు బలమైన దేశాల మద్దతు కూడగట్టింది. ఇందులో అమెరికాతో పాటు యూకే, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, మొదలైన దేశాలున్నాయి. ఇదే సమయంలో పాక్ శత్రువులను భారత్ కలుపుకుపోతుంది. అవును... పహల్గాం ఊచకోతపై పాకిస్తాన్ కు వ్యతిరేకంగా చర్య తీసుకునేందుకు ముందుకు వస్తున్న ఆఫ్ఘనిస్తాన్ లోని తాలిబన్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని భారతదేశం తనవైపు తీసుకుంటోంది. ఖైబర్-పఖ్తుంఖ్వాలో లో తాలిబన్ సంబంధిత తిరుగుబాటును పాక్ ఎదుర్కొంటున్న వేళ.. కాబూల్ తో భారత్ చర్చలు జరిపింది. దీంతో... ఈ సమయంలో కాబూల్ తో దౌత్యం భారత్ యొక్క ఒక తెలివైన వ్యూహాత్మక చర్యగా పలువురు అభివర్ణిస్తున్నారు. ఈ సమయంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి భారత ప్రత్యేక ప్రతినిధి ఎం ఆనంద్ ప్రకాష్.. కాబూల్ లో ఆఫ్ఘనిస్తాన్ విదేశాంగ మంత్రి మౌల్వీ అమీర్ ఖాన్ ముత్తాకిని కలిశారు. తాజా పరిణామాలపై చర్చించారు! వాస్తవానికి భారత ప్రతినిధి బృందంతో సమావేశానికి ముందే.. తాలిబన్ నేతృత్వంలోని ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం పహల్గాం దాడిని తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా స్పందించిన తాలిబన్ ప్రతినిధి అబ్దుల్ ఖహార్ బాలీ?... పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన దాడిని ఇస్లామిక్ ఎమిరేట్స్ ఆఫ్ ఆఫ్ఘనిస్తాన్ విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఇదే సమయంలో.. ఆ ఉగ్రదాడిలో మృతి చెందినవారి కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. దీంతో... పాక్ - ఆఫ్ఘాన్ సంబంధాలు క్షీణిస్తున్నందున.. న్యూఢిల్లీ, కాబుల్ మధ్య పెరుగుతున్న సమన్వయాన్ని సూచిస్తుందని అంటున్నారు. కాగా.. గత కొంతకాలంగా తాలిబన్లతో పాకిస్థాన్ సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ప్రధానంగా... ఆఫ్ఘన్ శరణార్థులను బహిష్కరించాలని ఇస్లామాబాద్ తీసుకున్న నిర్ణయం అనంతరం ఈ దూరం మరింత తీవ్రమైందని చెబుతారు. ఈ నేపథ్యంలోనే... పాక్ పక్కలో బల్లెంలా మారిన ఆఫ్ఘన్ తో భారత్ కరచాలనం ప్రస్తుతం పరిస్థితుల్లో ఇస్లామాబాద్ కు బ్యాడ్ న్యూస్ అని చెబుతున్నారు.

# సమాజ సేవలో మమేకమైన పద్మజా నాయుడు - మే 2...పద్మజా నాయుడు వర్ధంతి



పద్మజా నాయుడు (నవంబర్ 17, 1900 – మే 2, 1975)

స్వాతంత్ర్య సమర యోధురాలు, కవయిత్రి, సుదీర్ఘ కాలం పాటు గవర్నర్ గా పని చేసిన మహిళ. ఆమె హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సంయుక్త వ్యవస్థాపకురాలు. పురుషుల ఆధిపత్య ప్రజా రంగంలో, సామాజిక సేవకురాలిగా, రాజకీయ నాయకురాలిగా, పాలకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. పద్మజా నాయుడు 1900 నవంబర్ 17న హైదరాబాద్‌లో జన్మించారు. ఆమె (బెంగాలీ) తల్లి ప్రఖ్యాత కవి, భారత స్వాతంత్ర్య సమర యోధురాలు సరోజిని నాయుడు. ఆమె (తెలుగు) తండ్రి ముత్యాల గోవిందరాజులు నాయుడు వైద్యుడు. ఆమెకు జైసూర్య, లీలమణి, ఆదిత్య, రణధీర అనే నలుగురు తోబుట్టువులు. పద్మజా నాయుడు పెద్దగా చదువు కోలేదు. చిన్ననాడు చేరిన మహబూబియా బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగేళ్ళు మాత్రమే చదివారు. బాల్యంలో తరుచుగా అనారోగ్యానికి గురికావడంతో ఆమె చదువు సరిగా సాగలేక పోయింది. ఆమె నేర్చుకున్న విద్య, సంస్కారం అంతా తన తల్లి నివాసమైన గోల్డెన్ థ్రెషోల్డ్‌కు వచ్చి పోయే వారి మధ్యే సాగి పోయింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వర్క్స్ శాఖను ఏర్పాటు చేసి ఆమె పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ప్రజారోగ్య పరిరక్షణకై ఆమె ఎంతో మంది ముస్లిం స్త్రీలను సభ్యులుగా చేర్చుకొని ప్లేగు రిలీఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. పౌరుల స్వేచ్ఛ కొరకు, జాగిర్దారీ వ్యవస్థకు వ్యతిరేకంగా స్థాపించ బడిన స్వదేశీ లీగ్ అనే సంస్థకు అధ్యక్షురాలిగా పనిచేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలోనే, ఆమె తన సంపాదకత్వంలో 'వన్ వరల్డ్' అనే పత్రికను నడిపారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సామ్యవాద సిద్ధాంతానికి ప్రభావితులైన కొందరు ఉస్మానియా విద్యార్థులు కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపించగా, సంస్థకు పద్మజా నాయుడు సహకారాన్ని అందించారు. 1935లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడి నప్పుడు, రైతుల దుర్భర పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి ఏర్పడిన హైదరాబాద్ సహాయక సంఘానికి ఆమె అధ్యక్షురాలుగా వ్యవహరించారు. అనేక ప్రాంతాలు పర్యటించి, భాధితులకు తక్షణ సహాయం అందేలా ఏర్పాట్లు చేశారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. అప్పటికి మహిళలకు ప్రత్యేకమైన జైళ్ళు లేకపోవడం, పలుకుబడి కలిగిన కుటుంబానికి చెందిన వారు కావడం మూలాన ఆమెను హయత్ నగర్ లోని బేగం గారి దేవిడిలో సకల సౌకర్యాలు కలిగిన రాజభవనంలో నిర్బంధించారు. దానికి ఆమె సంతోషించక తనతో పాటు అరెస్ట్ అయిన తక్కిన మహిళలకు ఎందుకు ఆ వసతులు కల్పించలేదని ప్రశ్నించారు. చైనా యుద్ధ సమయంలో ఆమె తనకున్న విలువైన బంగారు ఆభరణాలను నేషనల్ డిఫెన్స్ ఫౌండేషన్ కు సమర్పించారు. భారతదేశం నుండి " క్రమబద్ధమైన బ్రిటీష్ ఉపసంహరణ" కోరుతూ మహాత్మా గాంధీ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఖాదీ గురించి గాంధీ సందేశాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసేందుకు, విదేశీ వస్తువులను బహిష్కరించడానికి కృషి సల్పారు. పద్మజా నాయుడు భారత రాజ్యాంగ సభకు 1950 లో ఎన్నికై రెండేళ్ళు ఆ పదవిలో కొనసాగారు. ఆ తరువాత ఆమె 1956 నుండి 1967 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పనిచేశారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా తల్లితో పాటు పనిచేసిన పద్మజ, 21 యేళ్ల వయసులోనే హైదరాబాదులో భారత జాతీయ కాంగ్రెస్ సహ వ్యవస్థాపకురాలు అయ్యారు. స్వాతంత్ర్యానంతరం పద్మజా నాయుడు పార్లమెంటుకు ఎన్నికైనారు. కానీ అనారోగ్యం వల్ల రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తరువాత పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పని చేశారు. అర్ధ శతాబ్దానికి పైగా ఉన్న ఆమె ప్రజా జీవితంలో, స్వచ్ఛంద సేవలో ఔత్సాహికురాలై, ఆమె మానవ సంక్షేమ నిర్దేశిత, అంతర్జాతీయ మానవతా సంస్థ రెడ్‌క్రాస్ సొసైటీ తో సంబంధం కలిగి ఉండేది. బంగ్లాదేశ్ శరణార్థుల సహాయచర్య లప్పుడు భారత రెడ్ క్రాస్ సంస్థ ఛైర్ పర్సన్ గాను పని చేసి, ప్రముఖ పాత్ర పోషించారు. పద్మజా నాయుడుకు భారత్ సేవక్ సమాజ్, అఖిల భారత హస్తకళల బోర్డు, నెహ్రూ స్మారక నిధి వంటి సంస్థలతో అనుబంధం ఉండేది. పద్మజ తన కవితా సంకలనం "ది ఫెదర్ ఆఫ్ డాన్" పేరుతో 1961లో ప్రచురించారు. 1975లో పద్మజా నాయుడు స్మృత్యర్థం డార్జిలింగులోని జంతు ప్రదర్శన శాలను పద్మజా నాయుడు హిమాలయ జంతు ప్రదర్శన శాలగా మార్చగా, నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రారంభోత్సవం చేశారు. పద్మజా నాయుడు తన తల్లి (సరోజిని నాయుడు) నివాసం ది గోల్డెన్ థ్రెషోల్డ్‌ను 1970 లలో హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి (యుఒహెచ్) అప్పగించారు. భారతజాతికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆమెకు పద్మవిభూషణ్ పురస్కారం లభించింది. పద్మజా నాయుడు 1975 మే 2 న పరమపదించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అద్వైత మత స్థాపకులు ఆదిశంకరులు - వైశాఖ శుక్ల పంచమి శంకర భగవత్పాదుల జయంతి




**" శంకారూపేణ మచ్చిత్తం పంకీకృతమభూద్యయా, కింకరీ యస్య సా మాయా శంకరాచార్యమాశ్రయే"...**
**"సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం, అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం"**

వేదాలలో ఉపనిషత్తులలో, భగవద్గీతలో ఉన్నదే అయినప్పటికీ, ప్రజలు మరిచిపోయిన అంశాలను తిరిగి ఉటంకిస్తూ, బౌద్ధ మతం లోని మంచి సిద్ధాంతాలను చేర్చి, అద్వైత మత స్థాపన ఆచార్యుడైనాడు ఆదిశంకరుడు. తూర్పున పూరీ జగన్నాథంలో గోవర్ధన మఠం, పశ్చిమాన ద్వారకలో కాళికా (శారదా)మఠం, ఉత్తరాన బదిరీ కేదారంలో జ్యోతిర్మఠం, దక్షిణ దిశలో శృంగేరి యందు శృంగగిరి శారదా మఠం స్థాపించి, మత కార్యనిర్వాహణ కోసం, దేశం నలు చెరుగులా సంచరించి, అద్వైత తత్వాన్ని వివరించి, దిగ్విజయ యాత్ర కొనసాగించా రాయన. సమకాలీన హైందవ మతంపై అత్యంత ప్రభావం కలిగిన సిద్ధాంతవేత్త ఆయన. హిందూ మతాన్ని ఉద్ధరించిన త్రిమతా చార్యులలో ప్రథములు ఆది శంకరులు. క్రీస్తుశకం 788 - 820 మధ్య శంకరులు జీవించి ఉంటారని ఒక భావన. "దుష్టాచార వినాశాయ ప్రాదుర్భూతో మహీతలే, న ఏవ శంకరాచార్య సాక్షాత్ కైవల్య నాయక:" దుష్టాచారాలను, నశింప చేసేందుకై, కైలాస నాథుడే ఆది శంకరుని రూపంలో అవతరించారని "శివ న్యాసం" స్పష్ట పరుస్తున్నది. "కరిష్యత్వవతారం స్వం శంకరో నీల లోహిత: శ్రౌత, స్మార్త ప్రతిష్ట అర్థం భక్తానాం హిత కామ్యయా". శౌత స్మార్త ప్రతిశ్టార్థం భక్తానాం హిత కామ్యయా. శ్రౌత స్మార్త క్రియలను సుప్రతిష్టితం చేసి, వైదిక మార్గాన్ని సక్రమంగా నిలబెట్టడానికి, త్రినేత్రుడు స్వయంగా శంకరుల రూపంలో అవతరించారని కూర్మపురాణం విశదీకరిస్తుంది. త్రిచూర్ లోని వృషాచల పర్వతం పై గల శివున్ని ప్రార్థించి ఆయన అనుగ్రహం పొందిన, కృష్ణ యజుర్వేద శాఖకు చెందిన, నంబూద్రి బ్రాహ్మణ దంపతులైన ఆర్యాంబ, శివగురువులకు, కేరళలోని పూర్ణ నది తీరాన గల కాలడిలో, ఉత్తరాయణ పుణ్య కాలమున వైశాఖ శుక్ల పంచమి నాడు, శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్రలో, సూర్యుడు శని, గురుడు, కుజుడు ఉచ్చ స్థితిలో ఉండగా శంకరులు జన్మించారు. మూడవ యేటనే తండ్రిని కోల్పోయిన శంకరులకు ఐదవ యేట ఉపనయన సంస్కారము జరిగింది. బ్రహ్మచర్య దీక్షలో భాగంగా మాధుకరం కోసం భిక్షాటనకు వెళ్లిన శంకరులకు ఒక పేద బ్రాహ్మణుని యింటి యిల్లాలు వద్ద ఉసిరికాయ తప్ప ఏమీ దొరకలేదట. ఆమె దుస్థితికి కరిగిన శంకరులు లక్ష్మీదేవిని కనకధారా స్తోత్ర రూపంలో ప్రార్థించగా ఆ తల్లి కరుణించి ఆ ఇంట బంగారు ఉసిరికలు కురిపించి వారి దారిద్ర్యాన్ని పోగొట్టిందట. సన్యాసం తీసుకోవడానికి తల్లిని అనుమతి కోరగా, ఆమె నిరాకరించగా ఒక నాడు, పూర్ణా నదిలో స్నానమాచరించే సమయాన, మొసలి పట్టుకోగా, మరణించే లోగా నైనా సన్యాసిగా ఉంటానని, తల్లిని కోరగా, ఆమె అంగీకారంతో సన్యాసిగా మారే మంత్రం పఠిస్తూ ఉండగా, మొసలి శంకరులను వదిలేసింది. వ్యాస కుమారుడైన, శుకుని శిష్యులైన, గౌడపాదుల శిష్యుడైన, గోవింద భగవత్పాదుల నర్మదా తీర గుహ దర్శనం లభించింది. తల్లి అనుమతితో సన్యాసం స్వీకరించి శంకరులు భారత దేశ యాత్ర మొదలు పెట్టారు. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నర్మదా నదిని తన కమండలములో బంధించిన శంకరుని చూసి ముగ్ధులైన గురు గోవింద భగవత్పాదులు శంకరులను తన శిష్యునిగా స్వీకరిస్తారు. గోవింద పాదులు జ్ఞాన సమాధి నుండి చూసి, సాక్షాత్తూ భువికి దిగివచ్చిన పరమ శివుడే శంకరుడు అని అన్నారు. శంకరులు మొదటి సారిగా, గోవింద భగవత్పాదులకు పాదపూజ చేయగా, నేటికీ ఆ పరంపర కొనసాగుతూనే ఉంది. గురుసేవ తోనే జ్ఞానార్జన సాధ్యమని, ప్రపంచానికి ఆయన చాటారు. వారణాసిలో సదానందుడు శంకరుని మొదటి శిష్యులయ్యారు. గంగా నది వైపు వెళుతున్న సమయంలో, నాలుగు శునకాలతో, చండాలుడు అడ్డు రాగా, చండాలుని మాటలు విన్న శంకరుడు... పరమశివుడే చతుర్ వేదాలతో వచ్చాడని గ్రహించి, మనీషా పంచక స్తోత్రం చేసి, బ్రహ్మ సూత్రాలకు బాష్య సూత్రాలు రాసి, సిద్ధాంతం వ్యాప్తికి, సంరక్షణకు దేశవ్యాప్తంగా శిష్యులను పంపాలని, శివుని ఆదేశం పొంది, కర్తవ్య ముఖులైనారు శంకరులు. ఎనిమిది రోజుల చర్చ అనంతరం, వ్యాస భగవానుని సంతృప్తిపరచి, ఆయుర్ధాధిక వరం పొందారు. శంక రులు సన్యాసం తీసుకున్నాక, కొత్త పేరును సూచించే యోగ పట్టం... తీర్థ, ఆశ్రమ, వన, గిరి, అరణ్య, పర్వత, సాగర, సరస్వతి, భారతి, పురి అనే పది పేర్లను, శంకరుడు మఠం నిర్వాహకులకు నిర్ణయించారు. సాంఖ్య, బౌద్ధ, జైన, వైశేషిక వాదాలను, వేదాంత విరుద్ధ హిందూ భావజాలాన్ని ఖండించి, ఉపనిషత్తుల ఆధారంగా, అద్వైత మతాన్ని నిరూపణ చేసేందుకు స్వానుభవాన్ని జోడించి, తర్కానికి ప్రముఖ స్థానం కల్పించి, భాష్యాలు, ప్రకరణ గ్రంథాలు, స్తోత్రాలు రచించారు. ఆత్మ , బ్రహ్మం (పరమాత్మ) ఒకటే అనేది అద్వైత మూలసూత్రం. ఇందుకు మౌలిక సూత్రాలను, ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మ సూత్రాలు, ప్రస్థాన త్రయం నుండి ఆయన గ్రహించారు. క్షీణ దశలో ఉన్న హిందూ మతాన్ని పునరుద్ధరించి, వివిధ శాఖల పండితులను ఓడించి, తన సిద్ధాంతాన్ని ఒప్పించి, భగవంతుని నమ్మే వారందరినీ ఏకీ కృతుల చేసి వేదాలలో విశ్వాసాన్ని, హిందువులలో ఆత్మ విశ్వాసాన్ని పెంచారు. బ్రహ్మచర్యాశ్రమం నుండే సన్యాసం స్వీకరించారు. సన్యాసి అయి ఉండి, తల్లికి అంత్యక్రియలు నిర్వహించి, డెబ్బై రెండు మతాల వారిని జయించి, సూత్ర భాష్య శతాధిక ఉద్గ్రంతాలు రచించి, బ్రహ్మసూత్రాల భాష్య కారుడై, కైలాస నాథుని అనుగ్రహం వల్ల జన్మించి, "సుఖం కలిగించు వాడు" అనే అర్థముతో "శంకర" నామాంకితులై, 32 ఏళ్ళకే, కైలాస గమనం చేసిన శంకరునికి ప్రత్యేకతలున్నాయి. నువ్వు వేరు... నేను వేరు' అనే సంకుచిత మార్గం నుండి 'అందరమూ ఒకటే' అన్న విశాల మార్గంలోకి రప్పించిన వేదాంతి. 'జీవుడే బ్రహ్మం... బ్రహ్మమే జీవుడు. ఆ ఇద్దరికీ తేడాలేదు. చుట్టూ కనిపించేదంతా మాయ మాత్రమే. అజ్ఞానం లోనుండి బయటపడి తనను తాను తెలుసుకో గలగాలి' అని ఆది శంకరుడు ఉద్బోధించారు. ఆయన చేసిన స్తోత్రాల్లో మనీషా పంచకము, సాధన పంచకము, భజ గోవిందము, గోవిందాష్టకము, పాండు రంగాష్టకము, శివ సువర్ణ మాలా స్తోత్రము, అర్ధనారీశ్వర స్తోత్రము, కాలభైరవాష్టకము, దక్షిణామూర్తి స్తోత్రము, నిర్వాణ షట్కము, అన్నపూర్ణాష్టకము, అచ్యుతాష్టకము, మహిషాసుర మర్దిని స్తోత్రము, త్రిపురసుందరీ స్తోత్రము, భుజంగాష్టకాలు, భవాన్యష్టకము, దేవీ నవరత్న మాలికా, విశ్వనాథా ష్టకము, ఉమామహేశ్వర స్తోత్రము, సౌందర్య లహరి, శివానంద లహరి, వివేక చూడామణి మొదలైనవి. ఆయన స్థాపించిన పీఠాధిపతులు కూడా శంకరాచార్య నామాన్ని అనంతర కాలంలో ఉటంకింప బడుతుండగా, ఆది శంకరులుగా చిర స్మరణీయులు అయినారు శంకర భగవత్పాదులు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సినీ వినీలాకాశంలో ధృవ తార సత్యజిత్ రాయ్ - మే 2.. సత్యజిత్ రాయ్ జయంతి

సత్యజిత్ రాయ్... సినిమాల గురించి ఏ కొంచెం అవగాహన ఉన్నా, ఈ పేరు సుపరిచితమే. ప్రపంచం లోని సినీ దర్శకులలో అగ్రశ్రేణికి చెందిన ప్రతిభాశాలి సత్యజిత్ రాయ్. దర్శకత్వం మటుకే కాక, కథారచన, స్క్రీన్ ప్లే, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ, సంగీత దర్శకత్వం, కళా దర్శకత్వం ఇలా సినిమాలకు సంబంధించిన శాఖలలోనే కాకుండా చిత్రకళ లోనూ, సాహిత్యం లోనూ సాటి లేని మేటిగా తనదైన ప్రత్యేకత చాటుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. సత్యజిత్ రాయ్ (మే 2 1921–ఏప్రిల్ 23 1992) భారత దేశంలోని బెంగాల్ రాష్ట్రానికి చెందిన సినీ దర్శకుడు, రచయిత. అయన ప్రపంచ సినిమాలో 20వ శతాబ్దపు ఉత్తమ దర్శకుల్లో ఒకడుగా పేరు గడించారు. కలకత్తాలో బెంగాలీ కళాకారుల కుటుంబములో జన్మించి ప్రెసిడెన్సీ కాలేజ్‌లో ఎకనామిక్స్ చదువుకున్న సత్యజిత్ 1940–41లో తమ కుటుంబానికి మిత్రుడైన రవీంద్ర నాథ ఠాకూర్ బతికుండగానే శాంతినికేతన్ వెళ్ళి చిత్రకళ అభ్యసించారు. సినిమాలూ, గ్రామఫోన్ రికార్డ్ల మోజుతో 1942లో కలకత్తాకు తిరిగి వచ్చారు. 1943 నుంచి సుమారు పన్నెండేళ్ళపాటు ఒక బ్రిటిష్ అడ్వర్టైజింగ్ కంపెనీలో పని చేశాక సినీ రంగంలో కాలు మోపారు. 1955లో పథేర్ పాంచాలీ సినిమాకు దర్శకత్వం వహించిన తరవాత దర్శకుడుగా దేశవిదేశాల్లో పేరు సంపాదించు కున్నారు. అంతకు ముందే కలకత్తా ఫిల్మ్ సొసైటీని స్థాపించడంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. 1949లో కలకత్తాకు వచ్చిన ప్రసిద్ధ ఫ్రెంచ్ దర్శకుడు ఝూఁ రెన్వార్ వెంట తిరిగి సమకాలీన సినిమా గురించి అవగాహన చేసుకున్నారు. సంవత్సరానికి ఒక సినిమా చొప్పున అతను దర్శకత్వం వహించిన సినిమాలన్నీ ప్రపంచ ప్రసిద్ధిని పొందాయి. కొన్ని బెంగాలీ సాహిత్యం నుంచి తీసుకున్న కథలైతే కొన్ని స్వయంగా రాసుకున్నవి. సీరియస్ కళాఖండాలే కాక పిల్లల కోసం సాహసాలూ, హాస్యంతో కూడిన సినిమాలూ తీశారు. సున్నితమైన హాస్యం, వ్యంగ్యం, వాస్తవిక జీవిత చిత్రణ, అపూర్వం అనిపించే సినీ పరిభాషా, కళా నైపుణ్యం అడుగడుగునా ఆయన సినిమాల్లో కనిపిస్తాయి. ప్రపంచంలోని ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లన్నీ ప్రత్యేకంగా అధ్యయనం చేసే దర్శకుల్లో రాయ్ ఒకరు. రవీంద్రుడి 'చారులతా' మొదలుకొని పిల్లల సినిమా 'గోపీ గాయేన్' వంటి జానపద చిత్రాలూ, హిందీలో ప్రేంచంద్ కథ ఆధారంగా 'శత్‌రంజ్ కే ఖిలాడీ', రవీంద్రనాథ ఠాకూర్ మీద అద్భుతమైన డాక్యుమెంటరీ ఒకటీ ఇలా ప్రతీ ఒక్కటీ కళాఖండం అనిపించేట్టుగా నిర్మించారు. ఆయనకు దర్శకత్వమే కాక, సినిమా తీయడంలోని ఇతర విభాగాల పట్ల కూడా మంచి పట్టు ఉండేది. తమ సినిమాలో చాలా వాటికి స్క్రీన్ ప్లే, కేస్టింగ్, సంగీతము, సినిమాటోగ్రఫీ, కళా దర్శకత్వము, కూర్పు, పబ్లిసిటీ డిజైన్ చేసుకోవడము - వంటివి కూడా ఆయనే చూసుకునేవారు. రాయ్ సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు కలిపి మొత్తము ముప్పై ఏడు చిత్రాలకు దర్శకత్వము వహించాడు. ఆయన మొదటి సినిమా పథేర్ పాంచాలీ, కేన్స్ చలనచిత్రోత్సవములో 11 అంతర్జాతీయ బహుమతులు గెలుచుకుంది. కంప్యూటర్ ఫాంట్‌లు వ్యాప్తిలోకి రాకముందే రాయ్ బెంగాలీ అక్షరమాలలో కొత్త శైలులని ప్రవేశపెట్టారు. బెంగాలీలో అనేక కథలూ, వ్యాసాలూ, నవలలూ కూడా రాశారు. సైన్స్ ఫిక్షన్, డిటెక్టివ్ సాహిత్యం మొదలైన ప్రత్యేక విషయాల గురించి కథలు రాసి, ఫేలూ దా మొదలైన పాత్రలతో జైసల్మేర్ కోట నేపథ్యంతో 'షోనార్ కెల్లా' వగైరా సినిమాలు కూడా తీశారు. బెంగాలీ సంస్కారాన్నీ, భారతీయతనూ ఒంట పట్టించుకుని ప్రపంచ స్థాయికి ఎదిగిన సత్యజిత్ రాయ్ ఏ ప్రక్రియను చేపట్టినా ప్రతిభా వంతంగా నిర్వహించ గలిగారు. తన చిన్నతనంలోనే ఆర్థర్ కోనన్ డాయిల్ డిటెక్టివ్ కథలనూ, ఎచ్.జి.వెల్స్ తదితరుల సైన్స్ ఫిక్షన్ సాహిత్యాన్నీ అభిమానించే వారు. సత్యజిత్ రాయ్ పిల్లల కోసం "ఫేలూదా" అన్న డిటెక్టివ్ ని సృష్టించారు. 1965 మొదలుకుని 1994 దాకా 35 ఫేలూదా నవలలు రాసారు. ఇందులో – ఫేలూదా, అతని కజిన్ తపేష్, జటాయు అని పిలువబడు లాల్ మోహన్ గంగూలీ ప్రధాన పాత్రలు. వీరు ముగ్గురు కలిసి పరిష్కరించే సమస్యల సంకలనమే ఫేలూదా కథలు. ఇది కాక సత్యజిత్ రాయ్ ప్రొఫెసర్ శొంకు అన్న మరో పాత్రని కూడా సృష్టించి నవలలు రాసారు. బెంగాలీ పిల్లల



సాహిత్యంలో ఈ రెండు పాత్రలకి ఓ విశిష్ట స్థానం ఉంది. సినిమాలు తీయడమే కాక రాయ్ ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు కూడా రాసాడు. అలాగే, ఆయన ప్రచురణ కర్త కూడా. బెంగాలీ పిల్లల పత్రిక "సందేశ్"ను చాలా ఏళ్ళు నిర్వహించాడు. అనేక అవార్డులు పుచ్చుకున్న రాయ్ 1992 లో ఆస్కార్ కూడా అందుకున్నారు. 40 ఏళ్ళు సినీరంగంలో ఓ వెలుగు వెలిగి, మరణించేందుకు 23 రోజుల ముందు ఆ పురస్కారాన్ని స్వీకరించి, ఆస్కార్ పురస్కాన్ని అందుకున్న తొలి భారతీయునిగా, ఆపైన భారతరత్న పురస్కారం పొందిన తొలి చలనచిత్ర రంగ ప్రముఖునిగా నిలిచారు. సత్యజిత్ రాయ్ మరణానంతరం భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆయన పై ఓ స్టాంపును విడుదల చేసింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నడ్డివిరుస్తున్నాయ్..!

కోరుట్ల: జిల్లాలో జగిత్యాల తర్వాత రెండో అతిపెద్ద పట్టణం కోరుట్ల. పట్టణంలో దారులన్నీ గుంతలమయంగా మారి అధ్వానంగా మారాయి. మొత్తం 33 వార్డులుండగా సుమారు 86 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. రోజురోజుకు పట్టణం విస్తరించినంతగా అభివృద్ధి కనిపించడం లేదు. నాలుగేళ్ల కిందట అర్బన్ మిషన్ భగీరథ పథకం కింద సుమారు 190 కి.మీల పైగా సీసీరోడ్లు, మట్టిరోడ్లను తవ్వి ఇంటింటికీ కుళాయిలను బిగించారు. భగీరథ పైపులైన్ నిర్మాణంతో సిమెంట్ రోడ్లను తవ్వారు. నాసిరకంగా మరమ్మతు చేసి వదిలేశారు. దీంతో పట్టణంలో ఏవార్డుకు వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు నడిపించే వారి నడ్డి విరిచేలా సిమెంట్‌రోడ్లు మారాయి.అయిదేళ్లుగా దెబ్బతిన్న సీసీరోడ్లపై నూతన రోడ్ల నిర్మాణాలు చేట్టాలని పట్టణ ప్రజలు బలియా అధికారులు, పాలకులతో మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేకుండా పోయాయి. టీయూఎఫ్ఐడీసీ కింద పట్టణంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణాలకు రెండేళ్ల కిందట రూ.15 కోట్ల నిధులు మంజూరుకాగా నవంబరు 2024లో అప్పటి ఎమ్మెల్యే భూమి పూజ సైతం చేశారు. అనంతరం రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో పాత టీయూఎఫ్ఐడీసీ నిధులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అనంతరం కొత్తగా ఎన్నికైన కోరుట్ల శాసనసభ్యులు



డా.సంజయ్ ప్రతి అసెంబ్లీ సమావేశాల్లోనూ కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు టీయూఎఫ్ఐడీసీ కింద గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.30 కోట్ల నిధులు విడుదల చేయాలంటూ వాపోయినా ప్రభుత్వం విడుదల చేయడం లేదు. పట్టణంలో 200 కి.మీ వరకు మురుగు కాలువలున్నాయి. చాలావరకు కాలువలు దెబ్బతిని గోడలు కూలిపోతున్నాయి. కాలువల పైకప్పులు దెబ్బతిని బుంగలు పడుతున్నా నిధులు లేవంటూ నూతన నిర్మాణాలు చేపట్టకుండా బల్దియా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. రాత్రిపూట దెబ్బతిన్న రోడ్లు, మురుగు కాలువతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి బోల్తాపడి గాయాలపావుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పురపాలక సంఘ ఏఈ అరణ్‌కుమార్‌ను వివరణ కోరగా రెండేళ్ల కిందట రూ.15 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయని, తర్వాత ప్రభుత్వం వాటిని నిలిపివేసిందన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే పట్టణంలో నూతనంగా సిమెంట్‌రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు.


# కొత్త కార్డుల్లో పేర్లు తారుమారు

సిరిసిల్ల : కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండటంతో ఎన్నో ఏళ్లుగా మార్పులు చేర్పులకు ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఊరట లభించింది. గతేడాది కులగణన సర్వే ఆధారంగా కొన్ని కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా... మరోసారి దరఖాస్తులను ఆహ్వానించారు. ఆయా అంశాల ఆధారంగా సిబ్బంది సర్వే చేపడుతున్నారు. పొరపాట్లను సవరిస్తూ నిజమైన లబ్ధిదారుల ఎంపికకు క్షేత్రస్థాయిలో కొంత జాప్యం జరుగుతోంది.

జిల్లాలోని పన్నెండు మండలాలతోపాటు వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీల పరిధిలో 345 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో 1.74 లక్షల రేషన్‌కార్డులు ఉండగా అందులో 5.33 లక్షల మంది కుటుంబ సభ్యులు నమోదయ్యారు. అంత్యోదయ అన్నయోజన 13 వేలు, అన్నపూర్ణ కార్డులు 203 ఉన్నాయి. ప్రతినెలా 3.3 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారుల కోటాగా పంపిణీ చేస్తున్నారు. కొత్త కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ప్రజాపాలన, గ్రామసభల ద్వారా సుమారు 30 వేల దరఖాస్తులు సమర్పించారు. ఈ దరఖాస్తుల పరిశీలన చేయాల్సి ఉండగా జాప్యం జరుగుతోంది.

**పంచాయతీ కార్యదర్శుల విముఖత**

నూతన రేషన్ కార్డుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కొత్త నిబంధనలు అమలు చేస్తుంది. 360 డిగ్రీ సాఫ్ట్‌వేర్‌తో దరఖాస్తుదారుల కుటుంబ ఆర్థిక పరిస్థితి, ఆదాయ వివరాలను ఆధార్‌తో పరిశీలించనున్నారు. సర్వే బాధ్యతను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించాలని




జిల్లా అధికారులు భావించారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు, వివిధ రకాల పన్నుల వసూలు, భవన నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్, ఈజీఎస్ పనులు, గ్రామపంచాయతీల నిర్వహణ, ఇతర పనులతో తాము తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని కార్యదర్శులు వాపోయారు. పని ఒత్తిడితో పొరపాట్లు జరిగే అవకాశం ఉందని, రేషన్‌కార్డుల సర్వే ఇతర శాఖకు అప్పగించాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. దీంతో క్షేత్రస్థాయి పరిశీలనపై సందిగ్ధత నెలకొంది.

**ఇంటిపేరుతో ప'రేషన్'...**

జిల్లాలో కులగణన తర్వాత తొమ్మిది వేల మందికి కొత్తగా కార్డులు మంజూరైనట్లు అధికారులు ప్రకటించారు. నూతనంగా పెళ్లైన వివాహిత ఇంటి పేరు మార్పు చేయలేదు. దీంతో బియ్యం తీసుకోవడం ఇబ్బందిగా మారింది.

**సమస్య వివరించాం-ప్రవీణ్, వీర్నపల్లి**

మాకు వివాహం జరిగి అయిదేళ్లు పూర్తికావస్తోంది. గ్రామసభలో మాకు రేషన్‌కార్డు వచ్చిందని అధికారులు చెప్పారు. తీరా సమయానికి మా పేర్లు మా అత్తగారి రేషన్ కార్డులో చూపిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో సమస్యను వివరించాను. మా కుమారుడి పేరు నమోదు కాలేదు. దీనిపై ఎవరిని సంప్రదించాలో అర్థం కావడం లేదు. పరిశీలన జరుగుతోందివసంతలక్ష్మి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి నూతన రేషన్‌కార్డుల మంజూరుకు పరిశీలన జరుగుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డు అందేలా చూస్తాం. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అన్ని వివరాలు పరిశీలించిన తరువాతే కార్డు మంజూరవుతోంది. లబ్ధిదారుల వివరాలు కొన్నిచోట్ల తారుమారయ్యాయని మా దృష్టికి వచ్చింది. సాంకేతిక ఇబ్బందులతో అలా జరిగి ఉండచ్చు. పరిశీలించి పరిష్కరిస్తాం.

# సూచనలు బేఖాతర్.. చోరీతో బేజార్



హైదరాబాద్: కాచిగూడలో వ్యాపారి ఇంట్లో నేపాలీలు పనికి చేరారు. దంపతులకు మత్తుమందు ఇచ్చి రూ.3 కోట్ల సొత్తుతో పారిపోయారు. నెలక్రితం పనికి చేరిన వారి ఫోన్ నంబర్లు, గుర్తింపుకార్డులను యజమాని తీసుకోలేదు. పనివాళ్ల ఎంపికలో జాగ్రత్తలు పాటించట్లేదని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. రెండేళ్ల క్రితం సికింద్రాబాద్‌లోనూ చోరీ జరిగినప్పుడు పోలీసులు అప్రమత్తమయ్యారు. నేపాల్ పౌరులు, సంఘ నేతలతో సమావేశం నిర్వహించారు. నమ్మకానికి మారుపేరుగా కాపలాకాసే నేపాలీయులు దాన్ని వమ్ము చేయొద్దని సూచించారు. ఆ ప్రభావం కొంతకాలం ఉన్నా మళ్లీ పాత పద్ధతికే వచ్చారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 25 కేసులు నమోదయ్యాయి.

**ఏం చెప్పినా చేస్తారనే**

2019లో హిమాయత్‌నగర్‌లోని వ్యాపారి వద్ద ఒకరి తర్వాత ఒకరు 10 మంది నేపాలీలు పనికి చేరారు. యజమాని కుటుంబం తీర్థయాత్రలకు వెళ్లగానే 60 తులాల బంగారం, రూ.4-5 లక్షల నగదు చోరీ చేసి పరారయ్యారు. ఈ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసినా సొత్తు స్వాధీనం చేసుకోలేకపోయారు. 2023లో సికింద్రాబాద్ సింధ్ కాలనీలో రూ.5 కోట్ల సొత్తును కొట్టేసి పారిపోయారు. పోలీసులు ముంబయిలో కొందరిని అరెస్ట్ చేశారు. ఇద్దరు తప్పించుకొని నేపాల్ పారిపోయారు. ముఠాలో ఒకరిద్దరు మహిళలు ఉంటారు. ఏం చెప్పినా చేస్తారని, తక్కువ వేతనం ఇస్తే 24 గంటలు అందుబాటులో ఉంటారని పనిలో కుదుర్చుకుంటున్నారని ఓ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

**అదను చూసి..**

చోరీ చేసేందుకు వచ్చినవారు యజమానుల కదలికలను గమనిస్తుంటారు. ఏ పని చెప్పినా సకాలంలో చేసి నమ్మకాన్ని చూరగొంటారు. విలువైన వస్తువులు, నగదు కనిపించినా ముట్టరు. ఇంట్లో ఆభరణాలు, నగదు భద్రపరిచే ప్రదేశాలు.. కుటుంబ సభ్యులు ఏఏ సమయాల్లో ఎక్కడికి వెళతారనే విషయాలను తెలుసుకుంటారు. కుటుంబీకులతో కలసి నాలుగైదు రోజులు బయటకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలియగానే పథకం అమలు చేసేందుకు ఒక్కచోటికి చేరతారు. సొమ్ము కాజేసి సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తారు. వాహనాలు, ప్రాంతాలు మారుతూ దళారి వద్దకు చేరి సొమ్ము అప్పగించి మాయమవుతారు. మూడేళ్లలో నేపాలీల చోరీ చేసిన కేసుల్లో సగం మాత్రమే పోలీసులు ఛేదించారు. ఎన్నిసార్లు హెచ్చరించినా, జాగ్రత్తలపై సూచనలు చేసినా కొందరు యజమానులు తేలికగా తీసుకుంటున్నారని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

# నేతన్నకు అభయహస్తం అందేదెప్పుడో?



చౌటుప్పల్ : తెలంగాణలో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం 'చేనేత అభయహస్తం' పేరుతో సంక్షేమ పథకాలను ప్రకటించింది. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసింది. వాటి స్థానంలో కొత్త పథకాలకు రూపకల్పన చేసింది. దీంతోపాటుగా నేత కార్మికుల రుణాలను మాఫీ చేయనున్నట్టు వెల్లడించింది. జిల్లాలో చేనేత వృత్తిపై వేల కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. చేనేత, జౌళిశాఖ అధికారులు నిర్వహించిన ఇంటింటి సర్వేలో యాదాద్రి భువనగిరి జిల్లాలో 10400, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో 5000 మంది జియో ట్యాగ్ చేసిన మగ్గాలపై నేత పని, అనుబంధ వృత్తి పని చేస్తున్నట్టు గుర్తించారు.

'తెలంగాణ నేతన్న పొదుపు' పేరుతో ప్రకటించిన పథకంలో మగ్గం నేసే కార్మికుడు, ఒక అనుబంధ కార్మికుడు తమ నెలవారీ వేతనంలో 8 శాతం డబ్బును ప్రతినెలా బ్యాంకులో రికరింగ్ డిపాజిట్(ఆర్‌డి-1) ఖాతా తెరిచి అందులో జమచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం దానికి రెట్టింపు(16శాతం) డబ్బును చేనేత, జౌళిశాఖ అధికారి, చేనేత కార్మికుడి పేరిట తీసిన మరొక సంయుక్త ఖాతా(ఆర్‌డి-2)లో జమచేస్తుంది. ఈ పథకం గత ప్రభుత్వంలో 36 నెలల కాలపరిమితితో అమలైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత సంవత్సరం ఆగస్టులో ముగిసింది. కార్మికులకు వారు బ్యాంకు ఖాతాల్లో పొదుపు చేసుకున్న, ప్రభుత్వ వాటా డబ్బును కలిపి ఏకమొత్తంగా తిరిగి ఇచ్చేశారు. ఆ పథకాన్ని పునరుద్ధరించలేదు.

కార్మికులు ప్రభుత్వాన్ని కోరడంతో చేనేత అభయహస్తంలో పొదుపు పథకాన్ని కొన్ని సవరణలతో చేర్చారు. 36 నెలల కాలపరిమితిని 24 నెలలకు కుదించారు. ఒక చేనేత కార్మికుడితోపాటు ఇద్దరు అనుబంధ కార్మికులకు బదులుగా ఒక్కరికే అవకాశం కల్పించారు. అనుబంధ కార్మికులకు గతంలో రూ.800 పొదుపు చేసుకునే అవకాశముండగా దాన్ని రూ.600లకు తగ్గించారు. దీనిపై చేనేత ప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించుకోవడంతో రూ.600లను గతంలో మాదిరిగా రూ.800లకు పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేశారు. అనుబంధ కార్మికులు ఇద్దరికి అవకాశం ఇవ్వలేదు. ఎనిమిది నెలల అనంతరం పొదుపు పథకాన్ని ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతించింది. జియో ట్యాగ్ చేసిన మగ్గాలపై వస్త్రాలు నేస్తున్న వారికి మాత్రమే చేనేత, జౌళి శాఖ అధికారులు వారికి బ్యాంకుల్లో 24 నెలల పరిమితితో బ్యాంకుల్లో రికరింగ్ డిపాజిట్ ఖాతాలు ఆర్‌డి-1, ఆర్‌డి-2 తెరిపిస్తున్నారు.

**ఖాతాలు తెరిపిస్తున్నాం..**

తెలంగాణ నేతన్న పొదుపు పథకం ఏప్రిల్ నుంచి అమలవుతుంది. యాదాద్రి జిల్లాలో మగ్గం నేసే, అనుబంధ వృత్తి పని చేసేవారు 10,400 మంది పథకంలో చేరడానికి అర్హులని గుర్తించాం. వారికి బ్యాంకుల్లో 24 నెలల కాలపరిమితితో రికరింగ్ డిపాజిట్ ఖాతాలు ఆర్‌డి-1, ఆర్‌డి-2 తెరిపిస్తున్నాం. మగ్గం నేసే కార్మికుడికి నెల రోజులకు వేతనం రూ.15వేలు వస్తుందని లెక్కగట్టి అందులో 8శాతం రూ.1200, అనుబంధ కార్మికుడు నెలకు రూ.800 చొప్పున బ్యాంకులో జమ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం దానికి రెట్టింపు డబ్బు ఇస్తుంది. 24 నెలల తర్వాత ఈ రెండు ఖాతాల్లోని డబ్బును వారు పొందవచ్చు.శ్రీనివాస్, సహాయ సంచాలకుడు, చేనేత, జౌళిశాఖ, భువనగిరి

# కొరవడిన అనుబంధం



జగిత్యాల : విభిన్న పైర్లసాగుతో ప్రత్యేకత చాటుతున్నా వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటులో వెనుకంజలోనే ఉంది. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా టీఎస్ఐపాస్ ద్వారా యూనిట్లు, పీఎంఈజీపీ యూనిట్లను, టీప్రైడ్‌ద్వారా పెట్టుబడి రాయితీని అధికంగా మంజూరివ్వాల్సి ఉంది. ముత్యంపేట చక్కెర కర్మాగారం తెరిస్తే కనీసం 50 వేల ఎకరాల్లో చెరకు, మూతపడిన సోయాబీన్ నూనెతయారీ పరిశ్రమను తెరిస్తే 30 వేల ఎకరాల్లో సోయాబీన్‌ను సాగుచేసే అవకాశం ఉంది.

జిల్లాలో యశ్వంతరావుపేట వద్ద ఆయిల్‌పామ్ క్రషింగ్‌యూనిట్ను నెలకొల్పుతున్నారు. పారిశ్రామికప్రాంత స్థానిక ప్రాధికార హోదాతో పరిశ్రమలశాఖ, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా పల్లెల్లో పారిశ్రామిక పార్కులను ఏర్పాటుచేయాలి. మెట్లచిట్టాపూర్ వద్ద 150 ఎకరాల్లో ఫుడ్‌ప్రాసెసింగ్ ప్లాంటు నెలకొల్పాలని యోచించినా అమల్లోకి రావటంలేదు. వెల్గటూరు మండలం స్తంభంపల్లి వద్ద 75 ఎకరాల్లో మెగా ఫుడ్‌పార్కును ఏర్పాటు చేయాల్సి ఉంది. పారిశ్రామిక అభివృద్ధి మండళ్ల కేటాయింపుల్లో భాగంగా జిల్లాకు మామిడి పరిశోధన కేంద్రాన్ని కేటాయించినా క్షేత్రస్థాయికి చేర్చాలి. జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న విత్తనశుద్ధి కర్మాగారాన్ని, పొలాస పరిశోధనస్థానంలోని పారిశ్రామిక యూనిట్ల శిక్షణ ఇంక్యుబేషన్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తే రైతులకు మేలు కలుగుతుంది.

జిల్లాలోని చాలా గ్రామాల రైతులు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లుగా(ఎఫ్.పి.ఒ) ఏర్పడగా వీరికి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశమివ్వాలి. బియ్యంమిల్లులు, మామిడి తాండ్ర, రసంతయారీ పరిశ్రమలు, పసుపు పాలిషింగ్, పొడి, రంగులు, ఔషధాల తయారీ, మక్కల ఉప ఉత్పత్తులైన కోళ్లదాణా, బిస్కెట్లు, గంజిపొడి పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. సంకరవరి, సూటివరి, జొన్న, ఆవాలు, పత్తి, మొక్కజొన్న, నువ్వులు తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతుండగా విత్తనశుద్ధి కర్మాగారాలను, విత్తనోత్పత్తి కంపెనీలను నెలకొల్పవచ్చు. నూనె మిల్లులు, పప్పు మిల్లులు, పత్తి జిన్నింగ్‌మిల్లులు, మిరప ఉపఉత్పత్తుల తయారీ మిల్లులను ఏర్పాటు చేయవచ్చు. అరటి, బొప్పాయి, ఇతర పండ్లతోటలు, కూరగాయల సాగు అధికంగా ఉండగా అన్ని పంటల్లోనూ ఆహారశుద్ధి, ఎగుమతి పరిశ్రమలను ఏర్పాటు చేయాలి.

జిల్లాలో ఆహార పంటలను 3.63 లక్షలు, ఉద్యాన పంటలను 81 వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. టీఎస్ ఐపాస్‌ద్వారా ఇదివరకు రూ.865 కోట్లతో 1,255 పరిశ్రమలను ఏర్పాటు చేయగా 10 వేలమంది వరకు ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమల సంఖ్య పెరిగితే మరింతమందికి ఉపాధి కలగనుంది. రైతుల ఉత్పత్తులకు స్థానికంగానే అధిక ధరలు దక్కుతాయి. నాబార్డు రుణాలకు తోడు రాష్ట్రప్రభుత్వం రాయితీలనిస్తే వ్యవసాయ అనుబంధంగా చేపలు, రొయ్యలు, కోళ్లపెంపకం, మేకలు, గొర్రెలు, తేనెటీగల పెంపకం, పాడిపరిశ్రమ, పట్టుపురుగుల పెంపకం తదితరాలను కూడా చేపట్టినప్పుడు సాగుకు ఆర్థిక ఆసరాగా ఉంటుంది.

# సహజ సాగుకు సమాయత్తం

కొత్తగూడెం: ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సహజ పద్ధతుల్లో విభిన్న పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు 'నేషనల్ మిషన్ అండ్ నేచురల్ ఫార్మింగ్' పథకానికి శ్రీకారం చుట్టింది. మూసపద్ధతిలో సాగుకు స్వస్తిపలికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించే పంటలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. ఇందుకోసం ఖమ్మం జిల్లాలో 15, భద్రాద్రి జిల్లాలో 22 క్లస్టర్లలో 33 గ్రామాలను ఎంపిక చేసింది. త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

జాతీయ సహజ వ్యవసాయ మిషన్ విశేషాలు..

సురక్షితమైన పోషకాహారాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సహజ సాగు పద్ధతులను ప్రోత్సహిస్తుంది.

2025-26లో ఈ పథకం కోసం వెచ్చించే రూ.2,481కోట్ల మూలధనంలో కేంద్ర ప్రభుత్వం రూ.1,584కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.897కోట్లు ఖర్చు చేయనున్నాయి.

ఇప్పటికే సాగులో సేంద్రియ పద్ధతులు పాటిస్తున్న రైతులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్‌లు), వ్యవసాయదారుల ఉత్పత్తి సంఘాలు(ఎఫ్‌పీఓలు), స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీలు) వంటి వాటికి ఈ పథకంలో ప్రాధాన్యమిస్తారు.

సేంద్రియ వ్యవసాయానికి అవసరమయ్యే సహజ ఉత్పత్తులను రైతులకు సులభంగా అందుబాటులో ఉంచేందుకు అవసరాన్ని బట్టి జీవాధార వనరుల కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, రైతుల పొలాల్లో 2వేల వరకు నమూనా



సహజ వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పుతారు.

ఆసక్తి గల రైతులకు నిపుణులైన శిక్షకులు (మాస్టర్‌ట్రైనర్లు) సహజ వ్యవసాయ పద్ధతులు, జీవ ఎరువుల తయారీ వంటి వాటిలో శిక్షణనిస్తారు.

జిల్లాల్లో ఎంపిక చేసిన వ్యవసాయ క్లస్టర్లలో ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు, స్థానిక రైతుల మధ్య సహకారం పెంచేందుకు 'కృషి సఖులు, సాగు సహాయకుల(సీఆర్పీ)ను ఉపయోగించుకోనున్నారు.

**చేకూరే ప్రయోజనాలు..**

సేంద్రియ ఎరువులు, జీవసంబంధ పద్ధతుల వాడకం వల్ల నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, భూసారం మెరుగుపడుతుంది.

రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గటం వల్ల వాతావరణంలో కార్బన ఉద్గారాలు తగ్గుతాయి. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్, ధర ఉండటం వల్ల రైతులకు ఆదాయం పెరుగుతుంది. సేంద్రియ ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి సురక్షితమైనవి. పోషక విలువలను అధికంగా కలిగి ఉంటాయి.

సహజ వ్యవసాయం పర్యావరణ అనుకూలమైన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. స్థానిక వనరుల వినియోగం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుంది.

శ్రీనివాస్, కేవీకే, శాస్త్రవేత్త, భద్రాద్రి

# సాగర్ కళకళ..
# గోదావరి వెలవెల

ఖమ్మం: గతేడాది కన్నా భిన్నంగా ఈసారి సాగర్ జలాశయం నీటితో కళకళలాడుతోంది. జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండటంతో వేసవిలో తాగునీటి గండం నుంచి గట్టెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు భద్రాద్రి జిల్లాలోని గోదావరిలో నీటిమట్టం క్రమేణా తగ్గుతోంది. నీటిని పొదుపుగా వాడటంతో పాటు.. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది.

**ఢోకా లేనట్టే..** పాలేరు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2.558 టీఎంసీలు. ప్రస్తుతం 1.975 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ఇక్కడి నుంచి సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లోని 2,375 ఆవాసాల తాగునీటి అవసరాలకు 137 క్యూసెక్కుల జలాలు సరఫరా అవుతున్నాయి. ప్రస్తుత నిల్వలతో ఈ వేసవికాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు ఢోకాలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వైరా రిజర్వాయర్ నుంచి వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని పదకొండు మండలాల్లో 465 గ్రామాలకు రోజుకు పదికోట్ల లీటర్ల తాగునీరు సరఫరా అవుతుంది. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.30 అడుగులు కాగా.. ప్రస్తుతం 14.90 అడుగుల వద్ద నీరు ఉంది. వేసవి అవసరాలకు ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి పాల్వంచకు 0.2 టీఎంసీలు, కొత్తగూడెం పట్టణానికి 0.473 టీఎంసీల నీరందుతుంది. వీటితోపాటు



పారిశ్రామిక ప్రాంతాలైన కేటీపీఎస్, నవభారత్‌కు జలాలు సరఫరా అవుతాయి. 'కిన్నెరసాని' పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా.. ప్రస్తుతం 396.7 అడుగుల వద్ద నీరు ఉంది. ఈ నిల్వలు వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చనున్నాయి.

**గోదావరి పరీవాహకంలో ఇక్కట్లు**

గోదావరి పరీవాహకంలో కాస్త ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం రెండు అడుగులకే పరిమితమైంది. పర్ణశాలలోని మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ నుంచి చర్ల, దుమ్ముగూడెం మండలాలకు రోజుకు 50 లక్షల లీటర్లు, భద్రాచలం పట్టణానికి గోదావరి నుంచి నిత్యం 65 లక్షల లీటర్ల తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగితే గోదావరి నీటిమట్టం మరింత తగ్గుతుంది. తాగునీటి అవసరాలను బట్టి ఎగువ ప్రాంతాల నుంచి గోదావరి జలాలను రప్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

# హెచ్‌టీ కనెక్షన్లకు మొదలైన ఏఎంఆర్

హైదరాబాద్: నగరంలో అధిక కరెంట్ వినియోగించే హెచ్‌టీ విద్యుత్తు కనెక్షన్లకు ఆటోమెటిక్ మీటర్ రీడింగ్(ఏఎంఆర్) బిగింపు ప్రక్రియ ప్రారంభమైంది. సిటీ పరిధిలో పది సర్కిళ్లు ఉండగా.. రాజేంద్రనగర్, సైబర్‌సిటీ మినహా మిగతా 8 సర్కిళ్ల పరిధిలో పనులు మొదలెట్టారు. ఇప్పటివరకు డిస్కం పరిధిలో 847 హెచ్‌టీ కనెక్షన్లకు ఏఎంఆర్ బిగింపు పూర్తయింది.

దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలో 13,135 హెచ్‌టీ కనెక్షన్లు ఉన్నాయి. పరిశ్రమలు, మాల్స్, ఐటీ కార్యాలయాలు, ఇతర పెద్ద సంస్థలు వీటి పరిధిలోకి వస్తాయి. వీటి ద్వారా డిస్కంకు ఏటా రూ.20వేల కోట్ల వరకు ఆదాయం వస్తోంది. ఏమాత్రం చౌర్యం జరిగినా డిస్కంకు కోట్లలో నష్టం రానున్న నేపథ్యంలో అధికారులే వెళ్లి రీడింగ్ తీస్తున్నారు. దీన్ని ఆటోమేషన్ చేస్తున్నారు. మే నెలాఖరుకు 13,099 హెచ్‌టీ కనెక్షన్లకు ఏఎంఆర్ బిగించాలని నిర్ణయించారు.



మెట్రో, మేడ్చల్, రంగారెడ్డి జోన్ల పరిధిలోని సర్కిళ్లలో ఇప్పటికే ఈ పనులు మొదలయ్యాయి.

**నేరుగా బిల్లింగ్..:** ఇప్పటికే ఏఎంఆర్‌కు అనుసంధానించతగ్గ మీటర్లు ఉన్నాయి. కొత్తగా వాటికి మోడెమ్, సిమ్‌కార్డు, డేటా, పవర్ కనెక్షన్లతో ఇన్‌స్టాలేషన్ చేస్తున్నారు. నెలాఖరున అర్ధరాత్రి 12 గంటలకు ఆ నెలలో ఎన్ని యూనిట్లు వినియోగించిందీ నేరుగా సర్వర్‌కు చేరుతుంది. అక్కడి నుంచే వినియోగదారులకు బిల్లింగ్ జారీ చేస్తారు. ఈ ప్రక్రియ విజయవంతమైతే.. ఆకాశహర్మ్యాల కనెక్షన్లకు సైతం బిగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**ప్రయోజనాలివీ..:**
ఇంజినీర్లను మీటర్ రీడింగ్ కోసం కాకుండా సరఫరా మెరుగుపర్చే పనుల్లో ఉపయోగించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.
వినియోగాన్ని ట్రాక్ చేయడం ద్వారా రియల్ టైమ్ డేటా అందుబాటులో ఉంటుంది.ఓవర్ లోడ్ రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టవచ్చు.

# వెనకబాటుకు దిద్దు‘బాట’

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇంటర్ ఫలితాలు వెల్లడించింది. ఎక్కువ మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. అదే స్థాయిలో ఫెయిల్ అయిన వారూ ఉన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యధికులు అనుత్తీర్ణులయ్యారు. అందుకు కారణాలపై దృష్టిసారించి దిద్దుబాటుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఫెయిల్ అయిన విద్యార్థులను ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దేందుకు ఇంటర్ విద్యాశాఖ ప్రత్యేక తరగతులకు శ్రీకారం చుట్టింది.

**ఇంటర్ సప్లిమెంటరీకి సన్నద్ధం**
సప్లిమెంటరీ ఫలితాల్లో అయినా పాస్ అయ్యేలా, ఎక్కువ మార్కులు



సాధించేలా చర్యలు చేపట్టింది. వేసవి నేపథ్యంలో జూమ్ తరగతులు, కళాశాలలో అధ్యాపకుల సమక్షంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఈ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎండల నేపథ్యంలో ఉదయం వేళలోనే నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు.

**సగం కన్నా తక్కువ ఉత్తీర్ణత**జిల్లాలోని ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం 1063 మంది విద్యార్థుల్లో 383 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 683 మంది ఫెయిల్ కావడం గమనార్హం. ద్వితీయలో 1299 మందికి 683 మంది ఉత్తీర్ణత సాధించగా.. 616 మంది ఫెయిల్ అయ్యారు. ప్రథమలో సగం కన్నా ఎక్కువ మంది పరీక్ష తప్పడం కావడం శోచనీయం.

**అనుత్తీర్ణులకు ప్రత్యేక తరగతులు**
ఇంటర్ విద్యాశాఖ ఆదేశాల మేరకు ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యేలా అధ్యాపకులు సూచించాం. రాలేని వారికి జూమ్ ద్వారా నిర్వహించేలా ఏర్పాట్లు చేపట్టాం. సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. భానునాయక్, డీఐఈవో, సూర్యాపేట

# న్యాక్‌లో కొత్త కోర్సులు

జగిత్యాల : నూకపల్లి సమీపంలోని న్యాక్ కేంద్రంలో కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. కొత్త కోర్సులతో నిరుద్యోగ యువతకు మెరుగైన అవకాశాలు లభించనున్నట్లు న్యాక్ డైరెక్టర్ రమేశ్ తెలిపారు. కొత్త కోర్సులలో డిజిటల్ సర్వేపై శిక్షణ ఇవ్వనున్నారు. భూముల కొలతలు, లేఅవుట్ల ఏర్పాట్లు, భూముల కొలతలకు సంబంధించి సాంకేతిక పరంగా తర్ఫీదు పొందవచ్చు. రానున్న రోజుల్లో భూముల కొలతలు మొత్తం డిజిటల్ రూపంలోనే జరగనున్నాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ సర్వే కోర్సులపై నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం రూ.8500 రుసుం నిర్ణయించారు. భోజనం, వసతి కావాలంటే రోజు రూ.200 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తి కాగానే ధ్రువపత్రం అందజేస్తారు. దరఖాస్తు చేసేందుకు వచ్చే నెల 5 చివరి తేదీగా నిర్ణయించారు. ఇంటర్ లేదా సివిల్ బీటెక్, డిప్లమా చేసిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

కార్యాలయాల్లో కంప్యూటర్ పనికి అవసరమైన ఎంఎస్‌ఆఫీస్‌పై 45 రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అనుభవం ఉన్న భవన నిర్మాణ కార్మికులకు ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వహించి ధ్రువ పత్రాలు అందజేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన న్యాక్ కేంద్రం ద్వారా ధ్రువపత్రం ఉంటే గల్ఫ్ దేశాల్లో పని చేసేందుకు ఎంతో ఉపయోగపడనుందని న్యాక్ డైరెక్టర్ తెలిపారు. ఇందుకోసం రూ.1200 చెల్లించాల్సి ఉంటుంది.సంప్రదించాల్సిన చరవాణి నంబర్లు : 99859 93168, 99630 50734

# నడి వయసులోనే పెద్దపేగు క్యాన్సర్ జాడలు!



హైదరాబాద్: ఈ రోజుల్లో 45, 50, 55 ఏళ్లు అంటే పెద్ద వయసు కాదు. కానీ మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్ల కారణంగా కొందరు చిన్న వయసులోనే అనారోగ్యం పాలవుతున్నారు. ఒకప్పుడు 60-70 ఏళ్లలో కన్పించే పెద్దపేగు క్యాన్సర్ల జాడలు ప్రస్తుతం 40-50 ఏళ్లకే బయట పడుతున్నాయి. తాజాగా ఓ కార్పొరేట్ ఆసుపత్రి జరిపిన అధ్యయనంలో చాలా మందిలో పెద్దపేగుకు ముప్పు ఉన్నట్లు స్పష్టమైంది. దాదాపు రెండు వేల మంది రోగులకు పరీక్షలు చేయగా.. 28 శాతం మంది పురుషులు, 21 శాతం మంది మహిళల్లో పెద్దపేగులో బుడిపెలు, కణుతులు(పాలిప్స్) బయట పడ్డాయి. వీటిని నిర్లక్ష్యం చేస్తే.. దీర్ఘకాలంలో పెద్దపేగు, రెక్టమ్ క్యాన్సర్ కింద మారే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఎందుకిలా... గతంలో పోల్చితే ప్రజల ఆహారపు అలవాట్లు మారాయి. అల్ట్రా ప్రాసెస్డ్, అధిక కొవ్వులు, చక్కెర, ఉప్పు, కారం ఉన్న ఆహారాన్ని తరచూ తినడం అలవాటుగా మారుతోంది. ఇంట్లో కంటే బయట ఆహారం వైపు మొగ్గుచూపుతున్నారు. వీటికితోడు ధూమపానం, గుట్కా, జర్దా, ఆల్కాహాల్ వంటివి చాలామందిలో చిన్నప్పటి నుంచే అలవాటు అవుతున్నాయి. అధిక బరువు క్రమేపీ ఊబకాయంగా మారుతోంది. చాలామంది శారీరక శ్రమకు దూరంగా ఉంటున్నారు. పర్యావరణ కాలుష్యంతో పాటు పంటల్లో వాడే పురుగు మందులు, రేడియేషన్ల ప్రభావం చాలా మందిపై ప్రభావం చూపుతోంది. హ్యూమన్ పాపిలోమా వైరస్, హెచ్‌పైలోరి, హెచ్‌బీవీ వైరస్‌లు, ఇరిటబుల్ బౌల్ డీసీజ్(ఐబీడీ), కుటుంబంలో ఇది వరకే పేగు క్యాన్సర్ చరిత్ర ఉండటం...ఇవన్నీ కారణాలుగా కన్పిస్తున్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.**పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి**

జీవనశైలితో పాటు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లు, చిరు ధాన్యాలు తదితర పీచు ఎక్కువగా ఉండే వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలి. కడుపులో నొప్పి, విరేచనాలు, ఆ తర్వాత వెంటనే మలబద్ధకం వంటివి పక్షం రోజుల పాటు వేధించడం, ఆకలి బరువు తగ్గడం లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. 45 ఏళ్లు పైబడిన మహిళలు, పురుషులు తప్పనిసరిగా కొలనో స్కోపీ పరీక్ష చేయించుకోవాలి. పెద్ద పేగులో బుడిపెలు, కణుతులు ఉంటే ఎండో స్కోపీతో 30 నిమిషాల్లో వాటిని తొలగించవచ్చు. డాక్టర్ గురు ఎన్ రెడ్డి, సీనియర్ జీర్ణకోశ వ్యాధి నిపుణులు

# రుణ పాశం.. నమ్మితే మోసం



హైదరాబాద్: “వడ్డీ తక్కువ.. డాక్యుమెంట్లు అవసరం లేదు.. దరఖాస్తు చేసిన నిమిషాల వ్యవధిలో రుణం మంజూరు” అనే ప్రకటనలు డబ్బు అవసరమున్న వారిలో ఆశ పుట్టిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా రుణం వస్తే చాలు.. ఎలాగోలా తీర్చేయవచ్చని భావిస్తూ.. మోసాల బారిన పడుతున్నారు. ఇలాంటి వారే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు దర్జాగా దోచుకుంటున్నారు. రుణం ముసుగులో వ్యక్తిగత, ఆదాయ వివరాలు సేకరిస్తూ.. అడ్డగోలు ఛార్జీల పేరిట సొమ్ము కొల్లగొడుతున్నారు.

**ఆన్‌లైన్ అంతటా అవే..**
వ్యక్తిగత రుణం అవసరమున్న కొందరు.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ)లను సంప్రదించే ముందు ఆన్‌లైన్‌లో వెతుకుతుంటారు. ఈ క్రమంలోనే గూగుల్ అల్గారిథమ్ ప్రకారం ఏదైనా అంశం గురించి వెతికినప్పుడు.. వాటికి సంబంధించిన ప్రకటనలే కనిపిస్తాయి. రుణం కోసం వెతికితే.. అందుకు సంబంధించిన ప్రకటనలు కుప్పలు తెప్పలు వస్తుంటాయి. నేరగాళ్లు నకిలీ ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇది తెలియక ప్రకటనల్లోని నంబర్లు, వెబ్‌సైట్లను సంప్రదిస్తుంటారు. సిబిల్ స్కోరు తక్కువగా ఉందని, రుణం ప్రాసెస్‌లో పడిందని, విడుదలవ్వాలంటే ఛార్జీలు, జీఎస్టీ కట్టాలంటూ మోసగిస్తుంటారు. సంబంధించిన ప్రకటనలు, నకిలీ వెబ్‌సైట్లను పోలీసులు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నా.. కొత్తకొత్త పేర్లతో పుట్టుకొస్తున్నాయి.

**ఇటీవలి ఉదాహరణ**
సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి(59)కి వాట్సాప్ గ్రూపులో.. రూ.15 లక్షల రుణం ఇస్తామని ప్రకటన వచ్చింది. ఉద్యోగి ఫోన్ చేయగానే.. మాయమాటలు చెప్పి నమ్మించాడు. డాక్యుమెంట్లన్నీ ఇచ్చిన తర్వాత సిబిల్ స్కోరు తక్కువగా ఉందని ఒకసారి, బ్యాంకు రుణం ప్రాసెస్, ఇతర ఛార్జీల పేరుతో రూ.15 లక్షలు వసూలు చేశారు. ఈ సొమ్ము రుణంతో పాటే తిరిగి బదిలీ చేస్తామని చెబుతూ కొట్టేశారు. చివరికి మోసమని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఈ జాగ్రత్తలతో తప్పించుకోండి
ఒక వేళ రుణం అవసరముంటే నేరుగా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల కార్యాలయాలకు వెళ్లి ఆరా తీయండి.
ఆన్‌లైన్, యాప్‌లో దరఖాస్తు చేసుకున్నాక వేర్వేరు ఛార్జీలు అడిగితే కచ్చితంగా మోసమని గుర్తించాలి.
రుణ దరఖాస్తు పేరిట లింకులు పంపిస్తే క్లిక్ చేయొద్దు.
రూ.10 లక్షల రుణం మంజూరైంది.. కావాలనుకుంటే క్లిక్ చేయాలని వచ్చే సందేశాలను నమ్మొద్దు.
ఒకవేళ నకిలీ రుణాల బారిన పడితే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబరుకు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి.

2024లో కమిషనరేట్ల వారీగా రుణ మోసాలిలా..
హైదరాబాద్: 75
సైబరాబాద్: 394
రాచకొండ: 143

# అడుగంటి.. అందనంటోంది..!

నల్గొండ : గుండ్లపల్లి మండలంలో ఫిబ్రవరిలో 12.59 మీటర్ల లోతులో నీరుండగా, ప్రస్తుతం 14.18 మీటర్ల లోతుకెళ్లిపోయాయి.
చింతపల్లి మండలంలో ఫిబ్రవరిలో 11.32 మీటర్ల లోతులో నీరుండగా ప్రస్తుతం 12.82 మీటర్ల లోతులోకి పడిపోయాయి.

జిల్లాలో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. వర్షాకాలం తర్వాత నెమ్మదిగా తగ్గిన భూగర్భ జలం ప్రస్తుతం 8.13 మీటర్లకు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. యాసంగి సీజన్‌లో రైతులు 5 లక్షల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. దీంతో బోరుబావులు నిరంతరం భూగర్భజలాన్ని ఎత్తిపోస్తున్నాయి. ఆ ప్రభావంతో నీటి మట్టాలు క్రమంగా తగ్గిపోతున్నట్లు తెలుస్తోంది. మున్ముందు మరింత లోతుకు వెళ్లే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. స్థానిక వనరులపై ఆధారపడే గ్రామాల్లోనూ నీటి ఎద్దడి సమస్యలు తలెత్తే ప్రమాదం పొంచి ఉంది.

గతేడాది వర్షాలు సమృద్ధిగా కురిసినా నీరు ఇంకించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఎండలు భగ్గుమనడంతో జలాలు అడుగంటుతున్నాయి. కొన్నిచోట్ల బోరుబావుల నుంచి నీరు తక్కువగా వస్తుండగా.. మరికొన్ని చోట్ల వట్టిపోతున్నాయి. గ్రామాల్లోను సింగిల్ ఫేజ్ బోరుబావులు నుంచి నీరు తక్కువగా వస్తోంది. తాగునీటి ఇబ్బందులు ప్రారంభం కావడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. భూగర్భ జలాలు ప్రమాద గంటను మోగిస్తున్న వేళ అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నీటి వృథాను అరికట్టడంతో పాటు నీరు భూమిలోకి ఇంకేలా కార్యాచరణ సిద్ధం చేయాలి. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇంకుడు గుంతలు నిర్మిస్తే ఉపయోగం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



12 మీటర్ల పైగా లోతులోకి భూగర్భ జలం పడిపోయిన మండలాలు దామరచర్ల, చింతపల్లి, నాంపల్లి
10 మీటర్ల పైగా లోతులోకి నీరుఉన్న మండలాలు మర్రిగూడ, చండూరు, చిట్యాల, కట్టంగూరు, మునుగోడు, కేతేపల్లి

ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి
భూగర్భనీటి వనరులు పడిపోకుండా.. ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి. నీటిని పొదుపుగా వాడుకోవాలి. నివాస గృహాలు, వ్యవసాయ క్షేత్రాల్లో బోరు బావులు ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు వాల్టా ప్రకారం తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలి. బోరుబండిని జిల్లా భూగర్భజల శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రేవతి డీడీ భూగర్భజలశాఖ నల్గొండ

# కొత్త కార్డులు వచ్చేస్తున్నాయ్..!

మిర్యాలగూడ : పేదలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్‌కార్డులు వచ్చేస్తున్నాయి. మీసేవా కేంద్రాల్లో కొత్త కార్డులు, కార్డుల్లో పేర్లు చేర్చుకునేందుకు చేసుకున్న దరఖాస్తులపై విచారణ చేపట్టిన సంబంధిత అధికారులు అర్హులైన వారికి కార్డులు మంజూరుతో పాటు పాత కార్డుల్లో పేర్లు సైతం చేరుస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం నాటికి 9,782 కొత్త కార్డులు మంజూరు కాగా..1,15,534 మంది పేర్లను కార్డుల్లో చేర్చారు. అదనంగా పెరిగిన కార్డులు, యూనిట్లకు అనుగుణంగా మే నెలలో బియ్యం కోటాను ఏప్రిల్ నెలకంటే 679.313 మెట్రిక్ టన్నులు అధికంగా కేటాయించారు.

**జిల్లాలో అత్యధికం..**
ఏప్రిల్ నెలలో బియ్యం సరఫరా చేసిన కార్డులతో పోలిస్తే ఆదివారం నాటికి అత్యధికంగా జిల్లాలో 8,740 కొత్త కార్డులు, 61,247



యూనిట్లు కొత్తగా చేర్చారు. వీటితో మే నెల కోటాలో జిల్లాలో అదనంగా 362.218 మెట్రిక్ టన్నుల బియ్యం పెంచారు.

**ఆ దరఖాస్తులపై విచారణ**
ప్రస్తుతం మీసేవా కేంద్రాల్లో వచ్చిన దరఖాస్తులపై మాత్రమే విచారణ చేపట్టిన అధికారులు అర్హులైన వారికి కార్డులు మంజూరు చేస్తున్నారు. ప్రజా పాలన, గ్రామ, వార్డు సభల్లో వచ్చిన దరఖాస్తులపై ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్‌కార్డులు, కార్డుల్లో పేర్ల చేర్పునకు రెండు లక్షల పైగానే దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ప్రతి మండలానికి ఒక యాప్ ఇచ్చి..క్షేత్ర స్థాయిలో దరఖాస్తులు పరిశీలించి.. వారు అర్హులా కాదా అనేది అక్కడే నిర్ధారించి యాప్‌లో నమోదు చేస్తారు. దీని కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా పలు మండలాల్లో ఇప్పటికే క్షేత్రస్థాయి విచారణ కొనసాగుతోంది. కొత్త కార్డుల మంజూరు, పేర్లు చేర్పుతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# చిన్నారులకు పచ్చకామెర్లు.. పెద్దలకు పరేషాన్

కరీంనగర్ : జిల్లాలో చిన్నపిల్లలు పచ్చకామెర్ల బారిన పడుతున్నారు. గతంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గన్యా ఇలా వివిధ వ్యాధులు ఇబ్బంది పెట్టేవి. ఈ ఏడాది పచ్చకామెర్లు పిల్లలను వణికిస్తున్నాయి. లక్షణాలుంటే తల్లిదండ్రులు అశ్రద్ధ చేయవద్దని వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలన్నారు. వారు రక్తపరీక్షలు చేసి మందులు ఇస్తారు. ఇలా మొదటి దశలోనే కట్టడి చేసే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

**రెండు నెలల్లో 50 మందికిపైగా చికిత్స**
ఆలస్యంగా స్పందిస్తే కళ్లు పచ్చగా మారడం, తినకపోవడం, తింటే వాంతులు ఇలా అనేక రకాల ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో ఈ రెండు నెలల్లో 50కిపైగా కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్



అయిన పిల్లలందరూ ఆరోగ్యంగా ఇంటికి వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. పచ్చకామెర్లు రావడానికి ప్రధాన కారణం నీళ్లు కలుషితం కావడంతోపాటు బయటి ఆహారం తినడం. బయట నూనె పదార్థాలు ముఖ్యంగా పానీపూరీ తినడంతో తొందరగా వ్యాపిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇవి వచ్చిన పిల్లలకు కుడి వైపు కడుపు నొప్పితోపాటు వాంతుల వుతాయి. మూత్రం పచ్చగా వస్తుంది. కళ్లు పచ్చగా మారుతాయి.ఈ వ్యాధి వచ్చిన వారికి మంచినీళ్లు వేడిచేసి చల్లార్చిన తర్వాత తాగించాలి. పండ్ల రసాలు ఎక్కువగా తాగించాలి. పచ్చకామెర్లు వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో తగ్గడానికి 15 రోజులు నుంచి 20 రోజులు సమయం పడుతుంది.చెట్ల మందులు వాడొద్దు- దేవి వరప్రసాద్, చిన్నపిల్లల వైద్య నిపుణులు

ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి చికిత్స ఉంది. ఎట్టి పరిస్థితుల్లో చెట్ల మందులు వాడకూడదు. కాలేయంపై విపరీత ప్రభావం పడే అవకాశముంది. నీళ్లు, బయటి ఆహారంతో పచ్చకామెర్లు వస్తాయి. ఈ వ్యాధి తగ్గడానికి 20 రోజుల వరకు సమయం పడుతుంది. తగ్గిన తర్వాత నూనె పదార్థాలు ఎక్కువగా వాడకూడదు.

# అతివలకు ఆర్థిక బాసట

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పొదుపు కొలమానంగా బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేస్తోంది. చిరు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు నెలకొల్పుతూ కుటుంబాలను చక్కదిద్దుకుంటున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం రుణ లక్ష్యాలు ఖరారు చేసింది. జిల్లాలో 9,305 సంఘాలకు రూ.481.26 కోట్లు కేటాయించారు. వీటిని మండలాల వారీగా సంఘాల్లోని సభ్యులకు పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. గతేడాది రుణ లక్ష్యాలు శత శాతం సాధించగా ఇప్పుడు సమష్టిగా ప్రగతి చేరుకునేందుకు ప్రణాళిక రూపొందించారు.

9,305 సంఘాలు.. రూ.481.26 కోట్లు
జిల్లాలో 9,305 స్వశక్తి సంఘాల్లో సుమారు 90 వేల మంది సభ్యులు కొనసాగుతున్నారు. పొదుపు కొలమానంగా ప్రతి సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు పంపిణీ చేస్తున్నారు. స్వశక్తి సంఘాల్లోని మహిళలు కిరాణం, కంగన్‌హాల్, వస్త్ర దుకాణాలు, పిండి గిర్నీ, బేకరి, విస్తరాకుల తయారీ, వస్త్ర, జనపనార, పుట్ట గొడుగులు తయారీ, వ్యవసాయం, పిల్లల చదువులు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మహిళా శక్తిలో క్యాంటీన్లు, పెరటికోళ్ల పెంపకం, మొబైల్ ఫిష్ మార్కెట్, పాడి గేదెల పెంపకంతో ఆర్థికంగా ఎదుగుతున్నారు.

**ప్రగతిపై అడుగులు** మహిళలు ఆర్థికంగా పురోగతి సాధిస్తున్నారు. అప్పు కోసం ఎదురు చూడకుండా ఎలాంటి పూచీకత్తు లేకుండానే అవసరమైన రుణాలు పొందుతున్నారు. వడ్డీ వ్యాపారుల బెడద తప్పడంతో ఎన్ని అడ్డంకులు ఎదురైనా రుణ వాయిదా కిస్తీలు తిరిగి చెల్లించడంలో ముందుంటున్నారు. ఈ ఏడాది రుణ లక్ష్యాలు చేరుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. గ్రామ స్థాయిలోని సీఏ మొదలుకొని సీసీలు, ఏపీఎం, డీపీఎలు భాగస్వాములు కానున్నారు. రుణ ప్రగతి లేని మండలాల్లో తరచూ సమావేశాలు నిర్వహించనున్నారు.

# కాసులకు కక్కుర్తి.. కడుపులోనే విచ్ఛిత్తి..!

నల్గొండ : ఆరు నెలల క్రితం సూర్యాపేట జిల్లా కేంద్రం ఎంజీ రోడ్డులోని ఓ ఆసుపత్రిలో అబార్షన్లు చేస్తుండగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇద్దరు బాధితుల్ని పట్టుకున్నారు. అదే ప్రాంతంలోని మరో ఆసుపత్రిలో ఒకరిని పట్టుకున్నారు. వీరిపై అప్పటి అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. ఎనిమిది నెలలక్రితం నల్గొండ జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఓ ఆసుపత్రిలో అబార్షన్‌లు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ స్కానింగ్ సెంటర్‌తో పాటు మరో రెండు సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఎక్కువశాతం మంది చదువుకున్నవారే కొన్ని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, స్త్రీవైద్య నిపుణులతో కలిసి పుట్టబోయేది ఎవరో తెలుసుకొని మరీ కానరాని లోకానికి పంపేస్తున్నారు. మరికొంత మంది పీఆర్‌వోలు, పీఎంపీలు మధ్యవర్తులుగా ఉండి కాసులకు కక్కుర్తి పడుతూ మహాలక్ష్మికి మరణ శాసనం లిఖిస్తున్నారు. దీంతో బాలబాలికల నిష్పత్తిలో పెద్ద ఎత్తున తేడా వస్తోంది. ఆయా ప్రాంతాల్లో



గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ రూ.40 నుంచి రూ.60 వేలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్, ఖమ్మం, జగ్గయ్యపేట ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడి వారితో కలిసి కొన్ని కేంద్రాలు ఏర్పాటు చేసుకొని చిన్న సూట్‌కేస్ సామర్థ్యం ఉన్న మిషన్లను తెప్పించి పరీక్షలు కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది.

**తగ్గుతున్న నిష్పత్తి**

నల్గొండ జిల్లాలో ప్రతి 1,000 మంది బాలురకు 923 మంది బాలికలు.. సూర్యాపేటలో 1,000కి 898 మంది.. యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,000 మందికి 912 మంది బాలికలున్నారు. పరిస్థితి ఇలా కొనసాగితే రానున్న రోజుల్లో కొన్ని మండలాల్లో దయనీయ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని సంబంధిత అధికారులు వాపోతున్నారు. ప్రస్తుతం వైద్యఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం నల్గొండ జిల్లాలో 88, సూర్యాపేటలో 53, యాదాద్రి భువనగిరిలో 38 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. వంద మందికి పైగా స్త్రీ వైద్య నిపుణులు పనిచేస్తున్నారు. స్కానింగ్ సెంటర్లలో వైద్యులు, సిబ్బంది ఉన్నారా లేదా అనేది గుర్తింపు సరిగ్గా జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**ముమ్మర తనిఖీలు..–డా.పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో, నల్గొండ**

జిల్లాలో స్కానింగ్ సెంటర్లు, ప్రసవాలు నిర్వహించే ఆసుపత్రులు ముమ్మరంగా తనిఖీ చేస్తున్నాం. మధ్యవర్తులు, ఆర్‌ఎంపీలు, పీఎంపీలు లింగనిర్ధారణ పరీక్షలకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసుల సహకారంతో పీసీ్మ పీఎన్‌డీటి చట్టం పటిష్ఠంగా ఉండేలా చూస్తున్నాం. మొదటిసారి పట్టుబడితే మూడేళ్ల వరకు జైలు, రూ. 10 వేల జరిమానా, రెండోసారి పట్టుబడితే ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా ఉంటుంది.

# గుట్టలు గుట్టలుగా అక్రమాలు!

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రకృతి అందాలకు చిరునామాగా నిలుస్తున్న మట్టిగుట్టలు ఏటా కరిగిపోతున్నాయి. అధికారుల ఉదాసీనత, అక్రమార్కుల కాసుల కక్కుర్తితో సహజవనరులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. స్థిరాస్తి వ్యాపారం, ప్రభుత్వ పనులు, రహదా రుల నిర్మాణాల పేరిట అనేకచోట్ల ఈ దందా సాగుతోంది. చాలాచోట్ల అనుమతులు తీసుకోకుండానే మట్టిని తరలిస్తుండటం గమనార్హం.

**అనుమతులు లేకుండానే..**

గుట్టలపై మట్టి తవ్వాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. సొంత భూముల్లోని మట్టిని తరలించాలన్నా రెవెన్యూ, గనులశాఖ అనుమతి ఉండాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం ప్రకారం గిరిజనులు మాత్రమే మట్టి తవ్వాలి. తొలుత ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. మైనింగ్, రెవెన్యూశాఖల అధికారులు సంయుక్తంగా సర్వే జరుపుతారు. ఎన్ని క్యూబిక్ మీటర్లు మట్టి తవ్వుకోవాలి.. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు మట్టి తీయొచ్చు అనే హద్దుల్ని సర్వే నంబర్ల ఆధారంగా నిర్ణయిస్తారు. లీజు గడువు ముగిశాక గుప్పెడు మట్టి కూడా తీయకూడదు. అయితే అనేకచోట్ల ఈ నిబంధనలు పాటించటం లేదు. ఎక్కడో ఓ సర్వే నంబర్‌లో తవ్వకాలకు అనుమతులు తీసుకుని.. ఇతర ప్రాంతాల్లోనూ మట్టిని తోడేస్తున్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై ఫోన్‌లో సంప్రదించగా ఖమ్మం జిల్లా మైనింగ్ శాఖ అధికారి సాయినాథ్ అందుబాటులోకి రాలేదు.

ఎక్కడెక్కడంటే..ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లో మట్టి తవ్వకాలు



జోరుగా సాగుతున్నాయి. రఘునాథపాలెం మండలం పీర్లగుట్ట, వెలుగుమట్ల, బాలపేట, మంచుకొండ, కోయచలకలోని గుట్టలన్నీ గుల్లగుల్లవుతున్నాయి. ఖమ్మం గ్రామీణం మండలం వెంకట గిరి, మద్దులపల్లి, గుర్రాలపాడు, ఏదులాపురం, పెద్దతండాలోని గుట్టలు కనుమరుగయ్యాయి. తెల్లారుపల్లి, ఆరెకోడు, చింతపల్లిలో గుట్టలపై తవ్వకాలు సాగుతున్నాయి.

కొణిజర్ల మండలం తనికెళ్ల– తుమ్మలపల్లి, కారేపల్లి మండలం ముత్యాలగూడెం, బస్వాపురం, అత్తాయిగూడెం, పోలంపల్లిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఏన్కూరు, హిమాంనగర్, భద్రుతండా, జన్నారం, జూలూరుపాడు, పడమటి నర్సాపురంలో గుట్టలు ఆనవాళ్లు కోల్పోయాయి. సత్తుపల్లి మండలం రేజర్ల, గంగారం, కొత్తలంకపల్లి, పెనుబల్లి మండలంలో దేవతల గుట్టలు క్రమేణా తరుగుతున్నాయి.

అశ్వారావుపేట మండలం అల్లిగూడెం, వేదాంతపురం, దమ్మపేట మండలం మందలపల్లి, గట్టుగూడెం, ములకలపల్లి మండలం సీతారామ ప్రధాన కాల్వకు రెండువైపులా గుట్టల నుంచి రోజూ వందలకొద్దీ టిప్పర్ల మట్టి తరలిపోతోంది. ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం, మొండితోగు గుట్టలు కరిగిపోయాయి. పాల్వంచ మండలం రాజాపురం, తోగ్గూడెం, పునుకుల, లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ గుట్టల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి.

# మూగజీవాల వేదన తీరేనా..!



ఎల్లారెడ్డిపేట : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాలతో అనేక కుటుంబాలు వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా ఉపాధి పొందుతున్నాయి. గొర్రెలు, మేకలు, పాడిగేదెలు జీవనాధారాన్ని కల్పిస్తున్నాయి. అవి ఏదైనా జబ్బుబారిన పడితే మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. జిల్లాలోని పశువైద్యశాలలు అసౌకర్యాల నడుమ కునారిల్లుతున్నాయి. పశువైద్య కేంద్రాలను సౌకర్యాల లేమి వేధిస్తోంది. అనేక భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో సకాలంలో వైద్యం అందక పల్లెల్లో పశుపోషణ రైతులకు భారంగా మారుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించేందుకు పశువైద్యశాలల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాలో పుశు సంపదను పరిశీలిస్తే గొర్రెలు– 3,10,581, మేకలు– 63,178, తెల్లపశువులు–35,055, గేదెలు–58,737, కోళ్లు– 6,09,969 ఉన్నాయి.

**భవనాలు శిథిలం**

సిరిసిల్లలోని ప్రాంతీయ పశువైద్యశాలతోపాటు జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రాథమిక పశువైద్యశాలలు, ఉపకేంద్ర భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 2014లో మంజూరైన ఆర్‌ఐడీఎఫ్ కేంద్ర నిధులతో చందుర్తి, రుద్రంగి, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో నాలుగు ఆసుపత్రులకు భవన నిర్మాణాలను పూర్తిచేశారు. తంగళ్లపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, కోనరావుపేట, రాచర్ల గొల్లపల్లి, గాలపల్లి, హన్మాజీపేట, నిజామాబాద్, మానాలలోని ప్రాథమిక పశువైద్యకేంద్రాలు, అలాగే కొత్తపల్లి, ఆవునూరు, పోత్గల్, బండలింగంపల్లి, వీర్నపల్లి, శాత్రాజుపల్లి, నూకలమర్రి, రుద్రవరం, సుద్దాల, ఎన్గల్, కోరెం, కొదురుపాక గ్రామాల్లోని ఉపకేంద్రాల భవనాలకు భారీగా మరమ్మతులు చేయాల్సి ఉంది. వీటిలో విద్యుత్తు, గేట్లు, తలుపులు, కిటికీలు, ప్రహరీలు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలను కల్పించాల్సి ఉంది. కొన్ని మండలాల్లో ఇరుకైన గదులు, అరకొర వసతుల నడుమ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్నపాటి గదిలో నిర్వహిస్తున్న పశువైద్యశాల ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోనిది. ఇందులో సిబ్బందికి కనీస మౌలిక వసతులు లేవు. 2019లో రూ.4.60 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. నిధుల లేమితో స్లాబ్‌స్థాయిలో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. భవన నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు ప్రభుత్వం నుంచి అదనంగా నిధులు మంజూరు కావడం లేదు. నిర్మాణం పూర్తయితే పశువైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి.

శౌచాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు

నూతన భవనాలు, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టేందుకు నిధుల మంజూరు కోసం గత అయిదేళ్లుగా ప్రయత్నిస్తున్నాం. నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నాం. జిల్లాలోని 20 పశువైద్య శాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాల కోసం ఒక్కో దవాఖానాకు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.40 లక్షలను మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ పనులు నెలరోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. వి.రవీందర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

# నీరు.. ఖరారు..!



సూర్యాపేట : పురపాలికల్లో వేసవి నీటి ప్రణాళికను ప్రకటించారు. గత నెలలో వార్డుల్లో సర్వే చేయించిన పుర సిబ్బంది నీటిపై ప్రత్యేక దృష్టిసారించింది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో సమస్య లేకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

**19 పురపాలికలు.. రూ.2.30 కోట్లు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలకు వేసవి ప్రణాళికకు సాధారణ, అత్యవసర నిధుల నుంచి రూ.2.30 కోట్లు కేటాయించారు. తాగునీటి ఎద్దడి తీర్చేందుకు పురపాలికల్లో నిధులున్నప్పటికీ వాటిని ఖర్చుచేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలి. పుర అధికారులు కేటాయించిన నిధులను చేతి పంపుల మరమ్మతు, పవర్‌బోర్లు, తాగునీటి పైపులైన్, వాల్వ్ లీకేజీలు, కొత్తమోటారు కొనుగోలు చేయడం, తదితర వాటికి వినియోగించాల్సి ఉంటుంది. ఇటీవల పుర అధికారులు చేపట్టిన సర్వేలో ఎక్కువగా సమస్య ఉన్న వార్డులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**గత సమస్యలు దృష్టిలో ఉంచుకొని..**

గతేడాది వేసవిలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని పుర అధికారులు వేసవి ప్రణాళికను రూపొందించారు. ముఖ్యంగా శివారు కాలనీలకు ఏటా నీటి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ కాలనీలపై దృష్టిసారించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. బోర్లు వేయించడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం, నిలిచిన పైపులైన్ల వంటి మరమ్మతు చేపట్టి సరఫరాలో జాప్యం లేకుండా చూడనున్నారు. పురపాలికల్లో వేసవి నీటి ప్రణాళికను ప్రకటించారు. గత నెలలో వార్డుల్లో సర్వే చేయించిన పుర సిబ్బంది నీటిపై ప్రత్యేక దృష్టిసారించింది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో సమస్య లేకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

**19 పురపాలికలు.. రూ.2.30 కోట్లు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలకు వేసవి ప్రణాళికకు సాధారణ, అత్యవసర నిధుల నుంచి రూ.2.30 కోట్లు కేటాయించారు. తాగునీటి ఎద్దడి తీర్చేందుకు పురపాలికల్లో నిధులున్నప్పటికీ వాటిని ఖర్చుచేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలి. పుర అధికారులు కేటాయించిన నిధులను చేతి పంపుల మరమ్మతు, పవర్‌బోర్లు, తాగునీటి పైపులైన్, వాల్వ్ లీకేజీలు, కొత్తమోటారు కొనుగోలు చేయడం, తదితర వాటికి వినియోగించాల్సి ఉంటుంది. ఇటీవల పుర అధికారులు చేపట్టిన సర్వేలో ఎక్కువగా సమస్య ఉన్న వార్డులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**గత సమస్యలు దృష్టిలో ఉంచుకొని..**

గతేడాది వేసవిలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని పుర అధికారులు వేసవి ప్రణాళికను రూపొందించారు. ముఖ్యంగా శివారు కాలనీలకు ఏటా నీటి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ కాలనీలపై దృష్టిసారించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. బోర్లు వేయించడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం, నిలిచిన పైపులైన్ల వంటి మరమ్మతు చేపట్టి సరఫరాలో జాప్యం లేకుండా చూడనున్నారు.

**నీటి సమస్య రానివ్వం.. –శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట**

వేసవిలో పురపాలికల్లో నీటి సమస్య రానివ్వం. ప్రణాళిక ప్రకారం ఎక్కడ సమస్య ఉన్న వెంటనే పరిష్కరించి నీటి సరఫరా జరిగేలా చూస్తాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చిన వెంటనే వేసవి ప్రణాళికను అమలు చేస్తాం.

# ధాన్యం మింగేసి.. ధనాన్ని కక్కరేం..!

నల్గొండ : పౌరసరఫరాల శాఖతో సమీక్ష నిర్వహిస్తే మిల్లర్ల దగ్గర ఆనాటి ప్రభుత్వం రూ.21 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని తాకట్టు పెట్టినట్లు తేలింది. మిల్లర్లతో పలు సమావేశాలు నిర్వహించి ప్రభుత్వానికి రావాల్సిన ధాన్యం లెక్కలు బకాయిలు లేకుండా అప్పగించాలని ఆదేశించాం. రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు అందజేసే ఉచిత దొడ్డు బియ్యాన్ని మిల్లర్లు కిలో రూ.10కి కొనుగోలు చేసి మరాడించినట్లు, రీసైక్లింగ్ చేసి రూ.30ల చొప్పున సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. ఈ దందాను గుర్తించి పెండింగ్‌లో ఉన్న రూ.7 వేల కోట్ల విలువైన వడ్లను విక్రయించేందుకు టెండర్లు పిలిచి విక్రయం పెడితే రూ.3వేల కోట్ల వడ్లకు లెక్క తేలింది. ఇంకా రూ. 4వేల కోట్లకు లెక్కలు తేలలేదు. దీనికి మిల్లర్లు సహకరించడం లేదు. సాక్షాత్తూ.. ముఖ్యమంత్రి రైస్ మిల్లర్ల ఆగడాలపై బహిరంగ సభలో ప్రస్తావించారంటే వ్యవస్థీకృతంగా వీరంతా ఏ మేరకు వేళ్లూనికుని పోయారో అర్థం చేసుకోవచ్చు. అక్రమాలకు పాల్పడిన మిల్లర్ల జాబితాను ఇటీవలే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ జిల్లాల వారీగా సంబంధిత అధికారులకు సమాచారం అందించింది. బియ్యం మిల్లుల్లో యాసంగి ధాన్యం ఎంత నిల్వ ఉందో తేల్చేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టగా మిల్లర్ల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి.ఏళ్ల తరబడి ధాన్యం తీసుకుని బియ్యం అప్పగించని మిల్లర్లను గుర్తించి చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. చాలా మిల్లుల్లో గత యాసంగి ధాన్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించుకున్నట్లు తేలింది. కస్టమ్ రైస్ మిల్లింగ్(సీఎంఆర్)గా మార్చేందుకు మిల్లులకు పంపిన ధాన్యాన్ని మిల్లర్లు ఇవ్వకుండా పక్కదారి పట్టించారు. తమ వద్దే బియ్యం ఉన్నట్లు మిల్లర్లు లెక్కలు చూపిస్తూ అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో వడ్లు మిల్లర్ల వద్దే ఉన్నాయని భావించిన ప్రభుత్వం బహిరంగ వేలం టెండర్లను



ఆహ్వానించి విక్రయించాలని నిర్ణయించింది.

మిల్లుల్లో యాసంగి ధాన్య నిల్వలు ఎన్ని ఉన్నాయో లెక్కలు తేల్చేందుకు అధికారులు తనిఖీలు చేపట్టగా ధాన్యాన్ని ఇష్టారాజ్యంగా విక్రయించుకున్నట్లు విచారణలో తేలింది. సంవత్సరాల తరబడి సీఎంఆర్ నిర్దేశిత లక్ష్యం పూర్తి చేయని మిల్లుల్లో ప్రభుత్వం అప్పగించిన ధాన్యం నిల్వలు లేవని అధికారులు గుర్తించి కేసులు నమోదు చేయించారు.

సూర్యాపేట జిల్లాలో 19 మిల్లుల్లో ధాన్యం లేదని గుర్తించారు. ఆరు మిల్లులపై రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) చట్టం కింద కేసులు నమోదు చేశారు. మిగిలిన 13 మిల్లులకు 25 శాతం జరిమానాతో చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. ధాన్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లు కొందరు బినామీ పేర్లతో కొత్తగా మిల్లులు ఏర్పాటు చేసుకుని సీఎంఆర్ ధాన్యాన్ని కేటాయించేలా చేసుకోగా పూర్తిస్థాయిలో లెక్కలు తేల్చాల్సి ఉంది. నల్గొండ జిల్లాలో 12 మిల్లులు, యాదాద్రి భువనగిరిలో 6 మిల్లుల్లో ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు.

# గల్లా పెట్టెలో.. గలగలలేవీ..!

నల్గొండ : నిధుల లేమితో నీరసిస్తున్న పురపాలికలకు ఆస్తిపన్నుల రూపంలో కాస్త ఊపిరివచ్చింది. ఆర్థిక సంవత్సరం చివరి వరకు ప్రజలు పన్నులు చెల్లించకపోవడంతో జిల్లాలోని పురపాలికల్లో అభివృద్ధి పనులకు కాసులు లేక కార్మికులకు వేతనాలు చెల్లించలేని స్థితికి చేరాయి. వందశాతం వసూలే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినా లక్ష్యం చేరలేదు. దీంతో ప్రభుత్వం మార్చి 31 లోపు చెల్లించన వారికి వడ్డీపై 90 శాతం రాయితీ ప్రకటించడంతో మొండి బకాయిదారుల్లో కాస్త చలనం వచ్చింది. పురపాలికలకు రూ.కోట్లల్లో ఆదాయం వచ్చి చేరింది.

నల్గొండ జిల్లా పరిధిలో 8 పురపాలికలు ఉండగా అందులో హాలియా మినహా మిగతా పట్టణాల్లో ఏరియర్స్‌తో కలిపి రూ.82.66కోట్ల వరకు ఆస్తి పన్నులు రావాల్సి ఉంది. కానీ లక్ష్యాలను అధికారులు చేరుకోలేకపోయారు. పెద్ద మొత్తంలో ప్రభుత్వ శాఖలకు చెందిన భవనాల ఆస్తి పన్నులు పేరుకుపోయాయి. ప్రైవేట్ ఆస్తుల నుంచి పన్ను వసూలు చేసేందుకు విస్తృతంగా ఇంటింటికీ తిరగడం, జప్తులు చేయడం.. వడ్డీపై 90 శాతం మాఫీ చేయడంతో కొంత వరకు వసూలు అయ్యాయి. దీంతో పురపాలికల ఖాతాల్లో రూ.36.06కోట్లు జమ అయ్యాయి. ఇంకా 46.60 కోట్లు బకాయిలు ఉన్నాయి. నల్గొండ పురపాలికలో పరిశీలిస్తే గతేడాది ఆస్తి పన్ను డిమాండ్ రూ.17కోట్లు ఉండగా అధికారులు రూ.16కోట్ల ఆస్తి పన్నులు వసూలు చేశారు. కానీ ప్రభుత్వ భవనాల ఆస్తి పన్ను రూ.13కోట్లతో కలిసి ఏరియర్స్ మొండి బకాయిలు సుమారు రూ.30కోట్ల పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో ఇక్కడ వసూళ్ల శాతం తక్కువగా కనిపిస్తోంది.

# పూర్తికాని టెండర్.. ప్రజలకు ఫికర్

ఇంద్రవెల్లి : ఇంద్రవెల్లి మండలంలోని పలు గ్రామాలకు పదేళ్ల కిందటి వరకు తారు రోడ్డు సౌకర్యం ఉండేది. అనంతరం అవి అధ్వానంగా మారాయి. ఏళ్లుగా మారుమూల గిరిజన గ్రామాల తారు రోడ్ల పరిస్థితి, గిరిజనుల రాకపోకలకు పడుతున్న ఇబ్బందులపై ‘ఈనాడు’లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు స్పందించి ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖలు పంపడంతో ప్రభుత్వం జనవరిలో ప్రత్యేకంగా రూ.36.31 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ పనులు ప్రారంభం కావడం లేదు. వర్షాకాలంలోగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు టెండర్లు పిలిచి తారు రోడ్ల పనులు పూర్తి చేయించాలని, లేకుంటే మరో ఏడాది పాటు ఇబ్బందులు పడాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు.

**53.37 కి.మీ.లకు.. రూ.36.31 కోట్లు మంజూరు**

ఉట్నూరు ఏజెన్సీలోని ఇంద్రవెల్లి, ఉట్నూరు మండలాల పరిధిలోని 53.37 కి.మీ తారురోడ్ల మరమ్మతులకు 24.01.2025న ప్రభుత్వం జీఓ 59ని విడుదల చేసింది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని జీఓలో పేర్కొంది. అయినా ఆ ప్రక్రియ ఇంత వరకు పూర్తి కాలేదు. ఇంద్రవెల్లి మండల కేంద్రం నుంచి వడ్‌గాం రహదారికి ప్రభుత్వం రూ.8.97 కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్డు పనులతో పాటు ముత్నూరు నుంచి సిరికొండ మండల కేంద్రానికి అనుసంధానంగా ఉన్న కేస్లాపూర్ నుంచి కోయల్‌పాండ్రి రోడ్డు మరమ్మతులకు రూ.3.80 కోట్లు మంజూరు చేసింది. ముందుగా ఈ రోడ్లతో పాటు ఇంద్రవెల్లి నుంచి ఆదిలాబాద్ గ్రామీణ మండలం పరిధిలోని చిద్దరి ఖానాపూర్, ఇంద్రవెల్లి నుంచి ఉట్నూరు మండలం నర్సాపూర్ (బి) నుంచి దొడందా, గట్టెపల్లి పంచాయతీల రోడ్డు పనులను వచ్చే వర్షాకాలంలోగా మరమ్మతులు చేయకుంటే గిరిజనులు బాహ్యప్రపంచానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి వస్తుందని గిరిజనులు వాపోతున్నారు.ఈ విషయమై ఉట్నూరు డిప్యూటీ ఈఈ పవార్ రమేష్ మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి, ఉట్నూరు మండలాలలోని 8 తారు రోడ్ల మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలను ఈఎన్‌సీకి అందించామన్నారు. ఈఎన్‌సీ అధికారులు టెండర్లను పిలిస్తే గుత్తేదారులు పనులు చేస్తారన్నారు.

# అంతా హడావుడి.. పర్యవేక్షణ లేమి!

ఆసిఫాబాద్: ప్రతి సంవత్సరం ఉపాధిహామీ కింద సీసీ రోడ్లకు రూ.కోట్లలో నిధులు విడుదల కావడం, మార్చిలోనే, అదీ చివరి పక్షం రోజుల్లో హడావుడిగా మంజూరు చేయడం పరిపాటిగా మారింది. పనులు ప్రారంభించకున్నా.. పురోగతిలో ఉన్నాయని నివేదికలను రూపొందించారు. అయినా ఇంకా మొదలు పెట్టని పనుల విలువ రూ.7 కోట్లుగా ఉండటం గమనార్హం. వేల పనులు ఒకేసారి చేయడంతో పర్యవేక్షణ అటకెక్కుతోంది. స్థానికంగా లభించే ఇసుక, తగిన పాళ్లలో కలపని సిమెంటు, కంకర మిశ్రమం కారణంగా.. ఈ రోడ్లన్నీ స్వల్ప కాలంలోనే పగుళ్లు తేలి అధ్వానంగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సీసీ రహదారుల నిర్మాణానికి రూ.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 1,105 రోడ్లను చేపడుతుండగా.. దాదాపు 900 వరకు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో సైతం చాలా వాటి పనులు మొదలు పెట్టకున్నా, పురోగతిలో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ రకంగా కెరమెరి, జైనూర్, లింగాపూర్, ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లో అధికంగా ఉన్నాయని తెలిసింది. రోడ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఆలస్యం చేసినందుకు ఇటీవల కలెక్టర్ వెంకటేష్ దోత్రే.. డీఆర్‌డీఏ పీడీ దత్తారాం, పీఆర్ ఈఈ ప్రభాకర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా సమాచారం. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్లను సైతం సోమవారం సస్పెండ్ చేశారు.

కమీషన్లమయం..నిధులను అధికార, ప్రతిపక్ష నేతలందరూ తలాకొంత తీసుకుని కార్యకర్తలకు కేటాయించారు. ఫిబ్రవరిలో రూ.11 కోట్లకు సంబంధించి ప్రొసీడింగ్స్ వచ్చాయి. తొలుత వీటిని తీసుకోవడానికి గుత్తేదారులు పోటీపడ్డారు. 8 శాతం వరకు కమీషన్ ఉండగా, అనంతరం రహదారులు మంజూరు కావడం క్రమంగా పెరిగే కొద్దీ.. కమీషన్ 6, 5, 3, శాతం వరకు తగ్గుతూ వచ్చింది. చివరకు నేతలు రోడ్ల పనులు చేయండని కొందరిని పిలిచి మరీ ఇచ్చే పరిస్థితి నెలకొంది. నంబాలలోని గోలేంగూడలో రూ.45 లక్షలు వెచ్చించి వేస్తున్న రోడ్డు ఇది. నంబాల నుంచి దాదాపు కిలోమీటర్ దూరంలో గోలేంగూడ ఉండగా, ఒకవైపు సిమెంటు రోడ్డు ఉంది. మరోవైపు నుంచి నంబాలకు రావడానికి ప్రస్తుతం కొత్త రోడ్డు వేస్తున్నారు. కొంత మేర పూర్తి కాగా క్యూరింగ్ సరిగా చేయడం లేదు. మరోవైపు కింద చిన్నపాటి కంకర వేయాల్సి ఉండగా.. ఇసుకతో పనికానిచ్చేస్తున్నారు.

చురకలు



# కాసుల డీజిల్

అమలాపురం : పొరుగున ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి డీజిల్, పెట్రోల్ అక్రమ మార్గాల్లో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోకి ప్రవేశిస్తోంది. ధరలో వ్యత్యాసం ఉండటంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. యానాం చెంతన ఉన్న ఐ.పోలవరం మండలం నుంచి ముమ్మిడివరం, అమలాపురం చుట్టుపక్కల మండలాలకు నిత్యం వేల లీటర్లు అక్రమంగా తరలిస్తున్నారు. కోనసీమలో ఆక్వా సాగు పెద్ద ఎత్తున ఉండటంతో చెరువుల వద్ద జనరేటర్లలో భారీగా డీజిల్ వినియోగిస్తారు. వీరికి అవసరమైన డీజిల్ యానాం నుంచి ఇక్కడికి అక్రమంగా తెచ్చి విక్రయిస్తున్నారు. పెట్రోల్ సైతం తెస్తున్నారు. దీంతో పోల్చితే డీజిల్ పరిమాణం ఎక్కువ. బంకుల్లో లూజు విక్రయాలపై నిషేధం ఉన్నా.. యానాంలో వాటిని పట్టించుకోవడం లేదు. రవాణా సమయంలో కొందరు సిబ్బంది డబ్బులు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ వాహనాలు ఎక్కడైనా ప్రమాదానికి గురైతే భారీ నష్టం తప్పదు. వేసవి నేపథ్యంలో మరింత ముప్పు ఉంది.

**దొరికింది కొంతే..**

కోనసీమలోని తీర ప్రాంతాల్లో నదీమార్గంలో పడవలు, బోట్లు ద్వారా, ఇతర ప్రాంతాల్లో రోడ్డు మార్గంలో ఈ అక్రమదందా సాగుతోంది.



నిత్యం వేల లీటర్ల డీజిల్ అక్రమంగా యానాం నుంచి వస్తోంది. ఎక్కువ మంది పోలీసుల కన్నుగప్పి గమ్యం చేరుతున్నారు. అలాంటి వారికి కొంతమంది సిబ్బంది సహకారం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా మరింత నిఘా పెంచాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఇక్కడి బంకుల్లో విక్రయాలు తగ్గి..**

యానాం నుంచి అక్రమంగా ఇంధనం వస్తుండటంతో కోనసీమ శివారు ప్రాంతాల్లోని పెట్రోలు బంకులు మూతపడుతున్నాయి. 216 జాతీయ రహదారి చెంతనే ఉన్న బంకులకు పెద్ద ఇబ్బంది లేకపోయినా, శివారు మండలాలైన కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు తదితర మండలాల్లోని కొన్ని బంకుల్లో అమ్మకాలు భారీగా తగ్గడంతో మూసివేసే పరిస్థితికి వస్తున్నాయి. **ఎవరినీ ఉపేక్షించం..** యానాం నుంచి అక్రమంగా డీజిల్, పెట్రోలు తరలించే వారిని ఉపేక్షించం. వీటి అక్రమ రవాణా కారణంగా ఇక్కడ ఇబ్బందులు తలెత్తుతాయి. వాహనాల్లో ఇంధనం తరలించడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం. –టీఎస్ఆర్‌కే ప్రసాద్, డీఎస్పీ, అమలాపురం

# అతివేగం.. అంతులేని అనర్థం

చిత్తూరు : తిరుపతి జాతీయ రహదారిలో ముందు వెళ్తోన్న కంటైనర్‌ను అధిగమించే ప్రయత్నంలో కారు ఢీ కొట్టింది. అందులో ఉన్న ఏడుగురిలో అయిదుగురు ఘటనా స్థలంలోనే కన్నుమూశారు. ఆ సమయంలో దాదాపు 110– 120 కి.మీ. వేగంతో కారు ప్రయాణిస్తోంది. గాదంకి టోల్‌ప్లాజాకు మధ్యాహ్నం 1.17 గంటలకు చేరుకోగా ఆపై ఎనిమిది–తొమ్మిది నిమిషాలకే తోటపల్లి వద్ద దుర్ఘటన జరిగింది. అతివేగం, ముందున్న వాహనాన్ని త్వరగా అధిగమించి గమ్యస్థానానికి చేరాలన్న తొందరే ప్రమాదానికి కారణం. చిత్తూరు నగరం మురకంబట్టులో ముందు వెళ్తున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహన చోదకుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వేగంకన్నా ప్రాణం మిన్న.. ఇదీ రవాణా శాఖ నినాదం. అటు ప్రయాణికులు దీన్ని పాటించడం లేదు. ఇటు అతివేగానికి అడ్డుకట్ట వేయాల్సిన రవాణా శాఖ పట్టించుకోవడం లేదు. రోడ్డు భద్రతా వారోత్సవాలు ముగిసిన మరుసటిరోజే వాటిని ఆశాఖ మరచిపోతుండటంతో వాహనదారుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రహదారులు రక్తమోడుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు–తిరుపతి, బెంగళూరు– చెన్నై, పలమనేరు– కుప్పం, రేణిగుంట–నాయుడుపేట, రేణిగుంట– చెన్నై జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. తరచూ ఏదోఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మానవ తప్పిదాలతోపాటు అధికారుల నిర్లక్ష్యం, అలసత్వమే దీనికి ప్రధాన కారణం. రహదారుల్లో వాహనాల వేగాన్ని నియంత్రించడం, నిబంధనలను అతిక్రమించిన వాహనాలను సీజ్ చేయడం వంటివి రవాణాశాఖ అధికారులు చేయలేకపోతున్నారు. పోలీసు అధికారులు నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతూ జరిమానాలు విధిస్తున్నా.. ప్రజల్లో చైతన్యం తేలేకపోతున్నారు.

**అధిగమిస్తూ.. అదుపుతప్పుతూ..**

రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి తిరుమలకు రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. త్వరగా దేవుడిని దర్శించుకుని అంతే త్వరగా గమ్యస్థానానికి చేరుకునేందుకు విధులకు హాజరవ్వాలని హడావుడి పడుతుంటారు. ఒక్కోసారి దర్శనం ఆలస్యమైతే కారులో వచ్చే వ్యక్తులు నిర్ణీత వేగానికి మించి వెళ్తున్నారు. ముందున్న లారీలు, బస్సులను అధిగమించే క్రమంలో అదుపు తప్పుతున్నారు. కొన్ని సందర్భాల్లో వేరే వరుసలో ఉన్న వాహనాలను ఢీకొడుతున్నారు. వాహనదారులు రహదారిపై అప్రమత్తంగా ఉండటమే కాకుండా.. వేగాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆగి ఉన్న వాహనాలతో..**

జిల్లాలోని రోడ్డు, రహదారుల పక్కనే దాబాలు, భోజనశాలలు, కొంత దూరంలో మద్యం దుకాణాలు ఉండటంతో భారీ వాహనాలు, ఇతర వాహనాలు రోడ్డుపక్కనే ఆగుతున్నాయి. చిత్తూరు నుంచి తిరుపతి వరకు రహదారి పక్కనే ఈ తరహా పార్కింగ్ ఎక్కువగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కనిపించని రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు**

చిన్న వాహనాల నుంచి భారీ వాహనాల వరకు వెనుకముందు ఉండాల్సిన రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు చాలావరకు కనిపించడం లేదు. ఇవి ఉంటే రాత్రి సమయంలో చాలావరకు ప్రమాదాలు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**బెంగళూరు నుంచి స్నేహితుడి కారులో..**

తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరుకు చెందిన త్యాగరాజన్, బెంగళూరు సౌత్ గోపనపాళ్యకు చెందిన బీఎస్ సహన మధ్య ఓ హెల్త్ కంపెనీలో పనిచేసే సమయంలో పరిచయం ఏర్పడింది. తర్వాత రెండు కుటుంబాల మధ్య స్నేహం కొనసాగుతోంది. సహన భర్త ఎస్ఆర్ రజని గౌడ సిసిపరిశ్రమలో పనిచేస్తున్నారు. రజనిగౌడ, బీఎస్ సహన కుటుంబం తిరుమలకు వెళ్లాలని త్యాగరాజన్‌కు చెప్పడంతో ఆయన తన కుమారుడు క్రిష్విన్‌తో బయలుదేరారు. ఈనెల 25వ తేదీ తనతో జీఆర్‌బీ డెయిరీ ఫుడ్స్‌లో పనిచేసే స్నేహితుడి కారు తీసుకుని బెంగళూరుకు వెళ్లారు. మరుసటి రోజు రజినిగౌడ కుటుంబ సభ్యులు బయలుదేరి కలిసి తిరుమలకు వచ్చారు. 28వ తేదీ వేకువ జామున శ్రీవారి దర్శనం పూర్తి చేసుకున్నారు. తర్వాత శ్రీకాళహస్తికి వెళ్లి దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణం అవుతున్నట్లు మధ్యాహ్నం 12.30 గంటలకు త్యాగరాజన్ తన భార్యకు ఫోన్ చేసి చెప్పారు. **కుక్కల కోసం ఆగిపోయారు..** త్యాగరాజన్ కుమారుడితోపాటు తన భార్యను తిరుమలకు రమ్మని పిలిచారు. అందరూ వెళ్తే ఇంట్లో ఉన్న రెండు కుక్కల బాధ్యత ఎవరు చూసుకుంటారని భార్య మీగల్ ఆగిపోయింది.

# జలం అందలేదు.. జీవనం మారలేదు!



అనకాపల్లి : కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడొచ్చిందంటారు. గ్రామాల్లో ఇంటింటా కుళాయితో రక్షిత నీటిని అందిస్తామని బడాయి కబుర్లు చెప్పిన గత సర్కారు అసలుకే ఎసరు పెట్టినంత పనిచేసింది. జల్‌జీవన్ మిషన్‌లో ఇష్టారాజ్యంగా పైపులైన్ పనులు చేపట్టడంతో అప్పటివరకు సక్రమంగా నీరందే గ్రామాల్లోనూ తాగునీటి సమస్యలను తెచ్చిపెట్టింది. వీటిలో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలు కూడా ఉన్నాయి. రక్షిత నీరు సక్రమంగా అందక ఆయా గ్రామాల్లో స్థానిక నీటివనరులపైనే ఆధారపడాల్సి వస్తుండటంతో ఫ్లోరైడ్ ముప్పు నుంచి పూర్తిగా బయటపడలేక పోతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలు: రోలుగుంట, జానకీరాంపురం, కొమరవోలు, కె.నాయడిపాలెం, అంట్లపాలెం, కిలపర్తిపాలెం, ఎన్.కొత్తూరు, కొవ్వూరు, నిండుగొండ

జిల్లాలో రోలుగుంట మండలంలోనే ఎక్కువ ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలున్నాయి. ఇక్కడ భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ నిర్దేశిత ప్రమాణాల కంటే ఎక్కువ స్థాయిలో ఉండడంతో చాలామంది కాళ్లు, చేతులు వంకరగా మారిపోయాయి. చిన్న వయసులోనే దంతాల సమస్యలు, యుక్తవయసు దాటకుండానే ఎముకలు, కీళ్ల నొప్పుల బారిన పడినవారు ఉన్నారు. ఈ సమస్యను ఆలస్యంగా గుర్తించిన అధికారులు 2008లో జానకీరాంపురం వద్ద వరాహ నదిలో ప్రత్యేకంగా ఊట బావులు తీయించి అక్కడి నుంచి ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు నీటి సరఫరా చేయడం మొదలుపెట్టారు. మొదట్లో బాగానే నీటిని అందించగలిగినా తర్వాత క్రమంలో నిర్వహణ లోపాలు, విస్తరించిన గ్రామాలు, జనాభా పెరగడం, నీటి పథకాల చెంతనే ఇసుక తవ్వకాలు పెరిగిపోవడంతో ఈ గ్రామాలకు కొంతకాలంగా తగినంత నీటిని సరఫరా చేయలేపోతున్నారు.

'జల్‌జీవన్ మిషన్ పథకంలో అప్పటివరకు ఫ్లోరైడ్ గ్రామాల్లో ఉన్న జీఐ పైపులైన్లను తొలగించారు. రోడ్లను తవ్వేసి ప్లాస్టిక్ పైపులు వేశారు. అవి నాసిరకంగా ఉండటంతో తరచూ మరమ్మతులతో నీటి సరఫరాకు ఆటంకాలు వస్తున్నాయి. ప్రతి రోజూ ఎక్కడోకచోట పైపులు లీకవ్వడం, వాటిని బాగుచేయడానికే సమయం సరిపోతోంది.'

శెట్టి సంధ్య, నిండుగొండ సర్పంచి ఆవేదన ఇదీ.

'ఇంటింటికీ కుళాయి అన్నారు ఏ ఇంటికీ నీరు సక్రమంగా అందడం లేదు. అస్తవ్యస్తంగా పైపులు వేయడంతో ఓ వీధికి నీరు వస్తే మరో వీధికి అందడం లేదు. మాలాటి వాళ్లం ఇళ్లల్లో నీటిశుద్ధి పరికరాలు పెట్టుకున్నాం. అందరూ అలా ఏర్పాటు చేసుకోలేరు కదా. ఫ్లోరైడ్ గ్రామాలపై ఇంత నిర్లక్ష్యం తగునా'

**కె.నాయుడుపాలెం మాజీ సర్పంచి చంద్రమౌళి ప్రశ్న ఇదీ**

ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా డీఈ అల్లు సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా గతంలో రూ. 6 కోట్లతో మరో నీటి పథకం ఏర్పాటుకు ప్రతిపాదించినా టెండర్ల దశ దాటకుండానే రద్దయిపోయాయి. తాజాగా వాటర్ గ్రిడ్‌లో ఈ గ్రామాలను చేర్చి సురక్షిత నీటిని అందించే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామాల జనాభా : సుమారు 18,000


చేతిబోర్లు : 270

గతంలో నిర్మించిన రక్షిత నీటిపథకం విలువ: రూ. 3.5 కోట్లు

రోజుకు సరఫరా చేయాల్సిన నీరు : 4.8 లక్షల లీటర్లు

ప్రస్తుతం సరఫరా చేస్తున్నది : 3 నుంచి 3.5 లక్షల లీటర్లు

# రైతులారా.. రారండోయ్



కాకినాడ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి కొత్తవి అందించాలనే ఆదేశాలతో అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. అలాగే, గత ప్రభుత్వం హయాంలో ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకూ మోక్షం కల్పించడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటివరకు 46,736 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఏటా పెరుగుతున్న వ్యవసాయ బోర్లకు అనుగుణంగా విద్యుత్తు కనెక్షన్లు సకాలంలో అందించలేకపోతున్నారు. దీంతో పంటల సాగులో తీవ్ర ప్రతికూల పరిస్థితులు పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ బోర్లకు సంబంధించి ఒక్కొక్క రైతు 5 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటారును వినియోగించుకుంటారు. దీనికి గాను 25 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. కండక్టర్, ఇన్సులేటర్లు, స్తంభాలు తదితర ఖర్చులన్నీ కలిపి సుమారు రూ.2.30 లక్షల వరకు అవుతుంది. దీంతో పాటుగా 11కేవీ, ఎల్‌టీ 180 మీటర్లు వరకు సుమారు రూ.1.40 లక్షలు ఖర్చు అవుతుంది. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోరిన చోట ఒక్క రైతు ఉన్నా కనెక్షన్ ఇచ్చేందుకు రూ.3.70 లక్షలు డిస్కంలు భరిస్తున్నాయి. 25 కేవీ సామర్థ్యం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసిన చోట నలుగురు రైతులు వ్యవసాయ కనెక్షన్లు కోరితే ఇచ్చేందుకు వీలుంది. ఒక్కో కనెక్షన్‌కు 180 మీటర్ల 11 కేవీ లైన్ డిస్కం ఏర్పాటు చేసే సమయంలోనే.. సగటున 5 స్తంభాలు అవసరమైతే వాటిలో మూడు స్తంభాలు ఉచితంగా ఇస్తారు. ఉదాహరణకు 180 మీటర్ల లైను దాటి 200 మీటర్లు వరకు లైను పెరిగితే ఆ 20 మీటర్ల ఖర్చును రైతు భరిస్తే సరిపోతుంది.

**రూ.5.5 కోట్లు ఖర్చు** గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికే పెండింగ్‌లో ఉన్న వాటిలో 354 కనెక్షన్లకు విద్యుత్తు సరఫరా ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలోని 18 మండలాల్లో 511 కనెక్షన్ల కోసం అన్నదాత ఇంకా ఎదురుచూస్తున్నారు వీటికోసం సుమారుగా రూ.5.5 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేయనుంది. మెట్ట మండలాలు రంగంపేట, గోకవరం, రాజానగరం, దేవరపల్లి, గోపాలపురం తదితరచోట్ల ప్రతి రైతుకు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాల్సిన సమయంలో ప్రభుత్వానికి మరింత ఖర్చు పెరగనుంది.

**కొత్త కనెక్షన్లకూ దరఖాస్తులు**

ఇప్పటివరకు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు అందించడంతో పాటు రైతుల నుంచి కొత్తవాటికి దరఖాస్తులు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాలతో ఒక్క రైతు కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్నా 25 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్, లైన్లు ఏర్పాటు చేసేందుకు సుమారుగా రూ.3.70 లక్షల ఖర్చు భరించనున్నాం. అలా ఏర్పాటుచేసిన చోట మరో ఇద్దరు రైతులు కొత్త కనెక్షన్లు పెట్టుకుంటే వెంటనే ఇచ్చేందుకు వీలుంటుంది.– కె.తిలక్‌కుమార్, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్, తూర్పుగోదావరిజిల్లా

# కష్టం తీరాలి.. మత్స్యారే అనాలి

కాకినాడ : సుదీర్ఘ సాగర తీరం, గోదావరి పరివాహకం ఉన్న ఉమ్మడి జిల్లాలో మత్స్యరాశులనే నమ్ముకుని బతుకుతున్నవారి జీవనచిత్రం మారడంలేదు. చేపల వేటలో నైపుణ్యాలు పెంచుకోలేక.. చేతికొచ్చిన సంపదను సొమ్ముచేసుకోలేక సతమతమవుతున్నారు. వసతుల లేమి.. శీతల గిడ్డంగులు చెంత లేక వేటలో దక్కించుకున్న మత్స్యసంపద ఎంతోకొంతకు అమ్ముకోవాల్సి వస్తోంది.

**నైపుణ్యం.. ఆదాయం ప్రాప్తిరస్తు..**

ఉమ్మడి జిల్లాలో సముద్రంతోపాటు రొయ్యల చెరువుల నుంచి ఏటా 1.30 లక్షల టన్నుల నిల్వలు సేకరిస్తున్నారు. ఈ వ్యాపారం రూ.3,900 కోట్ల వరకు సాగుతోంది. రోజుకు 27,426.50 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో పది ప్రైవేటు కోల్డ్ స్టోరేజీలు ఉన్నా.. వీటిని మత్స్యకారులు ఉపయోగించుకునే పరిస్థితి లేదు. పలుచోట్ల చేపల రేవులను నిర్మించే వెసులుబాటు ఉన్నా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో రూ.422 కోట్లతో నిర్మిస్తున్న చేపలరేవు నిర్మాణం కొలిక్కివస్తే మౌలిక సదుపాయాలతోపాటు.. మత్స్యసంపద పెరిగి.. చేపలు నిల్వచేసుకోవచ్చు.

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది



పల్లెపాలెంలోని మినీ ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌లో శీతల గిడ్డంగి, ఐస్ తయారీ పరిశ్రమ అందుబాటులోకి వస్తే 3 వేల మంది మత్స్యకారులకు మేలు. ఓడలరేవు, ఉప్పల్లంక, మట్లపాలెం, కోనపాపపేట మెరైన్ ఇన్‌ల్యాండ్ సెంటర్లలో వసతులు మెరుగుపడాలి.

ఉమ్మడి జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో 61, గ్రామీణ ప్రాంతాల్లో 55 చేపల బజార్లు ఉన్నాయి. ఇక్కడ శీతల గిడ్డంగులు ఏర్పాటుచేస్తే ఫలితం ఉంటుంది.

# బాప్‌రే.. యాప్

చిత్తూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీకి తిప్పలు తప్పడం లేదు.. ప్రతి నెలా మొదటి శుక్రవారానికి పూర్తి కావాల్సిన పంపిణీ, ఏప్రిల్ నెల పూర్తి కావస్తున్నా 84.6 శాతం మాత్రమే పంపిణీ చేశారు.. పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ముఖ ఆధారిత ధ్రువీకరణ హాజరు విధానాన్ని అమల్లోకి తెచ్చింది.. సరకులు అందించే సమయంలో యాప్ సక్రమంగా పనిచేయక పోవడం, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాల సేవలు సరిగా లేక గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకునేందుకు పలుమార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సి వస్తోంది.

గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు తప్పక నమోదు చేసుకోవాలి. వారి వివరాలను సిబ్బంది బాల సంజీవని, పోషణ్ ట్రాకర్, మిల్క్ యాప్‌లలో నమోదు చేస్తారు. ఆ వివరాల ఆధారంగా వారికి పోషకాహార కిట్లు అందజేస్తారు. ప్రతి నెలా 15వ తేదీలోగా నమోదైన లబ్ధిదారులకు మాత్రమే తర్వాత నెల పోషకాహార కిట్లు ఇస్తారు. యాప్ సమయానికి పనిచేయక 15వ తేదీ తర్వాత పేర్లు నమోదు చేస్తున్న వారికి పోషకాహారం అందడం లేదు.

**పంపిణీ ఇలా..**

బాలింతలకు ప్రతి నెలా రాగి పిండి 2 కిలోలు, అటుకులు కిలో, బెల్లం పావు కిలో, ఎండు ఖర్జూరం, చిక్కీలతో పాటు బియ్యం 3 కిలోలు, కందిపప్పు కిలో, అరలీటరు నూనెను.. పౌరసరఫరాల శాఖ నుంచి అందజేస్తున్నారు. అయితే ఏప్రిల్ నెలకు సంబంధించి ఇంకా



15.4 శాతం మంది లబ్ధిదారులకు కిట్లు అందాల్సి ఉంది. వాటికోసం వారు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

**పని చేయని చరవాణులు..** లబ్ధిదారులకు ముఖ ఆధారిత హాజరు నమోదుతో సరకులు అందజేస్తారు. గత ప్రభుత్వం నాసిరకమైన చరవాణులు సిబ్బందికి అందజేసింది. ఇవి పనిచేయక కార్యకర్తలు సొంత ఫోన్లలో యాప్‌లు నిక్షిప్తం చేసుకున్నారు. దీనికి ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే 2 జీబీ డేటా చాలడం లేదని పలువురు సిబ్బంది వాపోతున్నారు. దీనివల్ల అదనపు భారం తమపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాం.. – వెంకటేశ్వరి, పీడీ, ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రంలో యాప్‌ల నిర్వహణపై ప్రారంభంలో సమస్యలు ఎదురయ్యాయి. వాటిని క్రమంగా పరిష్కరించాం. ప్రతి నెలా మొదటి శుక్రవారంలోగా పోషకాహార పంపిణీ పూర్తిచేయాలి. ఇప్పటి వరకూ 84.6 శాతం పంపిణీ చేయించాం. మిగిలిన వారికీ ఒకట్రెండ్రోజుల్లో అందజేస్తాం.

# నిర్వహణ 'కసరత్తు' మరిచారు

కర్నూలు : ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి.. కారణాలేవైనా పట్టణవాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు. రోజుకు కనీసం 20 నిమిషాలైనా వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. 'కసరత్తు' చేసేందుకు పట్టణాల్లో పార్కులకు వచ్చేవారికి సంఖ్య పెరిగింది.. కొందరు ఉదయం, మరికొందరు సాయంత్రం వస్తున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని బహిరంగ వ్యాయామశాలలు (ఓపెన్ జిమ్) ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.లక్షలు వెచ్చించారు.. నిర్వహణ గాలికొదిలేశారు. గ్రీజు పూయడం లేదు.. బోల్టులు పోయినా బిగించడం లేదు.. చిన్న చిన్న మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నా. పుర అధికారులు పట్టించుకోవడం లేదు.

**బిగించారు.. వదిలేశారు**

ఒక్కో పార్కు నిర్మాణానికి రూ.20–40 లక్షలు ఖర్చు చేశారు. వీటిలో పచ్చదనం పెంపు, బల్లల ఏర్పాటు, కొన్ని చోట్ల వ్యాయామ పరికరాలు అందించింది. వాటిలో ఎయిర్ వాకర్, క్రాస్ వాకర్, సైకిల్, చెస్ట్ ప్రెస్ డబుల్, హార్స్ రైడర్, సిట్ ఆఫ్ బోర్డు డబుల్, ట్రిపుల్ ట్విస్టర్, ఆర్మ్ షోల్డర్ డబుల్, సర్ఫేస్ బోర్డు ఇలా ఆరు నుంచి పది రకాల వ్యాయామ పరికరాలు అందించారు. ఒక్కో పరికరం విలువ సుమారు రూ.7–8 వేల నుంచి రూ.16 వేల వరకు ఉంటుంది. పుర అధికారులు నిర్వహణ చేపట్టకపోవడంతో పాడైపోతున్నాయి.

**వృథాగా పడి ఉన్నాయి**

ఎమ్మిగనూరు పురపాలక సంఘం వీవర్స్ కాలనీలో రూ.20 లక్షలు వ్యయంతో పార్కు నిర్మించి, 14 రకాల వ్యాయామ పరికరాలు బిగించారు. వీటి పర్యవేక్షణ గాలికొదిలేయడంతో నాలుగు పరికరాలు



దెబ్బతిన్నాయి. మరికొన్ని పరికరాల బోల్టులు వదులుగా మారి, ఎప్పుడు విరిగిపోతాయో తెలియని పరిస్థితి.

**గోడ కట్టేశారు** ఆదోని పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పార్కు కోసం కేటాయించిన 30 సెంట్ల స్థలాన్ని గతంలో వైకాపాకు చెందిన కౌన్సిలరు కబ్జాకు యత్నించారు. స్థానికుల ఫిర్యాదుతో మేల్కొన్న పుర అధికారులు రూ.20 లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మించారు. రూ.25 లక్షలు వెచ్చించి వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పనులు చేపట్టిన గుత్తేదారు ఇంతవరకు ఆరంభించలేదు.

**రూ.2 కోట్లు ఖర్చు.. పనికొస్తే ఒట్టు**

నగరంలో 52 వార్డులు ఉండగా.. 150కిపైగా ఉద్యానవన స్థలాలు ఉన్నాయి. అందులో 50 పార్కులు అభివృద్ధి చేశారు. నిర్వహణ కానరావడం లేదు. నగర పరిధిలో సుమారు ఎనిమిదేళ్ల కిందట పలు ఉద్యానవనాల్లో వ్యాయామ పరికరాలు అమర్చారు. రెండేళ్ల కిందట 35 పార్కుల్లో ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకు రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారు. పరికరాలు నాణ్యమైనవి కాకపోవడంతో చాలా ప్రాంతాల్లో దెబ్బతిన్నాయి. అదేవిధంగా నిర్వహణ సరిగా లేకపోవడంతో **తుప్పు పడుతున్నాయి**

గుడూరు నగర పంచాయతీకి ఐదేళ్ల కిందట వ్యాయామ పరికరాలు ఇచ్చారు.. ఇక్కడ పార్కు లేకపోవడంతో పుర కార్యాలయంలో వృథాగా పడేశారు. అవన్నీ తుప్పు పడుతున్నాయి.

చురకలు



## నిధులున్నా నిర్లక్ష్యమెందుకో..?

రాజమహేంద్రవరం : గత ప్రభుత్వ హయాంలో నిధులేక పలు భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయిన పరిస్థితులున్నాయి. కొన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునఃప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నిధులు పుష్కలంగా విడుదలవుతున్నా నిర్మాణాల్లో గుత్తేదారు సంస్థల నిర్లక్ష్యం పూర్తిస్థాయిలో కనిపిస్తోంది. దీనికి రాజమహేంద్రవరం జీజీహెచ్ వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాల ప్రధాన భవనం పనులే నిదర్శనం. 2022లో రూ.450 కోట్లతో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాసుపత్రి భవన నిర్మాణం ప్రారంభించారు. విద్యార్థుల బోధనకు తాత్కాలిక భవనం, ఆసుపత్రి ఆధునికీకరణ, అయిదు అంతస్తుల వసతి గృహాల భవనాలు, మాతాశిశు భవనంపై రెండంతస్తుల బ్లాకులు నిర్మించారు. ఆసుపత్రి పక్కన కేంద్ర కారాగారం స్థలంలో రూ.90 కోట్లతో వైద్య కళాశాల ప్రధాన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది ఈ ఆగస్టు నెలకు పూర్తిస్థాయిలో అన్ని వసతులతో అందుబాటులోకి రావాల్సి ఉంది. వీటికి సంబంధించి కూటమి ప్రభుత్వం పుష్కలంగా నిధులు విడుదల చేస్తున్నా గుత్తేదారు



సంస్థ నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. భవనం అందుబాటులోకి రాకుంటే వచ్చే ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేటప్పుడు వైద్యవిద్యార్థుల బోధనకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ భవనాన్ని సెల్లార్, జీప్లస్-4గా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. మూడు, నాలుగు నెలల్లో ఇది పూర్తిస్థాయి వసతులతో అందుబాటులోకి రావాల్సి ఉండగా.. ఇదేమాదిరి పనులు జరిగితే భవనం పూర్తయ్యేసరికి మరో ఏడాది పట్టే అవకాశం ఉందని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు నిర్మాణాలపై పర్యవేక్షణ చేస్తూ త్వరితగతిన పనులు జరిగేలా చూసేందుకు ప్రయత్నిస్తున్నా గుత్తేదారు సంస్థ తీరు నత్తనడకన సాగుతుండడం విమర్శలకు తావిస్తోంది.

## హరిత వనాలుగా విద్యాలయాలు

పామర్రు : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కూరగాయలు, ఆకుకూర తోటలు పెంపకం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఐఎంఎంఎస్ యాప్‌లో కిచెన్ గార్డెన్ అవసరం, ఖాళీ స్థలం వివరాలు, వీటి నిర్వహణకు కమిటీని రూపొందించి సభ్యుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. హరిత వనాలుగా, పోషకాహార తోటల పెంపక క్షేత్రాలుగా మార్చడానికి జిల్లాలో 858 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలకు రూ.5000 చొప్పున మొత్తం రూ.42.90 లక్షలు ఆయా మండల విద్యాశాఖాధికారి1 ఖాతాలకు సోమవారం వేశారు. వీటిని పాఠశాలల యాజమాన్య ఖాతాలకు జమ చేస్తారు. ఇప్పటికే అమ్మకోసం ఒక మొక్క పేరుతో పలు పాఠశాలల్లో పండ్ల



మొక్కలు నాటారు.

**మొక్కలు, పాదుల పెంపకం వివరాలు**

ప్రధానోపాధ్యాయులు 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అటవీ శాఖ నర్సరీలకు వెళ్లి మొక్కలు తెచ్చుకుని పాఠశాలలో నాటి, పెంచాల్సి ఉంటుంది. నాటిన మొక్కల వివరాలను 'ఫారెస్ట్స్.ఏపీ.జీవోవి.ఇన్' వెబ్‌సైట్లో పొందుపరచాల్సి ఉంటుంది. ధవళేశ్వరం (రాజమహేంద్రవరం), పల్ల కడియం (రాజానగరం), పేరూరు, కామనగరువు (అమలాపురం), కట్టుంగ, మెర్లపాలెం (ఆత్రేయపురం), శ్రీరామపురం (కపిలేశ్వరపురం), అవిడి (కొత్తపేట మండలం)లో మొక్కల పెంపకం నర్సరీలున్నాయి. వీటి నుంచి జామ, మామిడి, సపోట వంటి పండ్ల మొక్కలు తెచ్చి నాటతారు. ఉద్యానశాఖ నుంచి వంగ, బెండ, బీర, కాకర, ఆనప, తోటకూర, పాలకూర, గోంగూర తదితర కూరగాయల విత్తనాలు ఒక కిట్‌గా స్థలమున్న పాఠశాలలకు అందించనున్నారు.

## అటుగా పో'దారంటే'.. అవట్లేదు!

కాకినాడ : కాకినాడలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో చేపట్టిన పలు పనులు ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. రూ.90 కోట్లతో 2018-19లో నిర్మించిన వసలపాకల-పోర్టు రైల్వేస్టేషన్ రోడ్డు మాత్రం నిరుపయోగంగా ఉంది. రోడ్డులో కొంత మేర పనులు అసంపూర్తిగా వదిలేయడంతో లక్ష్యం నెరవేరలేదు. వలసపాకల ప్రధాన రోడ్డు నుంచి ఆర్టీవో కార్యాలయం, డెయిరీ ఫారం సెంటర్, పోర్టు రైల్వేస్టేషన్ మీదుగా జగన్నాథపురం వంతెన రోడ్డుకు అనుసంధానంగా దీని నిర్మాణం చేపట్టారు. 9 కి.మీ. పొడవుగల ఈ రోడ్డును స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపట్టారు. మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఈ రోడ్డును నిర్మించారు. సర్పవరం జంక్షన్ వైపునుంచి అమలాపురం, రామచంద్రపురం వైపువెళ్లే ప్రయాణికులు మెయిన్ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా దీనిని వినియోగించేందుకు నిర్ణయించారు. అమలాపురం, రామచంద్రపురం వైపునుంచి వచ్చే వాహనాలు కూడా నగరంలోకి కాకుండా ఈ రోడ్డు మీదుగా పిఠాపురంవైపు వెళ్లవచ్చు. ఇంతటి ప్రయోజనకరమైన రోడ్డును గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కేవలం అర కిలోమీటరు మేర పూర్తి చేయలేకపోయారు. వాస్తవానికి ఈ రోడ్డులో కొంత స్థలం రైల్వేశాఖ పరిధిలో ఉంది. ఆ శాఖ నుంచి అనుమతులు తీసుకుని రోడ్డును పూర్తి చేయాల్సిఉంది. గత తెదేపా హయాంలో అనుమతులకోసం ప్రయత్నిస్తుండగానే.. ప్రభుత్వం మారింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా అయిదేళ్లపాటు పట్టించుకోలేదు. సమస్యను ఎమ్మెల్యే కొండబాబుకు వివరించగా రహదా రిపైకొచ్చిన చెత్తను శుభ్రం చేయించారు. దాంతో కాస్త మార్గం ఏర్పడింది.

**కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లా..**

గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డు నిర్మించాం. మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ కట్టడి, దుమ్ములపేట, సంజయ్‌నగర్, సాంబమూర్తినగర్, రెవెన్యూకాలనీ తదితర ప్రాంతాలవారు జగన్నాథపురంవైపు వెళ్లేందుకు దగ్గరి దారికోసం దీనిని నిర్మించాం. గత పాలకులు అర కి.మీ. రోడ్డును నిర్మించలేకపోయారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లా. పూర్తి చేయిస్తాం.

– వనమాడి కొండబాబు, కాకినాడ ఎమ్మెల్యే

# స్వచ్ఛతకు తూట్లు.. 'ఆటో'పాట్లు




అనంతపురం : పల్లెసీమలు పరిశుభ్రంగా ఉంచి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం తీసుకొని రావాలనే ఆశయాన్ని వైకాపా సర్కారు నీరు గార్చింది. ఉమ్మడి అనంత జిల్లాలో 2,500 జనాభాపైగా ఉన్న గ్రామాల్లో బ్యాటరీతో నడిచే పవర్ ఆటోలు ఇవ్వాలని గత తెదేపా ప్రభుత్వం సంకల్పించింది. చెత్తను తరలించడంతో పాటు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆటోలు అందించింది. 2018-2019 ఆర్థిక సంవత్సరంలో వాహనాలు వచ్చాయి. ప్రభుత్వం మారి వైకాపా అధికారంలోకి రాగానే ఆటోలను పక్కన పడేశారు. ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయాలతోపాటు వైకాపా మద్దతుదారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఉంచడం గమనార్హం.

**రాయితీ వచ్చినా..ఉపాధి దక్కలే..**

ఒక ఆటో రూ.2.10 లక్షలు. ప్రభుత్వం 60 శాతం రాయితీ ఇవ్వగా.. 40 శాతం బ్యాంకు ద్వారా రుణం అందించారు. ఒక్కో ఆటోకుగాను నెలకు సంబంధిత ఎంపీడీఓ నుంచి రూ.10 వేలు ఎస్సీ కార్పొరేషన్‌కు పంపితే లబ్ధిదారుకు రూ.8వేలు వేతనంతో పాటు రూ.2వేలు బ్యాంకు రుణం చెల్లిస్తారు. ఐదేళ్ల వైకాపా హయాంలో పంచాయతీలకు ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను మళ్లించి... సర్కారే వాడేసుకొంది. రూ.కోట్లు వెచ్చించి సరఫరా చేసిన ఆటోలు మూలకు చేరాయి.

**ఉన్నతాధికారులకు నివేదిస్తాం..**

ఉమ్మడి జిల్లాలో వృథాగా ఉన్న ఆటోలను ఏవిధంగా వినియోగించాలో కలెక్టరు, ఎండీ దృష్టికి తీసుకెళతాం. చాలాచోట్ల బ్యాటరీలు పని చేయడం లేదు. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే తగిన చర్యలు తీసుకుంటాం. రాధిక, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

**స్పందన కొరవడి..**

కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మారుతికి బ్యాటరీతో నడిచే ఆటో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైంది. మరమ్మతు చేయించినా వాహనం కదులుతుందో లేదో తెలియని విధంగా మారింది. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించే వారు లేకపోవడంతో నిరుపయోగంగా మారిందని లబ్ధిదారు వాపోయారు.

**ఎస్సీ కార్పొరేషన్ ప్రాంగణంలోనే 60**

అనంతపురంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోనే ఆరేళ్లుగా చెట్ల కిందే 60 పవర్ ఆటోలు ఉండటం గమనార్హం. తెదేపా హయాంలో కొన్ని గ్రామాలకు సరఫరా చేయగా మిగిలిన వాటినే అలాగే ఉంచారు.

**ఒక్క రోజైనా... ఉరవకొండలో..**

ఉరవకొండ మండలానికి ఐదేళ్ల క్రితం నాలుగు ఆటోలు మంజూరు అయ్యాయి. వాటిని ఆయా పంచాయతీలకు ఇవ్వకుండా పట్టణంలోని మేజరు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఉంచారు. ఒక్క రోజు అయినా వినియోగించిన పాపాన పోలేదు. ఉరవకొండ

ఉమ్మడి జిల్లాలో ఇలా..

మొత్తం ఆటోలు: 362

వెచ్చించిన నిధులు:రూ.7.60 కోట్లు

ఏజెన్సీ సరఫరా చేసిన ఆటోలు: 353

లబ్ధిదారులకు పంపిణీ చేసింది: 232

పంపిణీ చేయకుండా మూలన పడేసినవి: 121

# కొడిగెనహళ్లి గురుకులం.. సీటు కోసం ఆరాటం



పరిగి : ఇది 50 వసంతాలు పూర్తిచేసుకున్న గురుకులం.. సీటు వస్తే చాలు వారి భవిష్యత్తు మారిపోయినట్లే.. ఇక్కడ విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ఎందరో విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూ స్థిరపడ్డారు. ఎందరో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లన తయారు చేసిన ఘనత ఈ గురుకులానిది. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధిస్తుండంతో కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల ర్యాంకుల బ్యాంకుగా గుర్తింపు పొందినందుకే ఇక్కడి సీటు కోసం విద్యార్థులు ఆరాటపడతారు.

**నాటి ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు చొరవతో..** 1972లో అప్పటి ముఖ్యమంత్రి పి.నరసింహారావు చొరవతో పరిగి మండలం కొడిగెనహళ్లిలోని పెన్నానది తీరాన ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్న వారంతా నిరుపేద, వ్యవసాయ కుటుంబాలకు చెందిన విద్యార్థులే.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ ప్రోత్సాహంతో నాలుగేళ్లుగా పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. పది ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలను సాధించి పెట్టారు. 2025లో నిర్వహించిన ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ఏపీఆర్ఎస్ గురుకులానికి తొమ్మిది మంది విద్యార్థులు వరుసగా 595, 595, 594, 593, 592, 591, 590, 590, మార్కులు సాధించి విజయభేరి మోగించారు. రాష్ట్ర స్థాయిలో ఏపీఆర్ఈఐ సొసైటీ పరిధిలో ఉన్న గురుకుల పాఠశాలల్లో కెళ్ల కొడిగెనహళ్లి గురుకులం విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించి పాఠశాలకు వన్నె తెచ్చారని ప్రిన్సిపల్ ఎన్.వి.మురళీధర్‌బాబు తెలిపారు.

**డాక్టరుగా పేద ప్రజలకు సేవలందిస్తా..**

అమ్మానాన్నలు షమీవుల్లా, అయిషాలు వ్యవసాయం చేస్తారు. మాది చిలమత్తూరు మండలం కొడికొండ. భవిష్యత్తులో ఏఐఎంఎస్ (న్యూఢిల్లీలో మెడిసిన్ పూర్తి చేసి డాక్టరుగా ప్రజలకు సేవలు అందిచాలన్నదే నా ఆశయం. – ఆఫ్రిది (595)

**ఇంజినీరునవుతా..**

మాది కదిరి నియోజకవర్గంలోని గోకనపల్లి. నిరుపేద రైతు కుటుంబం. అమ్మానాన్న నూర్‌మహమ్మద్, నస్రీన్‌లు కూలీ పనులు చేస్తారు. భవిష్యత్తులో ఇంజినీరింగ్ చదివి సాఫ్ట్ వేర్ ఉద్యోగం సంపాదించి ప్రజలకు సేవ చేయాలన్నదే నా అభిలాష. – అహ్మద్‌హుసేన్ (595)

**నాలుగేళ్లుగా ఉత్తమ ప్రతిభ**

గురుకుల పాఠశాల ప్రారంభమై 52 ఏళ్లు కావస్తోంది. నాటి నుంచినేటి వరకు పాఠశాలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థుల విద్యాప్రగతికి ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సహకారంతో పదోతరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు దోహద పడ్డాయి. నాలుగేళ్ల నుంచి వరుసగా పది ఫలితాల్లో ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ పాఠశాలకు పూర్వవైభవం తీసుకొచ్చారు. – ఎన్.వి.మురళీధర్‌బాబు. ప్రిన్సిపల్

# చేపా.. చేపా.. ఏమయ్యావ్!



చోడవరం :చోడవరం సమీపంలోని లక్ష్మీపురం పెద చెరువులో చేపలు పడుతున్నారంటే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారంతా అక్కడే ఉంటారు. పెద్ద చేపలు దొరికితే వాటాలు వేసుకునేందుకు ఇద్దరు, ముగ్గురు జట్టు కడతారు. కానీ ఇక్కడి చేపలను విశాఖ తరలించేస్తున్నారు. ఒకటీ అరా.. విక్రయించినా ఎక్కువ ధర చెబుతున్నారని స్థానికులు వాపోతుంటే.. చెరువులో చేపల లభ్యత చాలా తక్కువగా ఉందని శ్రీగౌరి మత్స్యకార సహకార సంఘ సభ్యులు చెబుతున్నారు. నాలుగేళ్లుగా నష్టాలే వస్తున్నాయని సంఘ పెద్దలు చిట్టా విప్పుతున్నారు. ఏటా రూ.50 లక్షలకుపైగా ఆదాయం వచ్చే లక్ష్మీపురం చెరువులో చేపలు పడకపోవడమేంటి, నష్టాలు రావడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

లక్ష్మీపురం గ్రామాన్ని అనుకుని 178.6 హెక్టార్ల విస్తీర్ణంలో పెద చెరువు ఉంది. మత్స్య శాఖకు లీజు సొమ్ము చెల్లించి శ్రీగౌరి మత్స్యకార సహకార సంఘ సభ్యులు చెరువులో చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తుంటారు. లీజు సొమ్ములో 50 శాతం జలవనరుల శాఖకు, 20 శాతం మత్స్యశాఖకు, 30 శాతం పంచాయతీకి వెళ్తుంది. ఈ ఏడాది లీజు సొమ్ముగా రూ.1.10 లక్షలు సంఘం చెల్లించింది. ఈ సంఘంలో 11 గ్రామాలకు చెందిన మత్స్యకారులున్నారు. గతేడాది రూ.20 లక్షల వరకు నష్టం వచ్చిందంటూ ప్రభుత్వానికి ఇచ్చిన ఆడిట్ నివేదికలో సహకార సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ ఏడాది చేపలు పట్టి విక్రయించే బాధ్యతను గుత్తేదారుకు అప్పగించేశారు. ఈ ఏడాదీ నష్టం వచ్చేలా ఉందని సంఘ పెద్దలు చెబుతున్నారు.

చెరువులో మత్స్య సంపదకు లోటు లేదు. చేపల విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని వాటాలుగా పంచుకోవడం వల్ల సంఘానికి జమ కావడం లేదని సభ్యులు ఆరోపిస్తున్నారు. సుమారు రూ.15 లక్షల వరకు అనధికారికంగా పంచుకుని ఉంటారని అనుమానిస్తున్నారు. ఖర్చులు రూ.లక్షల్లో చూపుతున్నారని వాపోతున్నారు. 'మత్స్య శాఖ నాలుగేళ్లుగా చేప పిల్లలను ఇవ్వకపోవడంతో కొనుగోలు చేయాల్సి వస్తోంది. చెరువు చుట్టూ గస్తీకే ఎక్కువ ఖర్చవుతోంది. చెరువులో నీరు తగ్గడం వల్ల చేపల ఎదుగుదల పెద్దగా లేదు. చేప పిల్లల్ని గార తినేస్తుండటంతో ఖర్చులు తప్ప ఆదాయం పెద్దగా ఉండటం లేద'ని సంఘ అధ్యక్షుడు బేరా శివాజీ పేర్కొన్నారు.

## అతివకు అండగా.. పోలీసులు ఉండగా..

రాజమహేంద్రవరం : మహిళలు నిత్యం ఎక్కడో ఓచోట చిత్రహింసలకు, లైంగిక వేధింపులకు గురికావడం.. ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు తరుచూ మనం వింటున్నాం. నేరాల నియంత్రణకు ఎన్ని కొత్త చట్టాలు తీసుకువచ్చినా అవి ఎక్కువ భాగం కేసుల వరకే పరిమితం కావడం.. ఎక్కడో కొన్ని చోట్ల శిక్షలు పడిన సందర్భాలు ఉంటున్నాయి. ఈ క్రమంలో మహిళలకు మరింత భద్రత పెరగాల్సిన అవసరం ఉంది. మహిళా స్టేషన్‌లో అధికం..

మహిళా సాధికారత, వారి భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళా పీఎస్‌లతో పాటు శక్తి యాప్‌ను ఏర్పాటు చేసింది. గత ఏడాది జిల్లాలో మహిళల విషయంలో మొత్తం 958 కేసులు నమోదు కాగా వాటిలో రాజమహేంద్రవరం మహిళా పీఎస్‌లో 400 పైగా కేసులు ఉన్నాయి. ప్రస్తుతం మూడు నెలల కాల వ్యవధిలో మహిళా రక్షక్, శక్తియాప్, 112 కాల్ సెంటర్ నంబర్లకు సుమారు 100 పైగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 40పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీటిలో వేధింపులు, ఈవ్‌టీజింగ్, మహిళల వ్యక్తిత్వానికి భంగం కలిగించేలా



వ్యవహరించడం, దాడులు, అత్యాచారాలు, వరకట్న వేధింపులు తదితర అంశాలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

అన్నపూర్ణమ్మపేటకు చెందిన ఎన్.జ్యోతిసాయి శంకర్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ, భార్యా పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మీరా(32) అనే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోగా, ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఇటీవల ఆమెను పథకం ప్రకారం హత్య చేశాడు.సీటీఆర్ఐ ప్రాంతానికి చెందిన పి.రాజేశ్వరి భర్తతో విడిపోయి పిల్లలతో ఒంటరిగా జీవిస్తోంది. అంతా సక్రమంగా ఉందనుకునే సమయంలో ఆమె ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ప్రేమించిన వ్యక్తి రెండో వివాహానికి నిరాకరించడంతోనే ఆమె ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

గ్రామీణం పరిధిలో తనకు ఇష్టమైన కూర వండలేదని మద్యం మత్తులో భార్య మెడపై కొబ్బరి బొండాల కత్తితో దాడి చేశాడు ఆమె భర్త.

**కఠిన చర్యలు..**బాలికలు, మహిళలపై తరచూ దాడులు జరగడం.. వెంటనే పోలీసులు అప్రమత్తం కావడం పరిపాటైంది. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ప్రతి స్టేషన్ పరిధిలోనూ శక్తి టీమ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శక్తి యాప్‌తో మహిళకు రక్షణ ఉంటుందని.. ప్రతి ఫోన్‌లోనూ ఆ యాప్ ఉండేలా చూసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అలాగే బాలికలు, యువతులకు ఆత్మరక్షణ మెళకువలపై శిక్షణ ఇస్తున్నారు.

## ఉపాధి శ్రామికులకు బీమా

చిత్తూరు : ఉపాధి పనులు చేసే శ్రామికులందరికీ ప్రమాద బీమా చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రమాదాలకు గురై శ్రామికులు మృతి చెందుతున్న సంఘటనలు అక్కడక్కడా చోటుచేసుకుంటున్నాయి. వారికి ఎలాంటి బీమా లేకపోవడంతో ఆ కుటుంబాలకు ఆర్థిక సాయం అందని పరిస్థితి. కొత్త విధానం అమల్లోకి వస్తే లక్షలాది కుటుంబాలకు బీమా భరోసా లభిస్తుంది.

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 2.67 లక్షల మంది జాబ్ కార్డులు కలిగిఉన్నారు. వీరిలో 1.44 లక్షల కుటుంబాలు, 4.79 లక్షల మంది విడతల వారీగా ఉపాధి పనులకు హాజరవుతున్నారు.



వీరిని రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్ష యోజన, జీవనజ్యోతి బీమా యోజన పరిధిలోకి తీసుకు రావాలని నిర్ణయించారు. మే ఒకటో తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధి కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వివరాలు బ్యాంకుల్లో నమోదు చేయించాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని అధికారులు ఆదేశించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ఒక వ్యక్తి ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాలి. 18-70 ఏళ్ల మధ్య వయస్సున్న వారు అర్హులు. కార్మికుడు ప్రమాదంలో చనిపోతే బాధిత కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహారం లభిస్తుంది. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకానికి 18-50 ఏళ్ల వయస్సున్న వారు అర్హులు. ఏడాదికి రూ.436 చెల్లించాలి. పాలసీ వ్యవధిలో ఏ కారణంతోనైనా కార్మికుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహారం అందుతుంది.

## విద్యుత్తు స్తంభం.. గాలిలో దీపం

నంద్యాల: విద్యుత్తు స్తంభాలు కూలినా.. విరిగిపోయినా వెంటనే మార్చాలి. పట్టణాల్లో అయితే 12 గంటల్లో, గ్రామాల్లో 24 గంటల్లో మార్చాలి. కొత్తవి ఏర్పాటు చేయడానికి స్తంభాలు అందుబాటులో లేవు. అవసరమైన సామగ్రి లేకపోవడంతో తాము ఏం చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్నిరోజులుగా ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. వీటి ధాటికి విద్యుత్తు సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తమవుతోంది. పెద్ద సంఖ్యలో స్తంభాలు కూలిపోతున్నాయి. ఇప్పటికే ఒక్కో విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో పదుల సంఖ్యలో స్తంభాలు విరిగిపోయాయి. కొత్త విద్యుత్తు స్తంభాలు కావాలంటూ తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయానికి ఎస్ఈలు నివేదించారు. ప్రస్తుతం అవసరానికి తగ్గట్టు సరఫరా లేక సమస్యలు ఎదురవుతున్నాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు సమస్యలు ఎదురవుతున్నాయి. గృహ, వ్యవసాయ విద్యుత్తు వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మారుస్తున్నవి కొన్నేఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన గాలివానలకు 500కు పైగా స్తంభాలు నేలకూలాయి. వీటి స్థానంలో అధికారులు కొన్ని మాత్రమే ఏర్పాటు చేశారు. మిగతా వాటి కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. మంత్రాలయం మండలంలో 10, కోసిగి 5, కోడుమూరు మండలంలో 5 చొప్పున కూలిపోయాయి.సామగ్రి కొరతగృహ అవసరాల విద్యుత్తును 8, 9.1, 11 మీటర్ల ఎత్తయిన స్తంభాల ద్వారా సరఫరా చేస్తారు. సాధారణంగా 11 మీటర్ల స్తంభం రూ.9 వేలు, 8 మీటర్లది రూ.3,500, 9.1 మీటర్ల స్తంభం ధర రూ.5 వేల వరకు ఉంటుంది. విద్యుత్తు స్తంభం కూలితే తీగలు, కాసారాలు దెబ్బతింటాయి. వాటికి మరో రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఖర్చవుతుంది.

విరిగిన స్తంభాల వివరాలను ఏఈ ఉన్నతాధికారులకు నివేదిస్తారు. రూ.లక్ష విలువ చేసే స్తంభాల వరకు డీఈ మంజూరు చేస్తారు. రూ.2 లక్షల వరకు ఎస్ఈ మంజూరు చేస్తారు. ఆ పైన మంజూరు కావాలంటే ఎస్పీడీసీఎల్ తిరుపతి ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సిందే.సాధారణంగా విద్యుత్తు స్తంభం గంటకు 20 కి.మీ వేగంతో వీచే గాలులకే తట్టుకోగలదు. కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కి.మీల వేగంతో గాలులు వీస్తున్నాయి. దీంతో స్తంభాలు విరిగిపోయి నేలకూలుతున్నాయి. కొరత కారణంగా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం ఆలస్యమవుతోంది.

చరకలు



# పేద రోగుల పెన్నిధి

అనకాపల్లి : వ్యాధి నిర్ధారణ అయితే వైద్యం చేయడం సులభం. దీనికి ల్యాబ్‌లో పరీక్షలు అవసరం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల రక్త, మూత్ర పరీక్షలు చేయడానికి వీలు లేకపోవడంతో పేద రోగులకు ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేలా కూటమి ప్రభుత్వ హయాంలో జిల్లా ఆసుపత్రుల్లో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను నెలకొల్పాలని నిర్ణయించారు.
జిల్లా ఆసుపత్రిలో జనరల్ ల్యాబ్, మైక్రోబయాలజీ, ఐసీటీసీ, పీపీటీసీటీ, సీబీనాట్ ల్యాబ్‌ల్లో పరీక్షలు చేస్తున్నారు. దీంటో పాటు క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నారు. జనరల్ ల్యాబ్‌లో ఇటీవల సీబీసీ ఫుల్లీ ఆటోమెటిక్ మిషన్ అందుబాటులోకొచ్చింది. ఒకేసారి 100 నమూనాలను ఇందులో పరీక్ష చేయొచ్చు. రోజుకు 600 నుంచి 800 రకాల పరీక్షలను చేస్తున్నారు. సెమీ ఆటోమెటిక్ సీబీసీ మిషన్ ఇదివరకు ఉండేది. ఇప్పుడు ఫుల్లీ ఆటోమెటిక్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చారు. థైరాయిడ్ పరికరంతో పరీక్షలు చేస్తున్నారు.



**మైక్రోబయాలజీలో..**
జనరల్ ల్యాబ్‌లో మూత్ర, రక్తపరీక్షలు కలిపి 63 వరకు జరుగుతున్నాయి. మైక్రోబయాలజీకి సంబంధించి 10 పరీక్షలు చేస్తున్నారు. గుండెకు సంబంధించి ట్రాఫిక్‌ఐ, ట్రాఫిన్‌టీ పరీక్షలతో పాటు థైరాయిడ్ పరీక్ష చేస్తున్నారు. హెచ్‌బీఏఐసీలో మూడునెలలకు సంబంధించి రోగి శరీరంలో చక్కెరకు సంబంధించిన పరీక్ష ఇక్కడ జరగడం లేదు. ఇది బయట చేయించుకోవాల్సి వస్తోంది. 'జిల్లా ఆసుపత్రిలో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను పెట్టాలని ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయించారు. దీంట్లో భాగంగా అనకాపల్లి ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు చేసే ల్యాబ్ అందుబాటులోకి రానుంద'ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు.

**వ్యాధి నిర్ధారణ చేపట్టేలా...**
– డాక్టర్ ఉప్పాడ రమేష్, పేథాలజిస్టు, జిల్లా ఆసుపత్రి
ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే రక్తపరీక్షలు చాలావరకు చేస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఏర్పాటుతో మరిన్ని పరీక్షలు అందుబాటులోకొస్తాయి. అనకాపల్లి ఆసుపత్రిలో ఇద్దరు పేథాలజిస్టులు ఉన్నా. మరిన్ని సేవలు అందించడానికి ప్రయత్నిస్తున్నాం.

# పోలీసు శాఖలో ప్రక్షాళన

చిత్తూరు : జిల్లాలో భారీగా పోలీసుల బదిలీలు జరిగాయి. పుంగనూరు మండలం కృష్ణాపురంలో తెదేపా కార్యకర్త రామకృష్ణ హత్యపై పలమనేరు ఎమ్మెల్యే పోలీసు శాఖపై తీవ్ర స్థాయిలో మండిపడిన విషయం విదితమే. అన్ని పోలీస్‌స్టేషన్‌లలో వైకాపాకు ఒత్తాసు పలికే పోలీసులే విధులు నిర్వహిస్తున్నారని.. ప్రతి విషయాన్ని పార్టీకి చేరవేస్తున్నారని, వారి ద్వారా అక్రమ వ్యాపారాలన్నీ సాగుతున్నాయని ఆరోపించారు. ఇలా పోలీసు శాఖపై ఒక్కసారిగా ఆరోపణలు రావడంతో ఎస్పీ అప్రమత్తమయ్యారు. బదిలీ ప్రక్రియ ప్రారంభించారు. 45 మంది ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు, 219 కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. పుంగనూరు నియోజకవర్గం పరిధిలో పనిచేసే వారే సుమారు 25 మంది ఉన్నారు. అందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా ఉన్నారు.
**అసంతృప్తి సెగలు** పోలీసు శాఖపై విమర్శలు వస్తుండడంతో ఎస్పీ బదిలీల ప్రక్రియ ప్రారంభించినా.. అందులోనూ విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని అడగకుండా బదిలీ చేసినా పర్వాలేదు కాని.. ఎలాంటి ఆరోపణలు లేని వారిని కూడా అడగకుండా బదిలీ చేయడంతో పోలీసు శాఖలోనే అసంతృప్తి సెగలు వస్తున్నాయి. 4–5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారందరిని బదిలీ చేయాల్సి ఉంది. దీని కోసం ఒక్కొక్కరి నుంచి మూడు ఆప్షన్‌లు తీసుకుని బదిలీ చేస్తుంటారు. 219 మందిని బదిలీ చేయాల్సి ఉండగా.. రాత్రే అందరి బదిలీలు పూర్తి చేశారు. 219 మందికి ఎలాంటి కౌన్సెలింగ్ లేదు. **ఉనికి చాటుకోవడానికేనా?** 'పోలీసు శాఖలో ఎవరి మాట వినను. రాజకీయ నాయకుల సిఫార్సులొస్తే తిప్పికొడతా..' అని చెప్పిన ఎస్పీ విమర్శలు మూటగట్టుకున్న అనంతరం శాంతించారు. మొదట్లో సీఐలు, ఎస్సైలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకుని.. జూద స్థావరాలు, లాటరీ వ్యాపారాలు, మద్యం అక్రమ రవాణా, ఇతర అక్రమ వ్యాపారాలపై ఆకస్మిక దాడులు చేశారు. రాజకీయ నాయకులు ఒత్తిడి తెచ్చినా మొండిగానే వ్యవహరించారు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ ఒక్క సారిగా ప్రత్యేక బృందాల దాడులు ఆగిపోయాయి. అక్రమ వ్యాపారాలన్నీ ఒకొక్కటిగా ప్రారంభమయ్యాయి. ప్రస్తుత బదిలీలు కూడా తన ఉనికి చాటుకోవడానికే అని పలువురు పేర్కొంటున్నారు.

# భూముల్లో తీగలు.. ఉండవిక బాధలు

గురుద్వారా : విపత్తుల సమయంలో విద్యుత్తు వ్యవస్థ చిన్నాభిన్నమై సరఫరాకు అంతరాయం ఏర్పడటమే గాక ఏపీఈపీడీసీఎల్‌కు తీవ్ర ఆస్తినష్టం వాటిల్లుతోంది. ఈ సమస్య అధిగమించేలా భూగర్భ విద్యుత్తు తీగల వ్యవస్థ ఏర్పాటుకు ప్రపంచ బ్యాంకు నిధులతో రూపకల్పన చేశారు. తొలి విడతగా నగరంలో ఇదివరకు రూ.800 కోట్లతో జోన్–1 పరిధిలో వన్‌టౌన్ మొదలుకొని రుషికొండ వరకు సముద్రతీర ప్రాంతంలో పనులు చేశారు. పలు కారణాల రీత్యా కొన్నేళ్లుగా పనులు నిలిపివేశారు. ప్రస్తుతం ఆర్‌డీఎస్‌ఎస్(రీవేంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) కింద రెండో విడత పనులు పునఃప్రారంభించారు. వీటికోసం రూ.973.44 కోట్లు కేటాయించారు. జీవీఎంసీ పరిధిలో కూర్మన్నపాలెం నుంచి ఆనందపురం వరకు ఈ పనులు చేపడుతున్నారు. గతంలో ఇంటి నుంచి విద్యుత్తు స్తంభాలకు వెళ్లే తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకి సరఫరా చేసే హెచ్‌టీ తీగలు అంతా కలిపి భూగర్భంలోనే వేశారు. దీనివల్ల ఆర్థికభారం అధికమవ్వడంతో ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో స్వల్ప మార్పులు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సబ్‌స్టేషన్‌కు సరఫరా అయ్యే 33, 11కేవీ విద్యుత్ తీగలు మాత్రమే భూగర్భంలోకి వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు.. 33కేవీకి సంబంధించి రూ.340 కోట్లతో 547 కిలోమీటర్ల వరకు, రూ.633 కోట్లతో 11కేవీ తీగలు 1740 కిలోమీటర్ల వరకు వేస్తున్నారు. ఆటోనగర్‌లో జరుగుతున్న పనులను ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెళ్లి పరిశీలించారు. రానున్న రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు.

# పార్కుల్లో గం'జాయ్'!!




విశాఖపట్నం: కాలనీల్లో పార్కులు ఆహ్లాదానికి ఏమాత్రం ఉపయోగపడటం లేదు. గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులకు అడ్డాలుగా మారిపోయాయి. నిత్యం బిజీ బిజీగా గడిపే నగరవాసులు సాయంత్రం అయితే ఆహ్లాదకరంగా ఉన్న పార్కుల్లో సేదతీరేందుకు వెళ్లాలంటే భయపడుతున్నారు. పార్కుల నిర్వహణ అంతంతమాత్రంగా ఉండటంతో లైట్లు వెలగడం లేదు. ఆ చీకటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. కొన్ని కాలనీల్లోని పార్కులైతే చుట్టూ నివాసాలు, అపార్ట్‌మెంట్‌లు ఉన్నప్పటికీ పట్టపగలే అల్లరి వకలు మద్యం బాటిల్స్‌తో రెచ్చిపోతున్నారు.
**ఎన్నో ఉదంతాలు** జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్‌లోని పార్కులో ఎటు చూసినా బీరుబాటిళ్లు, మద్యం సీసాలే దర్శనమిస్తాయి. విచిత్రమేమంటే ఈ పార్కును ఆనుకుని వార్డు సచివాలయం, పారిశుద్ధ్య కార్యాలయం ఉన్నాయి. ఇటీవల కొందరు స్కూలు విద్యార్థులు ఈ పార్కులో క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లగా, పట్టపగలే కొందరు మందుబాబు మద్యం సేవించి, తాగిన సీసాలు ఆ విద్యార్థుల బ్యాగ్‌లలో పెట్టి అల్లరి చేష్టలు చేశారు.మురళీనగర్‌లోని వైశాఖి స్పోర్ట్స్ పార్కు వద్ద చైన్ స్నాచింగ్ జరగ్గా, ఆ తర్వాత గంజాయి మత్తులో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉదంతాలు ఇక్కడ చోటుచేసుకున్నాయి.ఇటీవల నగరంలోని ఓ పార్కుకు అతి సమీపంలో ఉన్న ఓ అపార్ట్‌మెం ట్‌లో ఓ కుటుంబం అద్దెకు దిగారు. సమీపంలోనే పార్కు ఉండటం వాకింగ్‌కు, ఆహ్లాదకరంగా ఉంటుందన్న భావనతో అక్కడకు అద్దెకు వెళ్లారు. తీరా ఆ భార్యభర్తలు సాయంత్రం భోజనం చేసి వాకింగ్ చేద్దామని పార్కులోకి వెళ్లగా, మందుబాబులు వాళ్లని ఆటపట్టిస్తూ భయభ్రాంతులకు గురి చేశారు. **కాలనీ పార్కుల నిర్వహణ అటకెక్కి:** జీవీఎంసీ పరిధిలో 145 కాలనీ పార్కులున్నాయి. వీటితోపాటు 16 మేజర్ పార్కులుండగా, వాటి నిర్వహణ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నడుస్తోంది. కాలనీ పార్కుల నిర్వహణ మాత్రం ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. పార్కుకు సరైన గేట్లు లేకపోవడం, పార్కులో లైట్లు వెలగకపోవడం, పిచ్చి చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. మందు బాటిళ్లతో పార్కు అంతా నిండి పోయి కనిపిస్తుంటే కనీసం పోలీసులకు ఫిర్యాదు చేయడమో, రక్షణ చర్యలు చేపట్టడమో, లైట్లు వెలిగేలా చూడటమో జీవీఎంసీ అధికారులు చూడటం లేదు.
**ఎక్కడ చూసినా ఇదే తీరు:** మాధవధార పరిధిలోని తెన్నేటిపార్కులో ప్రతి రోజూ మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లు తిష్టవేస్తున్నారు. పెదవాల్తేరు పరిధిలోని టేకు చెట్ల పార్కులో పట్టపగలే మందుబాబులు వీరంగం వేస్తుండగా, స్థానికుల ఫిర్యాదుతో పది రోజుల కిందట పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకున్నారు. ఎంవీపీ కాలనీలోని సెక్టార్–6 ఏనుగుల పార్కులో మిట్ట మధ్యాహ్నమే మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. విశాలక్ష్మినగర్ రెవెన్యూ పార్కు గోడలపై కూర్చొని రాత్రిళ్లు గంజాయి బ్యాచ్‌లు హల్‌చల్ చేస్తున్నారు. మధురవాడ పరిధిలో వాంబేకాలనీ యపీహెచ్‌సీ ఎదురుగా పార్కులో, సాంకేతిక కళాశాల సమీపంలోని ఎంఐజీ నివాసాల మధ్య పార్కులో అల్లరి వకలు మద్యం సీసాలతో రెచ్చిపోతున్నారు. పోర్టు క్వార్టర్స్, కైలాసపురం డీఎల్‌బీ క్వార్టర్స్, పశ్చిమ నియోజకవర్గం పరిధిలో 60వ వార్డు గుల్లలపాలెం జీవీఎంసీ పార్కు, ములగాడ హౌసింగ్ కాలనీ పార్కుల్లో రాత్రిళ్లు గంజాయి బ్యాచ్‌లు చెలరేగిపోతున్నారు.
**పోలీసులు నిఘా పెడితేనే..:** పబ్లిక్ పార్కుల్లో బహిరంగంగా మద్యం సేవించే వారిపై ఆయా స్టేషన్ల పరిధిలో పోలీసులు నిఘా పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే కానీ స్పందించడం లేదు. గంజాయిపై ఉక్కు పాదం మోపాలంటే ఇలాంటి పార్కుల్లో నిఘా పెడితే గంజాయి అమ్మకాల వలాలు తెలుస్తాయి. ఇలా పార్కుల్లో మత్తులోకి జారుకున్న కొందరు యువకులు బయటకొచ్చి దారి దోపిడీలకు తెగబడుతున్నారు.

# రైతులకు మరో శుభవార్త



అనకాపల్లి : గత వైకాపా ప్రభుత్వం సూక్ష్మపోషకాలే కాదు కనీసం మట్టి పరీక్షల జోలికి కూడా పోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మట్టి పరీక్షలు చేపట్టారు. పరీక్షలు పూర్తి కాగా వాటి ఫలితాలను కార్డుల రూపంలో రైతులకు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. చాలా భూముల్లో సూక్ష్మపోషకాల లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఇప్పుడు అవసరమైన సూక్ష్మపోషకాలు ఉచితంగా అందిస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనతో జిల్లాలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
జిల్లాలో ఈ ఏడాది 18,600 మట్టి నమూనాలు సేకరించారు. ఇప్పటికే భూసార పరీక్ష కేంద్రంలో మట్టి పరీక్షలు పూర్తి చేశారు. వీటి వివరాలను రైతులకు అందించేందుకు అనువుగా కార్డులు ముద్రిస్తున్నారు. ఏరైతు భూమిలో ఏ రకం పోషకం ఎంతమేర లభ్యత ఉంది, ఏ రకం లోపం వెలుగులోకి వచ్చింది, ఏ పంట వేసుకోవాలి, ఆయా పంటలకు ఏఏ రకాలు సూక్ష్మ పోషకాలు ఎంత మోతాదులో వాడాలి వంటి పూర్తి సమాచారం కార్డులో నమోదు చేస్తున్నారు. గతంలో తెదేపా హయాంలో భూసార పరీక్షలు చేసి వాటి ఫలితాలు పరిగణనలోకి తీసుకుని సూక్ష్మ పోషకాలను కొన్నిసార్లు ఉచితంగా, మరికొన్నిసార్లు 50, 75 శాతం రాయితీపై అందించారు. ఈసారి కూడా ఇదేవిధానం అనుసరించే అవకాశం ఉందని తెలిసింది. ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ ఇతర పంటలకు లబ్ధి కలిగే విధంగా 244 మెట్రిక్ టన్నుల సూక్ష్మపోషకాలు అవసరమని అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. వేరుశనగలో కాయల నాణ్యత పెంపుకు, సమస్యాత్మక భూముల్లో సారం పెంచేందుకు జిప్సం ఉపయోగిస్తారు.
**అనుమతి రాగానే పంపిణీ:** జిల్లాలో భూసార పరీక్షలు పూర్తయ్యాయి. కార్డుల పంపిణీ చేపట్టాం. ఖరీఫ్ సాగు చేపట్టే నాటికి అందరికి కార్డులు అందిస్తాం. జిల్లాలోని రైతులకు జింక్, బొరాక్స్, జిప్సం ఏమేరకు అవసరమో వివరాలు ఉన్నతాధికారులకు పంపాం. అనుమతి వచ్చిన వెంటనే రైతులకు అందిస్తాం. బి.మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి

# రోజూ వైద్యం.. రోగులకు ఉపయుక్తం



విశాఖపట్నం: కింగ్‌జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లోని స్పెషాలిటీ విభాగాలకు చెందిన ఓపీల్లో ఇక నుంచి రోజూ సేవలు అందించనున్నారు. ఇన్నాళ్లు ఆయా విభాగాల ద్వారా వారంలో రెండేసి రోజులు మాత్రమే ఓపీ సేవలు అందేవి. మిగిలిన రోజుల్లో వార్డు స్థాయి సేవలు, పర్యవేక్షణ, ఇతర వైద్య పరీక్షల నిర్వహణ, పీజీలకు తరగతులు నిర్వహించేవారు.
**ఇవీ విభాగాలు..!:** కేజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ విభాగాలైన కార్డియాలజీ, కార్డియోథొరాసిక్, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, ఎండోక్రైనాలజీ విభాగాలు ఉన్నాయి.కేజీహెచ్‌లోని 12 స్పెషాలిటీ విభాగాల్లోనూ అనుభవజ్ఞులైన వైద్య నిపుణులతో పాటు పీజీలు అందుబాటులో ఉంటున్నారు. దీంతో ఆయా విభాగాలకు నిత్యం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, పొరుగున ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. **రద్దీ తగ్గనుంది..!:** ఇకపై రోజూ ఓపీ సేవలు అందించడం ద్వారా ఆయా రోగులకు ఉపయుక్తంగా ఉండనుంది. ఇన్నాళ్లు వారానికి రెండు రోజులు మాత్రమే నిర్వహించడంతో, ఆయా రోజుల్లో రోగులు అధికంగా వచ్చేవారు. గంటల తరబడి వైద్యం కోసం వేచి ఉండేవారు. ఇప్పుడు రోజూ ఓపీ అందుబాటులో ఉండడంతో రోగుల తాకిడి తగ్గే అవకాశం ఉంటుంది. రోగ నిర్ధారణ పరీక్షల నివేదికలు ఒక్కరోజు వ్యవధిలోనే అందనున్నాయి. మంగళవారం 12 స్పెషాలిటీ విభాగాల్లోనూ ఓపీ సేవలు అందించారు. సుమారు 200 మంది వైద్య పరీక్షలకు వచ్చారు.
కొత్త పద్ధతిలో రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓపీలు ఉంటాయని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ పి.శివానంద తెలిపారు.

# ఎత్తిపోయిన పథకం.. ఎండిపోయిన పొలం

ఎమ్మిగనూరు : తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టును స్థిరీకరించి పశ్చిమ ప్రాంత రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో రూపొందించిన గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని వైకాపా 'నీరు'గార్చింది. మోటార్లు, పంప్‌హౌస్‌లు, విద్యుత్తు నియంత్రికలు, పైపులైన్లు నిర్వహణ చేపట్టకపోవడంతో పథకం ఎత్తిపోయింది. మోటార్లు బాగు చేసి ఐదేళ్లు బీళ్లుగా మారిన పొలాలకు నీళ్లు మళ్లించాలని అన్నదాతలు 'కూటమి' ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

**పైసా ఇవ్వని వైకాపా**
తుంగభద్ర నుంచి నీటిని తోడి ఆయకట్టుకు మళ్లించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు పునాది వేశారు. రూ.180 కోట్లు వెచ్చించారు. ఏటా 5.373 టీఎంసీల నీటిని ఎత్తిపోసి 40 వేల ఎకరాల ఆయకట్టు, 10 వేల ఎకరాల ఆరుతడి పంటలకు సాగునీరు ఇవ్వాలి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్వహణకు పైసా ఇవ్వలేదు.
రైతులే స్వయంగా ఎకరానికి రూ.1,000 నుంచి రూ.2 వేల చొప్పున విరాళాలు సేకరించి మోటార్ల మరమ్మతులు, కాల్వలు, ఇతర పనులకు ఖర్చు చేశారు. సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు పారేలా



రైతులు స్వయంగా ఏటా నిర్వహణకు రూ.3 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.15 కోట్లకుపైగా ఖర్చు చేయడం గమనార్హం. కానీ కొన్ని పథకాల్లో మోటార్లు సక్రమంగా పని చేయకపోవడంతో దిగుబడులొచ్చే సమయానికి నీరు లేక ఎండిపోయి రూ.కోట్లలో నష్టపోయారు.
దొంగల పాలయ్యాయి
సోగనూరు ఎత్తిపోతల పథకంలో ఆరు మోటార్లకు మూడు పని చేస్తున్నాయి. స్టేజ్–2 పంపుహౌస్ వద్ద రెండే పని చేయడంతోపాటు జలాశయంలో ముళ్లపొదలు, రాతిపరుపు కదిలింది. నాలుగు మోటార్లకు మరమ్మతులు చేయాల్సి ఉంది. చిలకలడోణ ఎత్తిపోతల స్టేజ్–1 తుంగభద్ర నది ఒడ్డున నదికైరవాడి వద్ద స్టేజ్–1 ఏర్పాటు చేశారు. ఇందులో 1,250 కేవీ (33 కేవీ) విద్యుత్తు నియంత్రిక బిగించారు. నియంత్రికలను దొంగలు ధ్వంసం చేసి రాగితంతిని అపహరించారు.
పూలచింత స్టేజ్–1 గంగవరం వద్దనున్న ఎత్తిపోతల నియంత్రికలను దొంగలు ధ్వంసం చేసి రూ.7.50 లక్షల విలువైన 750 కిలోల రాగితంతిని చోరీ చేశారు. వీటిలో మోటార్లకు అరకొరగా మరమ్మతులు చేయించారు.
మాధవరం స్టేజ్–1 పంపుహౌస్‌లో రెండు నియంత్రికలు, మూడు స్టార్టర్లు, ఇన్‌సులేటర్లు, బ్రేకర్లు, బ్యాటరీలు, 9 కాపర్ షీట్లను ఎత్తుకెళ్లారు. చిలకలడోణలో మెకానిక్‌లు, అవసరమైన సామగ్రికి సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు చేయాల్సిందే. బసలదొడ్డి ఎత్తిపోతల పథకంలో రెండు పంప్‌హౌస్‌లో మోటార్లు అరకొరగా నడుస్తున్నాయి.

**రూ.17.50 కోట్లతో ప్రతిపాదనలు**
భాస్కర్‌రెడ్డి, ఈఈ
మోటార్ల మరమ్మతులు, ఇతర పనులకు సుమారు రూ.17.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ఏడు ఎత్తిపోతల పథకాలకు అవసరమైన మోటార్లు, పైపులు, ఇతర నిర్వహణకు సిద్ధం చేశాం. పులికనుమ, పులకుర్తి ఎత్తిపోతల పథకాల నిర్వహణకు గుత్తేదారులకు గడువు ఉంది. వీటి నిర్వహణ వారే చూస్తారు. వచ్చే సీజన్‌లోపు అన్ని పథకాల ద్వారా రైతులకు సాగునీరు పారించాలన్న లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేశాం.

# అదుపులో అతిసారం

గోపాలపురం : గోపాల పురం మండలంలోని 8 గ్రామాల పరిధిలో అతిసారం అదుపులోకి వచ్చినట్లు సీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. 9మంది ఆసుపత్రిలో ఉండగా వారిలో ఆరుగురిని ఉదయం డిశ్చార్జి చేసినట్లు సూపరింటెండెంట్ చైతన్యరాజు తెలిపారు. గోపాలపురం, చిట్యాల గ్రామాలకు చెందిన నలుగురు స్వల్ప వ్యాధి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చారని, వారంతా ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ప్రస్తుతానికి ఏడుగురు ఆసుపత్రిలో ఉన్నారు.



**పారిశుద్ధ్య పనులు.. వైద్య శిబిరాలు** జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు మండలం పరిధిలో అతిసారం కేసులు నమోదైన గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు డీఎల్‌పీవో వై.అమ్మాజీ తెలిపారు. చిట్యాల, గోపాలపురం, పెద్దగూడెం, ఉప్పరగూడెం, పెద్దాపురం, వేళ్లచింతలగూడెం, వెంకటాయపాలెం గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు సైతం ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టి, పరీక్షలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అక్కడ నుంచి ఎప్పటికప్పుడు వైద్యులు, పంచాయతీరాజ్, ఇతర అధికారులతో చరవాణిలో మాట్లాడి రోగుల పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన ఆదేశాల మేరకు తెదేపా నాయకులు రోగుల సౌకర్యార్థం ఆసుపత్రిలో మూడు జంబో పంకాలు ఏర్పాటు చేశారు.

చురకలు



## 'పల్లె పుష్కరణి'కి శ్రీకారం

అనంతపురం : గ్రామ సంపదగా భావించే చెరువులు.. కోనేరు(మెట్ల బావి) పూర్వ వైభవాన్ని సంతరించుకోనున్నాయి. ఈమేరకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'పల్లె పుష్కరణి' పేరుతో చెరువులను ఉద్యానాల్లా తీర్చిదిద్దడం... ఆలయాల ఆవరణాల్లోని కోనేరులను పునరుద్ధరించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లా జలవనరులు, డ్వామా సంయుక్త సమన్వయంతో 'ఉపాధి' నిధులతో పనులు చేపడతారు. ప్రతి మండలానికి రెండు చెరువులు, కోనేర్లను గుర్తించే ప్రక్రియ కొలిక్కి వస్తోంది. అనంత అర్బన్ మినహా.. తక్కిన 31 మండలాల్లో చెరువులను ఎంపిక చేయనున్నారు. నిర్దేశిత పనులకు ఈనెల 7లోపు గ్రామసభల ఆమోదం తీసుకుంటారు. జూన్ ఆఖరు నాటికి పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ప్రజాప్రయోజనమే లక్ష్యంగా..**

వ్యవసాయ అవసరాలకే కాదు.. గ్రామీణ ప్రాంతాల ముఖ్య కూడలి



ప్రదేశాలుగా తీర్చిదిద్దనున్నారు. పల్లె పుష్కరణి కింద ఎంపిక చేసిన చెరువు పరిసరాల్లో మొక్కలు విరివిగా పెంచడం, కట్టలపై కాలినడక( వాకింగ్ ట్రాక్) దారి ఏర్పాటు, కంపచెట్లు, అపరిశుభ్రత, చెరువుల్లో పూడిక తొలగిస్తారు. అనంత జిల్లాలో 301 చెరువులు ఉన్నాయి. పెద్దపప్పూరులో ఒకటీ లేదు. పుట్లూరు, యల్లనూరులో ఒక్కొక్క చెరువు ఉంది. విడపనకల్లులో రెండు, బొమ్మనహాళ్‌లో మూడు ఉన్నాయి. ఇతర మండలాల్లో ఎక్కువే ఉండటంతో ఏ సమస్య లేదు. ప్రస్తుతం ఎంపిక చేసే చెరువులు గ్రామాలకు సమీపంలో.. జాతీయ, రాష్ట్ర రహదారులకు పక్కనే ఉండాలి. ఎకరం నుంచి ఐదెకరాలు దాకా చెరువు విస్తీర్ణం తప్పనిసరి. కనీసం 8 నుంచి 12 నెలలు నీరు నిల్వ ఉండే చెరువులకే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది.

గ్రామాల మధ్యలో, ఆలయాల ఆవరణాల్లోని కోనేరులను పునరుద్ధరిస్తారు. జిల్లాలో ఇప్పటి దాకా 30 పంచాయతీలల్లో 51 కోనేర్లను గుర్తించారు. ఇందులో ఎక్కువగా పెద్దవడుగూరులో 11, విడపనకల్లులో ఏడు ఉన్నాయి. ఇంకా పది మండలాల్లో ఒకటీ గుర్తించలేదు. పంచాయతీ, గ్రామ ప్రజలు, దేవాలయాల కమిటీల సహకారంతో వాటిని పునరుద్ధరిస్తారు.

## జాతీయ రహదారుల సుంకం పెరుగుదల

హిందూపురం : జాతీయ రహదారుల్లో ప్రయాణించే వాహనాలకు సుంకం పెంచారు. కార్లకు కి.మీకు 5 పైసలు.. బస్సులు, లారీల సామర్థ్యానికి అనుగుణంగా కి.మీ 18 నుంచి 34 పైసలు చొప్పున పెంచారు. ఉమ్మడి అనంత జిల్లా పరిధిలో 9 టోల్‌ప్లాజాలు ఉన్నాయి. బెంగళూరు– హైదరాబాద్ నగరాలను కలిపే 44వ నంబరు జాతీయరహదారిలో మరూరు, గుత్తి సమీపంలోని కాశేపల్లి వద్ద టోల్‌ప్లాజాలున్నాయి. ఈ రెండింటి పరిధిలో 167 కి.మీ రహదారి ఉంది. పెంచిన ధర ఈనెల ఒకటి నుంచి అమలులోకి వచ్చింది. ఉరవకొండకు వెళ్లే దారిలో జల్లిపల్లి, కళ్యాణదుర్గం రోడ్డులో వడ్డుపల్లి, హిందూపురం సమీపాన చోళసముద్రం, రొళ్ల, బత్తలపల్లి, కదిరి సమీపంలో ఎర్రదొడ్డి, యాడికి సమీపంలోని జ్యోతిధర్మపురం వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వాటి పరిధిలో 409 కి.మీ రహదారి ఉంది. 9 టోల్‌ప్లాజాల నుంచి వారానికి రూ.4.43 కోట్లు ఆదాయం వస్తుండగా... ప్రస్తుతం పెరిగిన రుసుముల ప్రకారం రూ.4.57 కోట్లకు చేరనుంది.

**ఇక్కడ రూ.5..**

44వ నంబరు జాతీయ రహదారిలోని మరూరు, కాశేపల్లి టోల్‌ప్లాజాల వద్ద కార్లకు రూ.5 చొప్పున పెరిగింది. మరూరు టోల్‌ప్లాజాలో గతంలో కారు/జీపునకు రూ.140 ఉండగా రూ.145కు పెంచారు. బస్సు, లారీలకు రూ.470 గాను రూ.490కి పెరిగింది. రెండు యాక్సిల్స్ బస్సు, ట్రక్కులకు రూ.515 నుంచి రూ.530కి... నాలుగు యాక్సిల్స్ వాహనాలకు రూ.740 నుంచి రూ.765కి పెంచారు. ఒక్కో టోల్‌ప్లాజా వద్ద ఒక్కోరకంగా టోల్‌టాక్స్ నిర్ణయించారు. నాలుగు వరుసలు, రెండు వరుసల రహదారుల్లో టోల్ ధరల్లో మార్పులున్నాయి.

**కొన్నిచోట్ల కార్లకు పెరగలేదు** జ్యోతిధర్మపురం, బత్తలపల్లి, వడ్డుపల్లి, రొళ్ల టోల్‌ప్లాజాల వద్ద కార్లకు సుంకం పెరగలేదు. బస్సులు, లారీలు, ఇతర వాహనాలకు మాత్రం పెంచారు.

## సర్కారు ఇళ్లు.. ఎదురుచూపులకు ఆరేళ్లు

హిందూపురం : అద్దె ఇళ్లల్లో నివాసాలు ఉంటూ అష్టకష్టాలు పడుతున్న వేలాది మంది నిరుపేదలు ప్రభుత్వం అందించే పక్కా ఇంటితో సొంతింటి కల నెరవేరుతుందని ఆశించారు. హిందూపురం పట్టణానికి చెందిన 2,600 మంది పేదలు రూ.25వేలు, రూ.50వేల చొప్పున అప్పులు చేసి 2015లో మున్సిపాలిటీ వారికి డబ్బు చెల్లించారు. దీనికి కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.1.80 లక్షలు రుణం మంజూరు చేయగా బ్యాంకు వారు రూ.3 నుంచి 4లక్షలు రుణాలు అందించారు. ఇళ్ల నిర్మాణం చకచకా సాగి 1,200 ఇళ్లు 80 శాతం పూర్తి చేసుకొన్నాయి. ఇక మిగిలిన 20శాతం ఇళ్లు పూర్తయితే సొంతింటి కల నేరువేరుతుందని లబ్ధిదారులు ఆశించి అప్పట్లో సంబరపడ్డారు. 2019 ఎన్నికలు రావటం రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పాటైనా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామని వారు చెప్పి దాదాపు ఐదేళ్లు గడచినా ఇప్పటికీ ఒక్కరికీ ఇల్లు అప్పగించలేదు. దీంతో ఇళ్లకు ఏర్పాటు చేసిన కిటికీలు, మరుగుదొడ్ల బేషన్లు, సెల్ఫ్‌లు, పైపులు చోరీకి గురయ్యాయి. మరో కొంతకాలం గడిస్తే ఇళ్లు శిథిలావస్థకు చేరే అవకాశాలున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**20 శాతం నిర్మాణాలు పూర్తి చేస్తే..**

అసంపూర్తిగా నిలిచిన ఈ ఇళ్లను గత ఏడాది జులై 14న ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ పార్థసారథిలు పరిశీలించారు. హడ్కో నిధులతో మిగిలిన 20 శాతం నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. అయితే ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి చలనం లేక పోవటంతో కూటమి ప్రభుత్వంలోనైనా సొంతింటి కల నెరవేరుతుందా లేదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**త్వరగా పూర్తి చేసేలా చర్యలు – శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్** ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో నిధులు మంజూరైన వెంటనే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకొంటాం. ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ పార్థసారథి అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పరిశీలించారు.

# భూదాన భూమి ఇక అంతేనా..!



కాకినాడ: ఉమ్మడి జిల్లాలో కీలకమైన భూమి అది. విలువ రూ.వంద కోట్లు. ఎప్పుడెప్పుడు ఆక్రమించేద్దామా అని కొన్ని కళ్లు అక్కడే రెప్పలార్పకుండా చూస్తున్నాయి. ఇందుకోసం కొన్నాళ్లుగా చేయని ప్రయత్నం లేదు. ఆక్రమించడానికి వచ్చిన ప్రతిసారీ వ్యవహారం రచ్చకెక్కుతోంది. దీంతో పరిరక్షణ తమవల్ల కాదంటూ రెవెన్యూ యంత్రాంగమూ చేతులెత్తేసింది. కూటమి ప్రభుత్వమైనా తక్షణం రక్షణ కల్పించాలన్న అభ్యర్థనలు ఊపందుకున్నాయి.

అప్పుడు అలా: గత వైకాపా ప్రభుత్వంలో కాకినాడలోని ఆ పార్టీ నాయకుల దన్నుతో రాత్రికి రాత్రి చదును చేసి ఆక్రమించే ప్రయత్నాలు సాగాయి. చుట్టూ కందకాలు తవ్వి, హెచ్చరిక బోర్డులు పెట్టడానికి అప్పట్లో తహసీల్దారు జేసీబీ, రెవెన్యూ సిబ్బంది వెంటబెట్టుకుని వెళ్తే.. చీడీలపొర దగ్గర కాపుకాసిన వైకాపా నాయకుడి అనుచరులు బెదిరించి మరీ వెనక్కి పంపేశారు. రాత్రివేళలో సాక్షాత్తూ తహసీల్దార్ కాపలా కాసి, హెచ్చరిక బోర్డులు పెట్టినా అవి పీకేశారు. దీంతో యంత్రాంగం చేతులెత్తేసింది. వీటిని భూదాన బోర్డు స్థాయిలోనే పరిరక్షించుకోవాలని అప్పట్లో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏకు), రాష్ట్ర భూదాన బోర్డు ఛైర్మన్‌కు కలెక్టర్ లేఖ రాయడం చర్చనీయాంశమైంది. కాకినాడలోని ప్రభుత్వ ఐటీఐ వెనుక 4.07 ఎకరాల్లో భూదాన భూములు ఉన్నాయి. ఆ పక్కన 2.38 ఎకరాలు జిరాయితీగా రెవెన్యూ ఫెయిర్ అడంగల్‌లో ఉంది. ఈ మొత్తం స్థలాన్ని భూదాన భూమిగా పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ భూదాన బోర్డు 2014 జనవరి 20న ధ్రువీకరించి పేదలకు పట్టాలు ఇవ్వడానికి తీర్మానం చేసిందని కొందరు పత్రాలు చూపుతున్నారు. ఇక్కడ స్థలాలు కేటాయించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ భూమిపై ఓ వైపు న్యాయపరమైన చిక్కులు ఉండగానే.. తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించడానికి, ఏకంగా పత్రాలే లేకుండా కొట్టేయడానికీ ప్రయత్నాలు ఏళ్లుగా సాగుతున్నాయి. ఇప్పుడు ఇలా..: మొన్న ఎన్నికల సమయాన నిర్మాణ, ఇతర వ్యర్థాలు పోస్తూ భూదాన భూమిని డంపింగ్ యార్డుగా మార్చేశారు. ఆ మార్గంలో వెళ్లేవారు ఎవరుచూసినా ఇక్కడ ఆ రాశులే దర్శనమిస్తున్నాయి. తాజాగా ఈ రాశుల వెనుక కొంత భూమిలో ఇసుక పోసి, యంత్రాలు మోహరించడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో మళ్లీ ఆక్రమించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇక్కడ వ్యర్థాలు పోయడం వ్యూహాత్మకమేనా.. ఇదో డంపింగ్ యార్డుగా మార్చేస్తే అధికారులు చూసీచూడనట్లు ఎందుకు వదిలేస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. చుట్టూ రక్షణ కంచె ఏర్పాటులో తాత్సారంతోనే ఆక్రమణ ప్రయత్నాలు ఊపందుకున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# నకిలీ పట్టాలతో గృహనిర్మాణాలు



గుత్తి : గుత్తి పురపాలికలో నకిలీ పట్టాలు పుట్టుకొస్తున్నాయి. వీటి ద్వారా రిజర్వుడు స్థలాల్లో పక్కా గృహాలు వెలుస్తున్నాయి. కొందరు నాయకులు నకిలీ పట్టాలు సృష్టించే ముఠాను తయారు చేశారు. తమ అవసరాలకు ముఠాతో చేతులు కలిపి తమకు కావాల్సిన విధంగా పట్టాలను తయారు చేయించుకుంటున్నారు. ఒక్కో పట్టాకు రూ.2–3వేలు తీసుకుంటున్నారు.

**వాస్తవాలు పరిశీలించకుండానే ఆమోదం**

తాజాగా కూటమి ప్రభుత్వం పక్కాగృహాల నిర్మాణ వ్యయాన్ని రూ.4.30 లక్షలకు పెంచాలని యోచిస్తోంది. ఈక్రమంలో చాలా మంది నకిలీ పట్టాలతో సొంతింటి కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇంటి పట్టాలపై గృహనిర్మాణశాఖ ఇంజినీర్లు నిఘా పెట్టడం లేదు. దరఖాస్తులో ప్రజలు కనబరుస్తున్న పట్టాలు నకిలీవా? నిజమైనవా? అనే పరిశీలించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు స్థలాలు ఉండి పట్టాలున్నవారు గుత్తి పురపాలికలోని చెట్నేపల్లి, గుత్తిఆర్.ఎస్. లలో 203 మంది పక్కాగృహాలకు దరఖాస్తు చేసుకున్నారు.

**డొంక కదులుతోందిలా..**


గుత్తి పురపాలికలో కొందరు నకిలీ పట్టాలతో ఇంటిపన్నుల విధింపు కోసం అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఒకరిపేరు నుంచి మరొకరిపేరుతో ఇంటి గుత్తలు వేయించుకునేందుకు నకిలీ పట్టాలను ఇస్తున్నారు. ఇటీవల కమిషనర్ జబ్బార్‌మియా ఇలాంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచారు. రెవెన్యూ దస్త్రాల్లో పక్కాగా ఉంటేనే గుత్తలను ఒకరిపేరు నుంచి మరొకరి పేరుపై మార్చుతున్నారు. రెవెన్యూ అధికారులు రికార్డులను సరిచూసి అసలు, నకిలీలను తేల్చుతున్నారు. ఒక్కొక్కటిగా మోసాలు బయటపడుతున్నాయని కమిషనర్ చెబుతున్నారు.

**ఇష్టారాజ్యంగా...**

గుత్తిలో నకిలీ పట్టాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈఒక్క పురపాలికలోనే సుమారు వెయ్యి పట్టాలున్నట్లు విశ్వసనీయ సమాచారం. 2019లో కొందరు పురపాలిక రిజర్వుడు స్థలాలను ఆక్రమించుకున్నారు. నకిలీ పట్టాలతో పక్కాఇళ్లను నిర్మించుకున్నారు. సర్వేనంబర్ 411, 413లలోని రూ.కోట్లు విలువైన 1.99 ఎకరాలు రిజర్వుడు స్థలం అన్యాక్రాంతం అయింది. ఓ నాయకుడి ద్వారా నకిలీ పట్టాతో ప్రభుత్వంతో ఇళ్లను పొందారు. సర్వేనంబర్ 609లో కొందరు అక్రమంగా ఇళ్లను నిర్మించుకుని నకిలీ పట్టాలు తమ వద్ద ఉంచుకున్నారు. నెల కిందట చెట్నేపల్లిలో కొందరు ఇళ్ల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. చెర్లోపల్లి కాలనీలోని ఓ నాయకుడు మూడు సెంట్ల స్థలానికి బోగస్ పట్టా తీసుకుని ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు. గుత్తిలోని సర్వేనంబరు 703లో ఓ నాయకుడు వెంచర్ వేసి ప్రజలకు ప్లాట్లు విక్రయించి బోగస్ పట్టాలు ఇచ్చి చేతులు దులిపేసుకున్నాడు. మరికొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తూ ఇతరులకు విక్రయిస్తు న్నారు.

**తగిన చర్యలు తీసుకుంటాం..–సూర్యనారాయణ, ఏఈఈ, గృహనిర్మాణశాఖ, గుత్తి** అక్రమార్కులు పక్కాగృహాలకోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వాటిపై ప్రత్యేకంగా నిఘా ఉంచాం. కొత్తగా మంజూరు కాబోయే ఇళ్లకు నకిలీ పట్టాలు వస్తున్నాయి. కొన్నింటిని తాము గుర్తిస్తున్నాం. గుత్తికి చెందిన ఓ వ్యక్తి నేమితాబాదు జగనన్న కాలనీలో తనకు ప్లాటు ఉందని, నకిలీ పట్టాతో ఆశ్రయించగా నకిలీదని గుర్తించాం. తగిన చర్యలు తీసుకుంటాం.

# ఇంటర్ ప్రవేశాలకు వేళాయె




అనంతపురం : ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థలో కూటమి ప్రభుత్వం సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రైవేటు, కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తోంది. ఇంటర్ పూర్తి చేసిన తరువాత ఎక్కువశాతం విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్‌వైపు ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులు అభిరుచికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక విద్యలోనూ మార్పులు చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈనెల ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభించారు. ఇంతవరకు ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకాలను విద్యార్థులు అభ్యసించారు. నూతన జాతీయ విధానం ప్రకారం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను ప్రవేశపెట్టనున్నారు. ఈనెల 1 నుంచి 23 వరకు తరగతులు నిర్వహిస్తారు. 24 నుంచి మే 30 వరకు వేసవి సెలవులు ఉంటాయి. జూన్ 1న కళాశాలలు పునః ప్రారంభమవుతాయి.

**ఈనెల 7 నుంచి మొదటి సంవత్సరం...**

పదో తరగతి పరీక్ష ఫలితాలు రాకముందే మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 1 నుంచి దరఖాస్తులు ఇస్తున్నారు. 7వ తేదీ నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించి... మే 31 వరకు చేపడతారు. 7 నుంచే విద్యార్థులకు తరగతులు ఆరంభమవుతాయి. పదో తరగతి పరీక్షల మూల్యాంకనం ఈనెల 3 నుంచి 9 దాకా జరగనుంది. ఫలితాలు ప్రకటించడానికి మరికొన్ని రోజులు పడుతుంది. అప్పటి లోపే తాత్కాలిక ప్రవేశాల ప్రక్రియ చేపడతారు. ఉత్తీర్ణతపై ధీమా ఉన్న విద్యార్థులు చేరడానికి దరఖాస్తు చేయనున్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 23 వరకు తరగతులు ఉంటాయి. 24 నుంచి మే 30 వరకు సెలవులు ఇస్తారు. జూన్ 1 నుంచి యథాతథంగా తరగతులు కొనసాగుతాయి.

**దరఖాస్తుకు హాల్‌టికెట్ జత చేయాలి – వెంకటరమణనాయక్, జూనియర్ కళాశాలల ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి**

ఇంటర్ బోర్డు ఆదేశాల ప్రకారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తాం. దరఖాస్తులో పదో తరగతి హాల్‌టికెట్ జతచేసి అడ్మిషన్ తీసుకోవచ్చు. ఫలితాలు వచ్చిన తరువాత ప్రవేశాలకు గుర్తింపు ఇస్తాం.

## పీహెచ్‌సీలకు సుస్తీ

కుప్పం : ఎండలు మండి పోతున్నాయి. ఆపై వడగాలుల తీవ్రతకు అన్నివర్గాల వారు వడదెబ్బకు గురవుతున్నారు. అయితే ఆయా పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత, మొరాయించిన యంత్రాలతో ప్రజలు వైద్యసేవలకు దూరమవుతున్నారు. సిబ్బంది ఉంటే మందులు ఉండవు.. మందులు ఉంటే సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తే ప్రైవేటు వైద్యసేవల వ్యయభారం తగ్గుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

**అనతి కాలానికే మూలకు**

కుప్పం ప్రాంతీయ ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ అనతి కాలానికే మూతపడింది. నిర్వహణ లేమితో అలంకారప్రాయంగా మిగిలింది. కొవిడ్ సమయంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన ప్లాంట్ వినియోగానికి



దూరంగా ఉంది. రోగుల అవసరాలకు ప్రస్తుతం ఆక్సిజన్ సిలిండర్లను కొనుగోలు చేయాల్సి పరిస్థితి ఏర్పడింది.

**40 కి.మీ. ప్రయాణించి..:** ఈమె పేరు రోజా. పలమనేరు మండలం చెత్తపెంట గ్రామం. తమిళనాడు సమీపంలో ఈ గ్రామం ఉంటుంది. అక్కడి నుంచి 20 కి.మీ. దూరం బస్సులో ప్రయాణం చేసి పలమనేరుకు వచ్చి అక్కడి నుంచి మరో 20 కి.మీ. దూరం కొలమాసనపల్లె ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. ఇక్కడ ఆరోగ్య సిబ్బంది బాగా సేవలందిస్తుండటంతో కొలమాసనపల్లె వస్తున్నట్లు తెలిపింది. ఇక్కడ రోజుకు వంద మందికి పైగా రోగులు ఓపీకి వస్తుంటారు.

## డీపీఆర్‌సీ పంచాయితీ తీరేదెన్నడో?

చిత్తూరు : జిల్లా పంచాయతీ ఉద్యోగుల శిక్షణ కేంద్రం(డీపీఆర్‌సీ) జిల్లాకు మంజూరై నిధుల విడుదలైనా ఇంకా స్థల పరిశీలనలో ఉంది. దీన్ని చిత్తూరులో నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు భావిస్తుండగా.. పంచాయతీరాజ్‌లోని ఇద్దరు అధికారులు మోకాలడ్డాలని చూడటం విమర్శలకు తావిస్తోంది. డీపీఆర్‌సీ భవనం చిత్తూరులో ఏర్పాటుచేస్తే ఉన్నతాధికారులు, పంచాయతీరాజ్ ఉద్యోగులకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికే ఈ కేంద్ర నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చొరవతో జిల్లా అధికారులు స్థలాన్వేషణ చేశారు.

**అధికారుల తీరుపై విమర్శలు**

చిత్తూరులో స్థలం ఖరారయ్యే సమయంలో పంచాయతీరాజ్‌కి చెందిన ఇద్దరు అధికారులు ఈ కేంద్రాన్ని గంగాధరనెల్లూరు మండలంలో ఏర్పాటు చేయాలని పావులు కదిపారు. తూగుండ్రంలోని స్థలాన్ని చూడగా కోర్టు కేసు వివాదం వచ్చింది. ఇదే మండలంలో మరోచోట స్థలాన్ని అధికారులు పరిశీలించడం విమర్శలకు తావిచ్చింది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములు ఉండగా వేరేచోట ఈ కేంద్రం ఏర్పాటు చేయాలనే చూడటాన్ని పలువురు తప్పుబడుతున్నారు.



**చిత్తూరులో ఇన్ని స్థలాలుండగా..**

చిత్తూరులో జిల్లా పోలీసు కార్యాలయం, రోడ్డు రవాణా శాఖ కార్యాలయాలకు సమీపంలో ప్రభుత్వ భూమి ఉంది. మరో స్థలం పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల వెనుక ఉంది. ఈ రెండింటిలో ఎక్కడో ఓచోట శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తే అనువుగా ఉంటుందని పరిశీలించారు. రెడ్డిగుంట నుంచి ఇరువారం బైపాస్ రోడ్డు సమీపాన స్థలం ఉందని, అక్కడ భవనాన్ని నిర్మించే విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్చించారని సమాచారం.

**స్పష్టత రాకుంటే కష్టమే..**

భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేయగా.. ఇంకా స్థల పరిశీలనపై స్పష్టత రాలేదు. ఇంకా జాప్యం జరిగితే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

**ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి..**

ఈ శిక్షణ కేంద్రాన్ని చిత్తూరులో ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఇటీవల చిత్తూరు వచ్చినప్పుడు తెదేపా నాయకులు వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. జిల్లా అధికారులు గంగాధరనెల్లూరు మండలంలో నిర్మించాలని టెండర్ పిలిచారని మంత్రికి ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారని సమాచారం.

## డీకేటీ.. అయితే ఏంటి?

రేణిగుంట: వైకాపా హయాంలో రేణిగుంట మండలంలో కనిపించిన ప్రభుత్వ స్థలాలు, డీకేటీలను కబ్జా చేసిన సదరు పార్టీ నేతలు ఇప్పుడు వాటిని కాసులుగా మలచుకునేందుకు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. మీరు స్థలం కొనండి.. ఇళ్లు నిర్మించుకోండి.. అన్ని మౌలిక వసతులకు అనుమతిలిప్పించే పూచీ మాదంటూ దందా సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. కొన్ని నెలలు మిన్నకున్న వీరికి ఇప్పుడు కొత్తగా రెక్కలు వచ్చాయి. అడ్డగోలు అనుమతుల ఆశచూపి.. సామాన్యులకు స్థలాలు కట్టబెట్టి అందిన కాడికి దోచుకుంటున్నారు.

రేణిగుంట మండలంలో డీకేటీ భూములు కబ్జాకు గురైన ప్రాంతాల్లో కరకంబాడి రెవెన్యూ పరిధిలోని చెంగారెడ్డిపల్లె ఒకటి. ఇక్కడి సర్వే నంబర్ 547లో కొందరు పేదలకు సాగు చేసుకునేందుకు గతంలో డీకేటీ భూములు ఇచ్చారు. వైకాపా హయాంలో స్థానిక నేత ఇక్కడి రైతులను మభ్యపెట్టి ఈ భూముల్లో పాగా వేశాడు. ప్రస్తుతం ఇందులో రేకుల షెడ్డుతో ఇళ్లు నిర్మించి.. ఒక్కో దాన్ని రూ.10 లక్షలు చొప్పున విక్రయిస్తున్నాడు. దీనికి పంచాయతీ నుంచి ఎన్‌వోసీ, విద్యుత్తు కనెక్షన్ కూడా ఇప్పిస్తుండటం గమనార్హం.

## ప్రగ్యా జైస్వాల్.. ట్రెడిషనల్ డ్రెస్సులో స్టన్నింగ్ గ్లామర్ డోస్

టాలీవుడ్ లో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యా జైస్వాల్, సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటూ ఫ్యాన్స్ ను అలరిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. పెళ్లి వేడుకలో తళుక్కుమన్న ప్రగ్యా అందమైన పింక్ శారీ లో మెరిసిపోతోంది. ఈ స్పెషల్ ఫోటోషూట్‌లో ఆమె సంప్రదాయ లుక్ కు గ్లామర్ టచ్‌ను మిక్స్ చేసింది. కాస్త వెస్టన్ టచ్ ఉన్న స్టైలిష్ లుక్ తో ఆమె నవ్వుతూ ఫోజులిస్తూ అభిమానులకు కనువిందు అందించింది. ఈ లుక్స్ లో ప్రగ్యా మెరిసిన విధానం చూసిన నెటిజన్లు ఆమె స్టైల్ సెన్స్ గురించి ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఫోటోల్లో ఆమె వేసుకున్న పింక్ శారీ డిజైనర్ కలెక్షన్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రమంగా ఆమె ఫ్యాషన్ అభిరుచి



మరింతగా మెరుగు పడుతుండటం స్పష్టంగా కనిపిస్తోంది. మ్యాచింగ్ జ్యువెలరీ తో ప్రగ్యా అందానికి అదనపు మెరుపు వచ్చింది. స్టైలింగ్ డిజైనర్ మనోగ్న గోల్లపూడి ఈ లుక్ ను డిజైన్ చేయడం విశేషం. ఆభరణాల ఎంపిక కూడా ఆమె లుక్ కి మరింత అందాన్ని తెచ్చింది. ఆమె మేకప్ స్టన్నింగ్ గా ఉండటంతో పాటు, ఆమె కురులు తళుక్కుమన్న తీరు అభిమానులను కట్టిపడేస్తోంది. ఈ ఫోటోల గురించి ప్రగ్యా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆసక్తికరమైన క్యాప్షన్ ఇచ్చింది. "ప్రేమతో నిండిన రోజులు, మాయతో నిండిన రాత్రులు.." అంటూ ఆమె ఈ వేడుకలో గడిపిన సమయాన్ని గుర్తుచేసుకుంది.

బహ్రైన్ లో జరిగిన ఓ పెళ్లి వేడుక సందర్భంగా ఈ ఫోటోలు తీయించుకున్నట్టు ఆమె క్యాప్షన్ ద్వారా వెల్లడించింది. ఫ్రెండ్ వెడ్డింగ్ లో పాల్గొన్న ఈ బ్యూటీ అక్కడ తన లుక్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ వేడుక తాలూకు ఫోటోలు ఆమె ఇన్‌స్టాలో షేర్ చేయగా, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. "గ్లామర్ క్వీన్" అంటూ అనేక మంది ఆమె అందాన్ని మెచ్చుకుంటున్నారు. ప్రగ్యా ప్రస్తుతం తన కొత్త ప్రాజెక్ట్ లతో బిజీగా ఉంది. టాలీవుడ్ లో తనకంటూ సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకోవాలని ప్రయత్నిస్తోంది.

## ఈమె అందాల ఐశ్వర్యం

కేరళలో పుట్టి పెరిగిన ముద్దుగుమ్మ ఐశ్వర్య మీనన్ తమిళ్ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. 2012లో 'కాదలిల్ సోదప్పువదు యెప్పడి'లో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా ప్రేక్షకులకు పరిచయం అయింది. తక్కువ సమయంలోనే కోలీవుడ్‌లో ఈ అమ్మడికి గుర్తింపు లభించింది. 2013 నుంచి వరుసగా తమిళ్ సినిమాలు చేస్తూ వస్తున్న ఐశ్వర్య మీనన్ పలువురు స్టార్ హీరోల సినిమాల్లో కనిపించి అక్కడ స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. తమిళ్‌తో పాటు కన్నడ సినిమాలోనూ నటించే అవకాశాన్ని ఐశ్వర్య మీనన్ సొంతం చేసుకుంది. తెలుగులో స్పై, భజే వాయు వేగమ్ సినిమాల్లో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అయింది. సోషల్



మీడియాలో 3.2 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఐశ్వర్య మీనన్ రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తద్వార తన ఫాలోవర్స్‌కి వినోదాన్ని పంచుతూ ఉంటుంది. తాజాగా మరోసారి ఐశ్వర్య మీనన్ అందమైన ఫోటోలను షేర్ చేసింది. క్యూట్ ఐశ్వర్య మీనన్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎక్కువ స్కిన్ షో చేయకున్నా ఐశ్వర్య మీనన్ ఫోటోలు ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటాయి. చూడ్డానికి నాజూకుగా కనిపిస్తూ ఉండే ఐశ్వర్య మీనన్ మరోసారి తన సుందరమైన లుక్ ఫోటోలను అత్యంత స్టైలిష్‌గా ఉన్న రూపంను ఫోటోల రూపంలో షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. ఎంతో మంది హీరోయిన్స్‌తో పోల్చితే ఐశ్వర్య మీనన్ అందం విషయంలో టాప్ ఉంటుందని, కానీ ఈమెకు దక్కాల్సిన గుర్తింపు దక్కడం లేదు, రావాల్సిన ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఈమె నటించిన రెండు సినిమాలు పెద్దగా ఆడలేదు. దాంతో తెలుగులో ఈమెకు మరో ఆఫర్ ఇప్పటి వరకు రాలేదు. ముందు ముందు అయినా తెలుగులో ఈమెకు మంచి గుర్తింపు దక్కాలంటూ ఈ ఫోటోలు చూసిన వారు కామెంట్ చేస్తున్నారు.




## కిష్కింధపురి గ్లింప్స్... శ్రీనివాస్ ఇంప్రెస్సివ్ హార్రర్ ప్రయోగం




టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఓ వైపు హైంధవం, టైసన్ నాయుడు సినిమాలను పూర్తి చేసే పనిలో ఉన్న శ్రీనివాస్, ఈ రెండింటితో పాటూ ఇప్పుడు మరో సినిమాను లైన్ లో పెట్టాడు. అదే బీఎస్ఎస్11. శ్రీనివాస్ కెరీర్లో 11వ చిత్రంగా ఈ మూవీ తెరకెక్కుతుంది. రీసెంట్ గా మేకర్స్ ఈ సినిమాకు టైటిల్ ను రివీల్ చేయగా ఇప్పుడు గ్లింప్స్ ను రిలీజ్ చేశారు. కౌశిక్ పెగిల్లపాటి దర్శకత్వంలో తెరకెక్కిన కిష్కింధకాండలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తోంది. మేకర్స్ రిలీజ్ చేసిన ఈ గ్లింప్స్ ఆద్యంతం ఆసక్తి నెలకొల్పుతూ ఉత్కంఠ రేపేలా ఉంది. హార్రర్ థ్రిల్లర్ గా ఈ మూవీ తెరకెక్కుతున్న గ్లింప్స్ చూస్తే అర్థమవుతుంది. ఎప్పుడైనా సరే హార్రర్ కు సరైన సస్పెన్స్ యాడ్ అయితే అది సూపర్ హిట్ కాంబినేషన్ గా నిలవడం ఖాయం. ఇప్పుడు కిష్కింధపురిలో కూడా కౌశిక అలాంటి ప్రయోగమే చేస్తున్నట్టు అనిపిస్తుంది. ఓ పాడు బడిన ఇంట్లో ఎంతో కాలంగా మూసేసి ఉన్న రూమ్ ను తెరవడం వల్ల జరిగే అనర్థాలు ఎలా ఉంటాయనే దాని ఆధారంగా సినిమా ఉండనున్నట్టు గ్లింప్స్ లో చూపించారు. కొన్ని తలుపులు ఎప్పటికీ ఓపెన్ చేయకూడదు, కొన్ని గొంతులు ఎప్పటికీ వినకూడదంటూ రిలీజ్ చేసిన గ్లింప్స్ ఎంతో ఇంట్రెస్టింగ్ గా ఉంది. ఈ గ్లింప్స్ లో సినిమాటోగ్రఫీ హైలైట్ గా నిలవగా, సామ్ సి.ఎస్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ స్పెషల్ ఎట్రాక్షన్ గా మారింది. అప్పట్లో శ్రీనివాస్, అనుపమ కలిసి రాక్షసుడు అనే క్రైమ్ థ్రిల్లర్ చేసి హిట్ అందుకోగా, ఇప్పుడు మరోసారి ఇద్దరూ కలిసి హార్రర్ థ్రిల్లర్ చేస్తున్నారు. మరి కిష్కింధకాండ ఈ జంటకు ఎలాంటి ఫలితాన్నిస్తుందో చూడాలి. గ్లింప్స్ చూస్తుంటే ఈసారి బెల్లంకొండ శ్రీనివాస్ ఏదో గట్టిగానే ట్రై చేసినట్టు అనిపిస్తుంది.


## రాజాసాబ్ టీజర్.. ఈ కన్ఫ్యూజన్ తీరేదెప్పుడంటే..



టాలీవుడ్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ది రాజాసాబ్' సినిమా కోసం అభిమానులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మారుతి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ రొమాంటిక్ హారర్ కామెడీ సినిమా షూటింగ్ అప్డేట్ కోసం కూడా సోషల్ మీడియాలో తరచుగా చిత్ర యూనిట్ కు రిక్వెస్ట్ లు పెడుతున్నారు. ముఖ్యంగా సినిమా టీజర్ కోసం ఫ్యాన్స్ ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. సినిమాలో మలవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. థమన్ ఎస్ సంగీతం, కార్తీక్ పళని సినిమాటోగ్రఫీతో సినిమా విజువల్‌గా గ్రాండ్‌గా ఉంటుందని అంటున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాకు అడ్వాంటేజ్ ఏంటంటే, ఇటీవల పెద్ద హీరోల సినిమాలు సీరియస్ జోనర్‌లోనే ఎక్కువగా వచ్చాయి. 'సలార్', 'కల్కి 2898 ' లాంటి యాక్షన్, సినిమాలతో ప్రేక్షకులు కాస్త బోర్ ఫీలయ్యారు. అలాంటి సమయంలో 'ది రాజాసాబ్' లాంటి ఫుల్ హారర్ కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ రావడం ఫ్యాన్స్‌కు ఫ్రెష్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఈ సినిమా హారర్, రొమాన్స్, కామెడీని సమపాళ్లలో మిక్స్ చేస్తూ ప్రభాస్‌ను కొత్త లుక్‌లో చూపించనుంది. ఇక సినిమా రిలీజ్ డేట్ ఇప్పటికే పలుసార్లు వాయిదా పడింది. ఇక టీజర్ రిలీక్ డేట్ విషయంలో ఎప్పుడు క్లారిటీ ఇస్తారో అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ విదేశాల్లో ఉన్నాడు, అతను తిరిగి వచ్చిన వెంటనే టీజర్ డబ్బింగ్ పూర్తి చేసి మే 2025లో విడుదల చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోంది. ఈ టీజర్ సినిమాపై హైప్‌ను మరింత పెంచనుంది. 'ది రాజాసాబ్' సినిమాలో ప్రభాస్ డబుల్ రోల్‌లో కనిపించనున్నట్టు టాక్. థియేటర్ ఓనర్‌గా, గోస్ట్‌గా సర్ ప్రైజ్ ఇవ్వనున్నట్లు గాసిప్స్ వస్తున్నాయి. సినిమా షూటింగ్ దాదాపు 85% పూర్తయింది. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో క్లైమాక్స్ సీన్స్‌తో పాటు కొన్ని కామెడీ సీన్స్ చిత్రీకరించనున్నారు. మిగిలిన పాటలు, ప్యాచ్‌వర్క్ సమ్మర్ లోపీ పూర్తవుతాయి. సినిమాలో భారీ %ఎఫీశ% వర్క్ ఉండటంతో పోస్ట్ ప్రొడక్షన్ కోసం సమయం తీసుకుంటున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 2025లో రిలీజ్ కానుందని సమాచారం. ఇక టీజర్ లో రిలీజ్ విషయంలో ఫైనల్ గా క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## జాన్వీ కపూర్.. గోల్డెన్ గ్లామర్‌లో మెరిసిన అందం

బాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి జాన్వీ కపూర్ మరోసారి తన గ్లామర్‌తో హాట్ టాపిక్ గా మారింది. తన మొదటి సోలో డాన్స్ నంబర్ 'నడియోన్ పార్' కి సంబంధించిన తన అనుభవాలను పంచుకుంటూ గోల్డెన్ డ్రెస్‌లో స్టన్నింగ్ ఫోటోషూట్ చేసింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ అవుట్‌ఫిట్ స్పెషల్ గా ఒకే రోజు డిజైన్ చేయించుకోవడం గమనార్హం. మణీష్ మల్హోత్రా డిజైనింగ్‌లో మెరిసిన ఈ గోల్డెన్ డ్రెస్‌లో జాన్వీ అందాల విందు చేస్తూ ఫ్యాషన్ స్టేట్‌మెంట్ క్రియేట్ చేసింది. ఈ డాన్స్ నంబర్ కోసం జాన్వీ మూడు రోజుల పాటు రిహార్సల్స్ చేసింది. మధ్యలో 'గుడ్ లక్ జెర్రీ' సినిమా షూటింగ్ చేసుకుంటూ, పాటియాలా లో రాత్రంతా షూట్ చేసి, ఉదయాన్నే ముంబైకి తిరిగొచ్చి 'నడియోన్ పార్' సాంగ్‌ను ఏడు గంటల్లో పూర్తి చేసేసిందట. అంతేకాదు, ఏ



మాత్రం నిద్ర లేకుండా మళ్లీ షూటింగ్ లోకి వెళ్లడం తనకు నిజంగా ఓ మైండ్ బ్లోయింగ్ అనుభవంగా అనిపించిందని చెప్పింది. ఏ మాత్రం అలసట లేకుండా, అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్స్, గ్రేస్‌ఫుల్ మూమెంట్స్ తో ఈ పాటను పూర్తి చేయడం ఆమె కెరీర్‌లో ఒక స్పెషల్ అచీవ్‌మెంట్ గా నిలిచింది. ఈ గోల్డెన్ అవుట్‌ఫిట్ కేవలం 24 గంటల్లో తయారు చేయించుకున్నట్లు జాన్వీ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ లో తెలిపింది. మణీష్ మల్హోత్రా చివరి నిమిషంలో తన కోసం ఈ డ్రెస్ డిజైన్ చేశారని, అతను నిజంగా ఓ నైట్ ఇన్ షైనింగ్ ఆర్మర్ లాంటివారని కామెంట్ చేసింది.కత్రినా కైఫ్ తనకు స్టైలింగ్, మేకప్, డాన్స్ విషయాల్లో ఇన్‌స్పిరేషన్ అని పేర్కొనడం విశేషం. జాన్వీ గ్లామరస్ లుక్స్ కు బాలీవుడ్ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. గోల్డెన్ కలర్ లో ఆమె మెరుపులు పూయించిన ఈ ఫోటోషూట్ ఆమె అభిమానులకు మరింత కనువిందు చేసింది. 'రూహి' సినిమాకు నేటితో నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భం లో ఈ డాన్స్ నంబర్ ఆమె కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైనదని చెప్పింది. మొదటి సోలో డాన్స్ నంబర్ కావడంతో ఎంతో నర్వస్ గా ఫీల్ అయ్యానని, లైట్స్ కింద మళ్లీ మళ్లీ కళ్ళు మూసుకునేదానినని, కానీ చివరికి ఫైనల్ అవుట్‌పుట్ చూసి ఎంతో సంతృప్తి కలిగిందని చెప్పింది.

## మీరు వర్జినా? అనేసరికి హీరోయిన్ ఏం చెప్పిందంటే..

సోషల్ మీడియా ఇప్పుడు సెలబ్రిటీలకు ఓ వేదికే కాదు, పలు సందర్భాల్లో వారికి ఇబ్బందికరమైన అనుభవాలకూ కారణమవుతోంది. సినిమాల్లో ఎంత బోల్డ్‌గా కనిపించినా, వ్యక్తిగతంగా కొన్ని హద్దులు ఉండాలని భావించే హీరోయిన్లకు నెటిజన్లు కొన్ని ప్రశ్నలు అడిగితే మాత్రం సహనం కోల్పోతారు. తాజాగా తమిళం నుంచి బాలీవుడ్ వరకూ తన అందంతో, నటనతో ఆకట్టుకుంటున్న మాళవిక మోహనన్ ఈ విషయంలో నెటిజన్లకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. తన సినిమాల విషయాన్ని పక్కనపెడితే, మాళవిక సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. తన ఫాలోవర్స్‌తో రెగ్యులర్‌గా ఇంటరాక్ట్ అవుతూ, వారికి సమాధానాలు ఇస్తుంది. అయితే ఇటీవలి కాలంలో ఆమెకు వచ్చిన కొన్ని ప్రశ్నలు ఊహించనివి. ఎప్పటిలాగే ఓ ట్విట్టర్ సెషన్‌లో ఫ్యాన్స్ కొన్ని సాధారణ ప్రశ్నలు



అడిగితే, మరికొంతమంది మాత్రం హద్దులు మీరేలా ప్రశ్నలు సంధించారు. ఇందులో ఓ నెటిజన్ తనను పెళ్లి చేసుకోవాలంటూ అడిగితే, మాళవిక అసహనం వ్యక్తం చేసింది. అయితే పెళ్లి ప్రస్తావన వద్దనుకుంటే, మరో నెటిజన్ అడిగిన ప్రశ్న మరింత దారుణం. "మీరు వర్జినా?" అంటూ ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నను చూసి మాళవిక అసహనానికి గురైంది. ఇలాంటి అసభ్యకరమైన ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారని స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. "ఇలాంటి చెత్త ప్రశ్నలు అడగడం మానేయండి" అంటూ తిప్పికొట్టింది. దీనితో ఆ నెటిజన్ తన పోస్ట్‌ను వెంటనే డిలీట్ చేసేసినా, అప్పటికే స్క్రీన్‌షాట్లు వైరల్ కావడం గమనార్హం. ఇలాంటి అనవసరమైన ప్రశ్నలు అడిగే నెటిజన్ల గురించి మాళవిక తన బాధను వ్యక్తం చేసింది. గతంలోనూ పలు హీరోయిన్లు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నా, చాలా మంది కనీసం స్పందించలేదు. కానీ మాళవిక మాత్రం నేరుగా సమాధానం ఇవ్వడమే కాదు, నెటిజన్ల ప్రవర్తనను కూడా ప్రశ్నించడం ప్రత్యేకం. ప్రస్తుతం మాళవిక ప్రభాస్ సరసన 'ద రాజా సాబ్'లో నటిస్తోంది. దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ సినిమా మాళవికకు టాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చేలా ఉండబోతోందని టాక్. ఇదే సమయంలో బాలీవుడ్‌లోనూ సినిమాలు చేస్తూ తన మార్కెట్‌ను పెంచుకునే పనిలో ఉంది. కెరీర్ పరంగా ఇలా ఎదుగుతూ, సోషల్ మీడియాలో కూడా తనదైన స్ట్రాంగ్ స్టాండ్‌తో నిలబడుతున్న మాళవిక నెటిజన్లకు మంచి లెస్సన్ ఇచ్చిందని చెప్పుకోవాలి. ఇలాంటి సందర్భాల్లో సెలబ్రిటీలు ఎక్కువగా మౌనం పాటిస్తారు కానీ, మాళవిక మాత్రం స్ట్రైట్‌గా స్పందించి ట్రోల్లింగ్‌ను ఎదుర్కోవడం ఆమె ధైర్యానికి నిదర్శనం. ఈ ఘటనతో ఇకపై ఎవరైనా ఆమెకు ఇలాంటి అసభ్యమైన ప్రశ్నలు అడగాలంటే కాస్త ఆలోచించాల్సిందే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536